thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com


RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 83 | జగిత్యాల | శుక్రవారం | 19 జూన్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

కాంగో షాక్.. పోర్చుగల్‌కు డ్రా



11



# 30న రైతు భరోసా!

- మధిర వేదికగా రైతుల ఖాతాల్లోకి నిధులు
- ఏడు రకాల సన్నాలకు బోనస్ ఇవ్వాలని నిర్ణయం
- ధాన్యం కొనుగోళ్లపై కేంద్రం తీరుకు నిరసన
- మెట్రో రెండో దశ అనుమతుల కోసం త్వరలో ఢిల్లీకి
- ఇకపై డిజిటల్ విధానంలో మంత్రివర్గ సమావేశాలు
- కేబినెట్ నిర్ణయాలను వెల్లడించిన మంత్రి ఉత్తమ్

## వానకాలం సాగుకు రైతులకు ప్రభుత్వం అండ



వానకాలం సాగుకు సన్నద్ధమవుతున్న రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. ఈ నెల 30న రైతు భరోసా నిధులను విడుదల చేయాలని సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో జరిగిన కేబినెట్ భేటీలో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా మధిరలో భారీ ఎత్తున నిర్వహించనున్న బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి ఈ నిధులను అధికారికంగా విడుదల చేయనుండగా.. అక్కడి నుంచి వరుసగా 9 రోజుల పాటు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో ఈ నగదు జమ కానుంది.పెట్టుబడి సాయంతో పాటు మార్కెట్ డిమాండ్ కు అనుగుణంగా 7 రకాల సన్న బియ్యానికి బోనస్ అందించాలని మంత్రివర్గం తీర్మానించింది. రైతాంగ సమస్యలు, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పెండింగ్ ప్రాజెక్టులు, మెట్రో రెండో దశ అనుమతుల సాధన కోసం త్వరలో మంత్రుల బృందం ఢిల్లీకి వెళ్లనుంది. వీటితో పాటు ఈ నెల 21న నీట్ పరీక్ష రాసే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని మంత్రివర్గం నిర్ణయించింది. పాలనలో మరింత పారదర్శకత, వేగం పెంచే క్రమంలో ఇకపై కేబినెట్ సమావేశాలను పూర్తిగా డిజిటల్ విధానంలోనే నిర్వహించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

- ఉద్యమ కెరటం, హైదరాబాద్, జూన్ 18

మిగతా 2 లో

# పేదల జోలికి హైడ్రా వెళ్లదు!


## కబ్జాదారుల భరతం పడుతుంది

- మురికి కన్నా కల్వకుంట్ల విషమే ప్రమాదం
- ఎవరు అడ్డుపడినా మూసీ ప్రక్షాళన ఆగదు
- గుర్రంగూడ ఎకో పార్క్ లో సీఎం రేవంత్ రెడ్డి



## హైదరాబాద్‌లో జనసేన ఆఫీస్

- నేడు ప్రారంభించనున్న పవన్ కల్యాణ్
- మల్కం చెరువు వద్ద నూతన భవనం
- తెలంగాణలో పార్టీ బలోపేతంపై దృష్టి



2

# బీజేపీ నేత సహా ముగ్గురు సజీవ దహనం

- ఇసుక వివాదం రక్తపాతం
- ఛత్తీస్‌గఢ్‌లో సంచలనం



ఛత్తీస్‌గఢ్‌లోని కోరియా జిల్లాలో ఇసుక మైనింగ్ వివాదం ఘోర హత్యాకాండకు దారితీసింది. బీజేపీ నేత, మాజీ జనపద్ పంచాయతీ అధ్యక్షుడు భరత్ సింగ్ (లల్లా సింగ్) సహా ముగ్గురు సజీవ దహనమైన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటన సోన్‌హత్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నౌగైన్ గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది.

4



3

# రిజిస్ట్రేషన్లకు బ్రేక్!

- 26 నుంచి 28 వరకు సేవల నిలిపివేత
- సర్వర్ నిర్వహణ పనుల కోసమే విరామం
- 29 నుంచి యథావిధిగా ఆన్‌లైన్ సేవలు

సర్వర్ నిర్వహణ పనుల కారణంగా ఈ నెల 26 నుంచి 28 వరకు తాత్కాలికంగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోనున్నాయని ఆ శాఖ ఐజీ తెలిపారు.


# 11శాతం ఫిట్‌మెంట్

- జూలై 1 నుంచే వర్తింపు
- ఆర్టీసీ కార్మికులకు సర్కారు శుభవార్త
- గుర్తింపు సంఘాల ఎన్నికలకు ఆదేశం
- మంత్రి పొన్నం



2

తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శుభవార్త చెప్పారు. ఆర్టీసీ సమ్మెలో ఇచ్చిన హామీ మేరకు సిబ్బందికి జూలై 1 నుంచి 11 శాతం ఫిట్మెంట్ అమలు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. అలాగే ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. టీజీఎస్ఆర్టీసీ ఉన్నతాధికారులతో గురువారం మంత్రి పొన్నం సమావేశమయ్యారు.




# ఐడెంటిటీకే ఆధార్ వాడాలి

- పౌరసత్వం, నివాస ధ్రువీకరణ తదితరాలకు వాడొద్దు
- పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ

4

# మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం!

- బడ్జెట్ లో భారీగా నిధులు కేటాయిస్తాం
- ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో ముషాయిరా
- మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం వేగవంతం
- స్మశాన వాటికలకు స్థలాలు ఇవ్వాలని కలెక్టర్లకు ఆదేశాలు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

3




రాష్ట్రంలోని మైనార్టీల సామాజిక, ఆర్థిక, విద్యాభివృద్ధికి తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇందుకోసం బడ్జెట్ లో భారీగా నిధులు కేటాయిస్తామని, వాటికి సంబంధించిన అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన వేగవంతం చేస్తామని ఆయన వెల్లడించారు.

# హర్మూజ్ తెరుచుకున్నా ఇంధన ధరలు తగ్గవు

## ఇప్పట్లో తగ్గించే ఉద్దేశం లేదన్న కేంద్రం

అమెరికా- ఇరాన్ మధ్య కుదిరిన ఒప్పందంతో పశ్చిమాసియా సంక్షోభానికి తెరపడినా భారత్‌లో వెంటనే ఇంధన ధరలను మాత్రం తగ్గించలేమని కేంద్రం తాజాగా స్పష్టం చేసింది.




4



# వేలంపై స్టే!

**రాయదుర్గం భూములపై హైకోర్టు ఆదేశం**

**5 ఎకరాలు తమవేనన్న ఎస్బీఐ.. కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులు**

**హైదరాబాద్, జూన్ 18:** హైదరాబాద్ రాయదుర్గం భూముల వేలంపై హైకోర్టు 3 వారాల పాటు స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఆ స్థలంలో 5 ఎకరాలు తమదేనంటూ ఎస్బీఐ దాఖలు చేసిన పిటిషన్ పై విచారణ చేపట్టిన ధర్మాసనం.. 3 వారాల్లోపు కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించింది. రాయదుర్గంలోని సర్వే నంబర్ 83/1 లోని భూమికి టీజీఐఐసీ ఇటీవల వేలం నిర్వహించింది. ఈ స్థలాన్ని ఎకరాకు 237 కోట్ల చొప్పున గౌరా వెంచర్స్ కొనుగోలు చేసింది. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేసిన ఎస్బీఐ.. ఆ 5 ఎకరాల భూమి తిరిగి ఇప్పించాలని విజ్ఞప్తి చేసింది. దీంతో విచారణ చేపట్టిన న్యాయస్థానం వేలంపై స్టే విధించింది. కౌంటర్ దాఖలు చేయాలని ఎస్బీఐ, టీజీఐఐసీ, గౌరా వెంచర్స్ కు నోటీసులు జారీ చేసింది. రాయదుర్గంలో ఎస్బీహెచ్ కు 2010 లో 5 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించగా, ఇందుకోసం 13.33 కోట్లు చెల్లించింది. తర్వాత ఎస్బీఐలో ఎస్బీహెచ్ విలీనం కాగా.. ఈ స్థలంలో ఉన్న 2 ఏటీఎంలను ఎస్బీఐ నిర్వహిస్తోంది. అయితే 2020 లో గత ప్రభుత్వం ఈ కేటాయింపును రద్దు చేయడంతో ఎస్బీఐ కోర్టును ఆశ్రయించింది. అభ్యర్థనను పునఃపరిశీలించాలని కోర్టు ఆదేశించినా.. 2024 లో ప్రస్తుత ప్రభుత్వం కూడా కేటాయింపును రద్దు చేయడంతో ఎస్బీఐ మళ్లీ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. మే 6 న ఇచ్చిన వేలం నోటిఫికేషన్, తదనంతర భూ విక్రయాలను సవాల్ చేస్తూ రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేసింది.

# మాజీ మంత్రి కారుమూరి కుమారుడి అరెస్ట్

**సునీల్ కు 14 రోజుల రిమాండ్.. చంచల్ గూడ జైలుకు తరలింపు**

**హైదరాబాద్, జూన్ 18:** ఏపీలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం రవాణా కుంభకోణం కేసులో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు సునీల్ కు నాంపల్లి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. కోర్టు ఆదేశాలతో అధికారుల ఆయనను చంచల్ గూడ జైలుకు తరలించారు. ఈ కుంభకోణంతో ఖజానాకు 195 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు దర్యాప్తు సంస్థ (ఈడీ) కోర్టుకు తెలిపింది. రిమాండ్ కు ముందు కోర్టులో ఈడీ, సునీల్ తరఫు న్యాయవాదులు తమ వాదనలు వినిపించారు. గత ప్రభుత్వంలో సునీల్ తండ్రి నాగేశ్వరరావు పౌరసరఫరాల శాఖ మంత్రిగా ఉన్నారని ఈడీ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. తండ్రి పలుకుబడితో సునీల్ మద్యం రవాణా కాంట్రాక్టులు దక్కించుకుని భారీగా లబ్ధి పొందినట్లు ఆధారాలు సేకరించామన్నారు. కుటుంబ సభ్యుల మధ్య 7 కోట్ల లావాదేవీలు జరిగినట్లు గుర్తించామని వివరించారు. సుదర్శన సంస్థకు చెందిన సందీప్, ప్రతాప్ రెడ్డికి మద్యం రవాణా కాంట్రాక్టులు వచ్చాయని ఈడీ కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. ఈ కాంట్రాక్టులు ఇప్పించినందుకు ఆ సంస్థ నుంచి 28 కోట్ల మేర సునీల్ కు ముడుపులు అందాయని న్యాయవాది తెలిపారు. ఈ కేసులో లోతైన దర్యాప్తు జరుగుతోందని, త్వరలోనే అన్ని ఆధారాలు సమర్పిస్తామన్నారు. ఈ కుంభకోణంతో ప్రభుత్వ ఖజానాకు 195 కోట్ల నష్టం వాటిల్లినట్లు స్పష్టం చేశారు. ఇరుపక్షాల వాదనల అనంతరం సునీల్ కు 14 రోజుల రిమాండ్ విధిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

# హైదరాబాద్‌లో జనసేన కార్యాలయం

**నేడు మల్కం చెరువు వద్ద నూతన భవనం ప్రారంభించనున్న పవన్**



**హైదరాబాద్, జూన్ 18:** తెలంగాణలో పార్టీ విస్తరణ, సంస్థాగత నిర్మాణంపై ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ దృష్టి సారించారు. ఇందులో భాగంగా శుక్రవారం హైదరాబాద్ లో జనసేన తెలంగాణ రాష్ట్ర నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించనున్నారు. నగరంలోని మల్కం చెరువు సమీపంలో ఏర్పాటు చేసిన పార్టీ కొత్త ఆఫీసును మధ్యాహ్నం 12 గంటలకు పవన్ కల్యాణ్ ప్రారంభిస్తారు. ఈ నూతన కార్యాలయంతో రాష్ట్రంలో పార్టీ విస్తరణకు ఆయన శ్రీకారం చుట్టనున్నారని తెలుస్తోంది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరు కావాలని ఇప్పటికే రాష్ట్రంలోని జనసైనికులు, వీరమహిళలు, నాయకులకు ఆహ్వానం అందింది. దీంతో పార్టీ కార్యాలయానికి భారీగా శ్రేణులు తరలి వస్తారని నేతలు అంచనా వేస్తున్నారు. తెలంగాణ రాజకీయాల్లో జనసేన కార్యకలాపాలకు ఈ నూతన కార్యాలయం కేంద్రంగా మారనుందనే ప్రచారం సాగుతోంది. ఈ ఆఫీస్ ఏర్పాటు తర్వాత.. రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేయడం, సంస్థాగత నిర్మాణం చేపట్టడంతో పాటు ఇతర పార్టీల నుంచి చేరికలపై పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా దృష్టి సారిస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# తంత్రీ వాయిద్యకారుడు రామయ్యకు పురస్కారం

**పెద్దపల్లి, జూన్ 18:** పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి గ్రామానికి చెందిన, కడ్డీ తంత్రి వాయిద్య కళాకారుడు దురిచేటి రామయ్యకు కేంద్ర ప్రభుత్వ పురస్కార్ అవార్డు దక్కింది. ఆయన ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు గురువారం హర్షం వ్యక్తం చేశారు. గ్రామస్తులు పులి వెంకటేశంతో పాటు పలువురు రామయ్య ఇంటికి వెళ్లి అవార్డుకు ఎంపిక కావడం పట్ల శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. అనంతరం శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. నిరుపేద కుటుంబానికి చెందిన రామయ్య కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరారు.

# 30న రైతు భరోసా!

- మధిర వేదికగా రైతుల ఖాతాల్లోకి నిధులు
- సన్నాలకు బోనస్ ఇవ్వాలని నిర్ణయం
- ధాన్యం కొనుగోళ్లపై కేంద్రం తీరుకు నిరసన
- కేబినెట్ నిర్ణయాలను వెల్లడించిన మంత్రి ఉత్తమ్



**ఉద్యమ కెరటం, హైదరాబాద్:** ఈ నెల 30వ తేదీన రైతు భరోసా నిధులు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. వరుసగా 9 రోజుల పాటు రైతుల ఖాతాల్లో ప్రభుత్వం ఈ నిధులను జమ చేయనుంది. 30న ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మధిరలో రైతు సమ్మేళనం పేరిట నిర్వహించే బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి ఈ నిధులను అధికారికంగా విడుదల చేస్తారని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. రైతు భరోసా కింద రైతులకు ప్రభుత్వం ఏటా ఎకరానికి 12,000 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తోంది. ఈ పెట్టుబడి సాయాన్ని ఖరీఫ్, రబీ సీజన్లలో విడగొట్టి.. ప్రతి సీజన్ కు ఎకరాకు 6,000 చొప్పున నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది. మరోవైపు 23వ ప్రధాన మంత్రి కిసాన్ యోజన పథకానికి సంబంధించిన నిధులను కేంద్ర ప్రభుత్వం ఈ నెల 20న విడుదల చేయనుంది. పశ్చిమ బెంగాల్ లోని హుగ్లీ జిల్లా తారకేశ్వర్ లో జరిగే కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేయనున్నారు. దీంతో ఒక్కో రైతు ఖాతాలో 2,000 చొప్పున నగదు జమ కానుంది. ఈ లెక్కన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 10 రోజుల వ్యవధిలోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నాయి. సచివాలయంలో మంత్రులతో ప్రత్యేకంగా నిర్వహించిన సమావేశంలో పలు కీలక అంశాలపై సీఎం రేవంత్ రెడ్డి చర్చించారు. ధాన్యం కొనుగోళ్లు, వీబీ-జీఆర్ఏఎంజీ పథకం, కేంద్ర ప్రభుత్వ వైఖరి, హైదరాబాద్ మెట్రో రైలు లాంటి అంశాలపై మంత్రులతో సుదీర్ఘంగా చర్చించారు. మార్కెట్లో ఉన్న డిమాండ్ మేరకు 7 రకాల సన్నాలకు బోనస్ ఇవ్వాలని కేబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు ఉత్తమ్ తెలిపారు. మన రాష్ట్రం నుంచి కేంద్రం తక్కువ ధాన్యం సేకరించడంపై ఈ సమావేశంలో తీవ్ర ఆందోళన వ్యక్తమైందని పేర్కొన్నారు. మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కేంద్రం కనీస మద్దతు ధర ఇచ్చి కొనే ధాన్యాన్ని మాత్రమే రాష్ట్రం కొనాలని నిర్ణయించామన్నారు. రాష్ట్రానికి రావాల్సిన ఎరువుల కోటాను వెంటనే విడుదల చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఇదే అంశంపై పలుమార్లు కేంద్రానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖలు రాశారని ఆయన గుర్తు చేశారు. త్వరలో ఢిల్లీకి వెళ్లి ఈ అంశాలన్నింటిని కేంద్రానికి విజ్ఞప్తి చేయాలని కేబినెట్ లో నిర్ణయించారు. రామగుండంలో తయారయ్యే యూరియాలో అత్యధిక శాతాన్ని రాష్ట్రానికే కేటాయించాలని కేంద్రానికి స్పష్టం చేశారు. అలాగే హైదరాబాద్ మెట్రో విస్తరణకు సహకరించాలని కేంద్రాన్ని కోరారు. అందుకోసం మెట్రో రెండో దశకు తక్షణమే అనుమతులు ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. బీఆర్ఎఫ్పీ నుంచి రావాల్సిన రుణాన్ని వెంటనే విడుదల చేయించాలని కేంద్రాన్ని కోరుతున్నట్లు ఉత్తమ్ వెల్లడించారు. రాష్ట్ర అభివృద్ధికి ఎలాంటి అడ్డంకులు లేకుండా ప్రాజెక్టుల అనుమతులు ఇప్పించడానికి బీజేపీ ఎంపీలు సైతం కలిసి రావాలని మంత్రి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఇకపై డిజిటల్ క్యాబినెట్ సమావేశాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. జూన్ 21వ తేదీన జరిగే నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని ఈ భేటీలో నిర్ణయించినట్లు ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. వీబీ-జీఆర్ఏఎంజీ పై కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ కమిటీలో మంత్రులు సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉంటారు. దీనిపై ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం చేసిన తర్వాత జూన్ 25 లోపు ప్రభుత్వానికి కేబినెట్ సబ్ కమిటీ తమ నివేదికను అందజేయనుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# పేదల జోలికి హైడ్రా వెళ్లదు!

- కబ్జాదారుల భరతం పడుతుంది
- మురికి కన్నా కల్వకుంట్ల విషమే ప్రమాదం
- ఎవరు అడ్డుపడినా మూసీ ప్రక్షాళన ఆగదు
- గుర్రంగూడ ఎకో పార్క్ లో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, జూన్ 18:** ప్రభుత్వ భూములను కబ్జా చేయాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. భూకబ్జాలతో ప్రజలకు సమస్యలు రాకూడదనే హైడ్రా తీసుకువచ్చామని స్పష్టం చేశారు. కొందరు హైడ్రాను ఒక భూతంలా చూపెడుతున్నారని, అది పేదల జోలికి వెళ్లదని, కబ్జాదారుల భరతం పడుతుందని తేల్చి చెప్పారు. గుర్రంగూడ ఎకో పార్క్ ను కబ్జా చేయాలని కొంతమంది చూశారని సీఎం ఆరోపించారు. వనస్థలిపురంలో దేవుడి భూములను కూడా కబ్జా పెట్టారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం గుర్రంగూడ ఎకో పార్క్ లో వనమహోత్సవం కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారు. హరితనిధి ద్వారా నాగలింగం మొక్కను నాటారు. అక్కడే రోబోటిక్ ఏనుగును ఆవిష్కరించారు. ఎకో పార్క్ నమూనాను అటవీ అధికారులు సీఎంకు వివరించారు. ఎకో పార్క్ లో 35.50 కోట్లతో, గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్ లో 17.84 కోట్లతో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 2018 లో కొందరి కుట్ర వల్ల కొడంగల్ లో ఓడిపోయానని చెప్పారు. ఇక తాను ఏమీ చేయలేనని కొందరు భావించారని, కానీ మల్కాజిగిరి ప్రజలు ప్రశ్నించే గొంతు ఉండాలని తనను ఎంపీగా గెలిపించారని తెలిపారు. ఇక్కడి ప్రజల అభిమానమే తనను ముఖ్యమంత్రిగా నిలబెట్టిందని, తనను ఓడించాలని కొందరు ఎన్నో కుట్రలు పన్నారని ధ్వజమెత్తారు. మల్కాజిగిరి ప్రజలు తనకు 30 వేలకు పైగా మెజారిటీ ఇచ్చారని గుర్తుచేసుకున్నారు. తన సొంతూరు కొండారెడ్డిపల్లి లాంటిదే తనకు మల్కాజిగిరి అని



అభివర్ణించారు. గత పదేళ్ల పాలనలో మల్కాజిగిరి అభివృద్ధిని పట్టించుకోలేదని మండిపడ్డారు. సీఎం హోదాలో ఇక్కడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాట ఇచ్చారు. రంగారెడ్డి జిల్లాకు అన్నివిధాలా అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. కోహెడలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మించామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కాలుష్య కోరల్లో చిక్కుకుని ఢిల్లీ ప్రజలు బాధపడుతున్నారని, మన హైదరాబాద్ కు అలాంటి పరిస్థితి రావొద్దనే మొక్కల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నామని సీఎం వివరించారు. నగర అవసరాల కోసం 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నామని తెలిపారు. ఫ్యూచర్ సిటీ కడతామంటే మళ్లీ ఫార్మా కంపెనీలు తెస్తామంటున్నారని, భవిష్యత్తు లేని వాళ్లు ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తామంటున్నారని దుయ్యబట్టారు. వాళ్ల ఫ్యూచర్ ను ప్రజలు నిర్ణయిస్తే ఫామ్ హౌస్ కు పరిమితం అయ్యారని ఎద్దేవా చేశారు. ముందు సిద్దిపేటలో గెలిచి రండి.. ఆ తర్వాత రద్దుపై మాట్లాడదామని హితవు పలికారు. గ్రీన్ కవర్ 60 శాతం పెంచుతామంటే ఎన్జీటీలో కేసులు వేశారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలుష్య రహిత వాతావరణం ప్రజలకు ఇవ్వాలని ప్రయత్నిస్తున్నామన్నారు. మూసీ పునరుజ్జీవం చేస్తామంటే కొందరు అడ్డుపడుతున్నారని సీఎం ఆగ్రహించారు. మూసీ ఒడ్డున నివసిస్తున్న ప్రజలను తరలించి అభివృద్ధి చేస్తామంటే కొందరు మోకాలడ్డుతున్నారని మండిపడ్డారు. మూసీలో ఉండే కాలుష్యం కంటే కల్వకుంట్ల వాళ్ల కడుపులో విషం ఎక్కువని విమర్శించారు. మూసీ పునరుజ్జీవం వద్దంటున్న సుధీర్ రెడ్డి గతంలో మూసీ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఎలా తీసుకున్నారని ప్రశ్నించారు. ఎవరు ఏమనుకున్నా, ఎవరు అడ్డుపడినా అంతర్జాతీయ స్థాయిలో ఫ్యూచర్ సిటీని నిర్మించి తీరుతామన్నారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కిలోమీటర్ల మేర మూసీ ప్రక్షాళన పనులు చేపడతామని చెప్పారు. సబర్మతి, గంగా రివర్ ఫ్రంట్ల కంటే మెరుగ్గా అంతర్జాతీయ స్థాయిలో దీనిని తీర్చిదిద్దుతామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# 11 శాతం ఫిట్‌మెంట్

**జూలై 1 నుంచే వర్తింపు..ఆర్టీసీ కార్మికులకు సర్కారు శుభవార్త**

**గుర్తింపు సంఘాల ఎన్నికలకు ఆదేశం.. మంత్రి పొన్నం ప్రభాకర్**

**హైదరాబాద్, జూన్ 18:** తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శుభవార్త చెప్పారు. ఆర్టీసీ సమ్మెలో ఇచ్చిన హామీ మేరకు సిబ్బందికి జూలై 1 నుంచి 11 శాతం ఫిట్మెంట్ అమలు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. అలాగే ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. టీజీఎస్ఆర్టీసీ ఉన్నతాధికారులతో గురువారం మంత్రి పొన్నం సమావేశమయ్యారు. నాగర్ కర్నూల్, పెద్దపల్లి బస్ డిపోల పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. వేములవాడ, కథలాపూర్ బస్ స్టేషన్లకు త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. హుజూర్ నగర్, కోదాడ, నాగర్ కర్నూల్ బస్ స్టేషన్ల నిర్మాణానికి కూడా ఆమోదం తెలిపారు. ములుగు బస్ స్టేషన్ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలన్నారు. మహాలక్ష్మి పథకంపై ప్రత్యేక అధ్యయనం చేయాలని సూచించారు. మహిళా సంఘాలకు చెందిన 553 బస్సుల పనితీరు, రాష్ట్రంలో 1,050 ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణపై సమగ్ర నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ వద్ద 10,173 బస్సులు, 38,128 మంది ఉద్యోగులు ఉన్నారని, రోజుకు 61 లక్షల మంది ప్రయాణికులు సేవలు పొందుతున్నారని మంత్రి వెల్లడించారు. పెండింగ్ లో ఉన్న కారుణ్య నియామకాలను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. తొలగించిన వారిలో 244 మందిని ఇప్పటికే విధుల్లోకి తీసుకున్నట్లు తెలిపారు. మరణించిన ఉద్యోగి శంకర్ కుటుంబానికి 1 కోటి రూపాయల చెక్కు అందజేయనున్నట్లు, ఆయన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసినట్లు చెప్పారు. త్వరలో దక్షిణ భారత రవాణా శాఖ మంత్రులతో ప్రత్యేక సమావేశం జరగనుందని పొన్నం పేర్కొన్నారు.





# 22న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ

**జర్నలిస్టులకు అవగాహన కార్యక్రమం**

**హైదరాబాద్, జూన్ 18:** జర్నలిస్టుల కోసం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ అంశంపై తెలంగాణ మీడియా అకాడమీ, తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయ అధికారులతో ప్రత్యేక అవగాహన మరియు పరస్పర చర్చా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం ఈ నెల 22వ తేదీ సోమవారం ఉదయం 11గంటలకు మీడియా అకాడమీ ఆడిటోరియం, చాపెల్ రోడ్, నాంపల్లి, హైదరాబాద్‌లో నిర్వహించబడుతుంది. ఈ సమావేశంలో ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయ అధికారులు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, దాని లక్ష్యాలు, అమలు విధానం, ప్రజల భాగస్వామ్యం, ఓటరు నమోదు, సవరణలు తదితర అంశాలపై సమగ్రంగా వివరించనున్నారు. అలాగే జర్నలిస్టులు తమ సందేహాలను నేరుగా అధికారులను అడిగి నివృత్తి చేసుకునే అవకాశం కల్పించబడుతుంది. ఈ కార్యక్రమం మధ్యాహ్నం 1.00 గంటలకు ముగియనుంది. ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన జర్నలిస్టులు తమ పేర్లను 20వ తేదీ మధ్యాహ్నం 1.00 గంటలలోపు వాట్సాప్ నంబర్ 7093600977 కు పంపి నమోదు చేసుకోవలసిందిగా కోరడమైనది. కార్యక్రమ నిర్వహణ సౌలభ్యం దృష్ట్యా, నిర్దేశిత గడువులోపు తమ పేర్లను నమోదు చేసుకున్న జర్నలిస్టులకు మాత్రమే కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పించబడుతుంది.

# మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం!

- బడ్జెట్ లో భారీగా నిధులు కేటాయిస్తాం
- ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో ముషాయిరా
- మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం వేగవంతం
- స్మశాన వాటికలకు స్థలాలు ఇవ్వాలని కలెక్టర్లకు ఆదేశాలు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క




**హైదరాబాద్, జూన్ 18:** రాష్ట్రంలోని మైనార్టీల సామాజిక, ఆర్థిక, విద్యాభివృద్ధికి తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇందుకోసం బడ్జెట్ లో భారీగా నిధులు కేటాయిస్తామని, వాటికి సంబంధించిన అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన వేగవంతం చేస్తామని ఆయన వెల్లడించారు. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మైనార్టీల సంక్షేమం, వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శనివారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, ఆ కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు. ఉర్దూ అకాడమీ స్వర్ణోత్సవాల సందర్భంగా హైదరాబాద్ తో పాటు అన్ని జిల్లా కేంద్రాల్లో ఉర్దూ సంస్కృతిని ప్రతిబింబించేలా పెద్ద ఎత్తున 'ముషాయిరా' (కవి సమ్మేళనాలు) నిర్వహించనున్నట్లు భట్టి తెలిపారు. ఎల్బీ స్టేడియంలో ఈ కార్యక్రమ నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

### రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం..

దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలను అన్ని రకాల ఆధునిక హంగులతో నిర్మిస్తున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రస్తుతం 20 పాఠశాలల నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయని, మరో 17 పాఠశాలలు నిర్మాణ దశలో ఉన్నాయని అధికారులు వివరించారు. అసంపూర్తిగా ఉన్న భవనాల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు.

### రాజీవ్ యువ వికాసం..

మైనార్టీ యువత స్వయం ఉపాధి రంగాల్లో రాణించేందుకు 'రాజీవ్ యువ వికాసం' పథకం ద్వారా పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు తెలిపారు. క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమం కొరకు ప్రత్యేకంగా 50 కోట్లు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. మైనార్టీ సంస్థలకు సంబంధించిన విలువైన వక్ఫ్ ఇతర భూములు అన్యాక్రాంతం కాకుండా చట్టపరమైన రక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్మశాన వాటికల చుట్టూ ప్రహరీ గోడల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ముస్లిం జనాభా ఎక్కువగా ఉన్న జిల్లా, డివిజన్ కేంద్రాల్లో స్మశాన వాటికల ఏర్పాటుకు అవసరమైన స్థలాలను సేకరించి కేటాయించాలని జిల్లా కలెక్టర్లకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేయనున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. నగరంలో జరగబోయే మొహర్రం వేడుకల సందర్భంగా 9 వ రోజు నిర్వహించే ప్రత్యేక కార్యక్రమానికి హాజరుకావాల్సిందిగా మంత్రి అజారుద్దీన్ కోరగా.. తప్పకుండా హాజరవుతానని భట్టి పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ప్లానింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ గౌరవ ఉప్పల్, ఫైనాన్స్ సెక్రటరీ సికా పట్నాయక్, వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అజ్మతుల్లా, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ పాల్గొన్నారు.

# కేంద్రంపై ఒత్తిడి తెస్తాం!

- యూరియా కోసం ఢిల్లీకి మంత్రుల బృందం
- రామగుండం ఎరువులు మనకే కేటాయించాలి
- రైతు బీమా ఆగిపోయిందన్నది అబద్ధం
- ఎల్ఐసీకి ప్రీమియం చెల్లించాం: మంత్రి తుమ్మల



**హైదరాబాద్, జూన్ 18:** రామగుండం ఎరువులు రాష్ట్రానికే దక్కేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. నెలకు 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఇస్తామని చెప్పి ఇప్పుడు ఎందుకు సరఫరా చేయడం లేదో కేంద్రం చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్రానికి సరిపడా యూరియా కోరేందుకు మంత్రుల బృందం ఢిల్లీకి వెళ్లనున్నట్లు ఆయన వెల్లడించారు. రైతు బీమా నిలిపివేసినట్లు బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ప్రచారం పూర్తిగా అబద్ధమని కొట్టిపారేశారు. గురువారం సచివాలయంలో మంత్రి తుమ్మల మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర ప్రకటించి కొనుగోలు నుంచి తప్పుకుంటోందని విమర్శించారు. ఒక్క గింజ మొక్కజొన్నను కూడా కేంద్రం ఎందుకు కొనలేదని నిలదీశారు. దీన్ని రాష్ట్ర రైతాంగంపై కక్షగా అనుకోవాలా అని ప్రశ్నించారు. తొలి వర్షానికే విత్తనాలు వేస్తే రైతులు నష్టపోతారని, రెండుసార్లు వర్షం పడితేనే సరిపడా తేమ వస్తుందని, అన్నదాతలు ఈ విషయాన్ని గమనించాలని మంత్రి సూచించారు.

### బీమా ప్రీమియం చెల్లించాం..

రైతు మరణిస్తే వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే 'రైతు బీమా' పథకాన్ని ప్రభుత్వం అత్యంత బాధ్యతతో అమలు చేస్తోందని తుమ్మల చెప్పారు. ఎల్ఐసీకి చెల్లించాల్సిన వార్షిక ప్రీమియాన్ని ప్రభుత్వం ఇప్పటికే చెల్లించిందని స్పష్టం చేశారు. పథకాన్ని నిలిపివేసినట్లు బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ప్రచారం పూర్తిగా అబద్ధమన్నారు. రైతు సంక్షేమం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడదని తేల్చి చెప్పారు. తాము అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఏ ఒక్క పథకాన్ని నిలిపివేయలేదని, పథకాలను ఆపి రైతులను ఇబ్బంది పెట్టిన చరిత్ర గత ప్రభుత్వానిదేనని దుయ్యబట్టారు. గత ప్రభుత్వం ఆపేసిన యంత్ర పరికరాలు, సబ్సిడీ విత్తనాలు, సాయిల్ టెస్ట్ లాంటి పథకాలను పునరుద్ధరించి రైతులకు అండగా నిలుస్తున్న ఘనత తమదేనని మంత్రి పేర్కొన్నారు.

### 3,301 కోట్ల బీమా సాయం..

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా 66,038 మంది రైతు కుటుంబాలు బీమా ద్వారా లబ్ధి పొందాయని మంత్రి తుమ్మల తెలిపారు. ఆయా కుటుంబాల నామినీల ఖాతాల్లో మొత్తం 3,301.90 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. 2023 డిసెంబర్ నుంచి ఏడాది ముగిసే వరకు 20,090 కుటుంబాలకు 1,004.50 కోట్లు, 2024 లో 25,861 కుటుంబాలకు 1,293.05 కోట్లు బీమా సాయంగా అందించినట్లు వివరించారు. 2025-26 సంవత్సరానికి 42.16 లక్షల మంది రైతులు పథకంలో నమోదు చేసుకున్నారని, వీరందరికీ వర్తించేలా 1,359.56 కోట్ల వార్షిక ప్రీమియాన్ని ప్రభుత్వం పూర్తిగా చెల్లించిందన్నారు. దీంతో 20,087 కుటుంబాలకు 1004.35 కోట్లు బీమా సాయంగా అందిందని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నాలు మానుకోవాలని మంత్రి హితవు పలికారు.

# లైన్ దాటితే వేటే!

**వ్యక్తిగత సమస్యలు పార్టీపై రుద్దొద్దు.. నేతలకు ఎంపీ మల్లు రవి హెచ్చరిక**



**హైదరాబాద్, జూన్ 18:** ఎంతటి వారైనా సరే వ్యక్తిగత సమస్యలను పార్టీపై రుద్ద వద్దని, పార్టీ లైన్ దాటితే క్షమించేది లేదని కాంగ్రెస్ నేతలకు ఆ పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి స్పష్టం చేశారు. నాయకులు పార్టీకి కట్టుబడి ఉండాల్సిందేనని తేల్చి చెప్పారు. పార్టీకి వ్యతిరేకంగా ఎవరు ప్రవర్తించినా చూస్తూ ఊరుకునే ప్రసక్తి లేదని ఆయన గట్టి హెచ్చరిక జారీ చేశారు. గాంధీ భవన్ లో గురువారం మల్లు రవి మీడియాతో మాట్లాడారు. నాయకులకు ఏమైనా సమస్యలు ఉంటే టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ లేదా రాష్ట్ర వ్యవహారాల బాధ్యురాలు మీనాక్షి నటరాజన్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. కామారెడ్డిలో నేతలు ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకున్నారని వివరించారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి నోటీసులు జారీ చేశామని, ఆదివారం కమిటీ ముందు హాజరు కావాలని సూచించగా ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. ముందుగా షబ్బీర్ అలీ ఇచ్చిన ఫిర్యాదుపై చర్చిస్తామని, ఇరు పక్షాల వాదనలు విన్న తర్వాత తమ నిర్ణయం ప్రకటిస్తామని మల్లు రవి వెల్లడించారు. మల్లు రవిని కలిసి అన్ని విషయాలు వివరించానని కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్ రెడ్డి వెల్లడించారు. నోటీసులపై లిఖితపూర్వక సమాధానం ఇచ్చానన్నారు. అన్ని విషయాలు పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని ఆయన్ని కోరినట్లు చెప్పారు. వారం రోజుల్లో అన్ని అంశాలు పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని మల్లు రవి తెలిపారని, కమిటీ ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉండాలని సూచించారని చంద్రశేఖర్ రెడ్డి వివరించారు.

# నీట్ కు 21న విద్యార్థులకు ఉచిత బస్సు

**పరీక్ష సమయం 195 నిమిషాలకు పెంపు.. ఎన్టీఏ కొత్త మార్గదర్శకాలు**



**హైదరాబాద్, జూన్ 18:** నీట్ పరీక్ష రాసే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ప్రకటన చేశారు. మరోవైపు ఈ ఏడాది నీట్ పరీక్ష కోసం జాతీయ పరీక్షల సంస్థ (ఎన్టీఏ) సమయాన్ని పెంచుతూ కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. జూన్ 21 న జరగనున్న నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్ టికెట్ చూపిస్తే ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇందుకు సంబంధించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఏడాది నీట్ పరీక్షను మరింత పారదర్శకంగా, సురక్షితంగా, విద్యార్థులకు అనుకూలంగా మార్చేందుకు ఎన్టీఏ కీలక మార్పులు చేసింది. పాత నిబంధనలను సవరిస్తూ ఈసారి పరీక్ష సమయాన్ని 195 నిమిషాలకు పెంచారు. పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు జరగనుంది. పరీక్ష ప్రారంభానికి ముందు హాజరు పత్రాలపై సంతకాలు చేయడం, పర్యవేక్షణ లాంఛనాలు పూర్తి చేయడం లాంటి పనుల వల్ల విద్యార్థులు రాత సమయాన్ని నష్టపోకూడదనే ఉద్దేశంతో ఈ అదనపు సమయాన్ని కేటాయించారు. దీనివల్ల అభ్యర్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్ష రాయడంపైనే పూర్తిగా దృష్టి పెట్టవచ్చని సూచించారు. విద్యార్థులకు సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా తీసుకువచ్చిన ఈ కొత్త నిబంధనలను అభ్యర్థులందరూ గమనించాలని ఎన్టీఏ స్పష్టం చేసింది.




# రిజిస్ట్రేషన్లకు బ్రేక్!

**26 నుంచి 28 వరకు సేవల నిలిపివేత**

**సర్వర్ నిర్వహణ పనుల కోసమే విరామం**

**కేవలం 27న ఒక్కరోజే పనులకు అంతరాయం**

**29 నుంచి యథావిధిగా ఆన్ లైన్ సేవలు**

**హైదరాబాద్, జూన్ 18:** స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన వెబ్ సైట్ తో పాటు ఇతర ఆన్ లైన్ సేవలు ఈ నెల 26 నుంచి 28 వరకు తాత్కాలికంగా నిలిచిపోనున్నాయి. సర్వర్ నిర్వహణ పనుల కారణంగా ఈ 3 రోజుల పాటు సేవలు అందుబాటులో ఉండవని రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. మళ్లీ జూన్ 29 వ తేదీ నుంచి యథావిధిగా సేవలు ప్రారంభం అవుతాయని స్పష్టం చేశారు. సుమారు 5 ఏళ్ల తర్వాత ఈ సర్వర్ నిర్వహణ పనులు చేపడుతున్నారు. సర్వర్ వ్యవస్థలు మరింత సజావుగా పనిచేయడం, భద్రతా ప్రమాణాలు బలోపేతం కావడం, సేవల నాణ్యత మెరుగుపడడం కోసం ఈ విరామం తీసుకున్నట్లు ఐజీ రాజీవ్ గాంధీ పేర్కొన్నారు. జూన్ 26 న మొహర్రం, జూన్ 28 న ఆదివారం ప్రభుత్వ సెలవు దినాలు. దీంతో మధ్యలో ఉన్న జూన్ 27 న ఒక్కరోజు మాత్రమే పని దినంలో రిజిస్ట్రేషన్ సేవలకు అంతరాయం కలుగుతుందని గురువారం విడుదల చేసిన ప్రకటనలో స్పష్టం చేశారు. సాధారణ ప్రజలకు కలిగే అసౌకర్యం అత్యల్పంగా ఉండేలా ఈ షెడ్యూల్ రూపొందించారు. ప్రజలు తమ రిజిస్ట్రేషన్ పనులను ముందుస్తుగా ప్లాన్ చేసుకోవాలని అధికారులు సూచించారు. జూన్ 29 వ తేదీ నుంచి అన్ని సేవలు పునఃప్రారంభం అవుతాయని ఐజీ వెల్లడించారు. ఈ పనులకు ప్రజలు సహకరించాలని కోరారు.

# కేటీఆర్ టూరిస్ట్!

**పవన్‌పై కేసు ఎందుకు పెట్టలేదు**

**కాంగ్రెస్ వైఫల్యాలపై కేటీఆర్ మౌనం**

**దళితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారు**

**టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత ఫైర్**



**కరీంనగర్, జూన్ 18:** ప్రాంతీయవాదాన్ని వేర్పాటువాదంతో పోల్చిన ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పై రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు కేసు నమోదు చేయలేదని తెలంగాణ రక్షణ సమితి (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత ప్రశ్నించారు. కరీంనగర్ లో ఆ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ సిరిసిల్లకు కేవలం వీకెండ్ లో వచ్చి వెళ్లే విజిటింగ్ టూరిస్ట్ లా వ్యవహరిస్తున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నేరెళ్ల బాధితుల గురించి కేంద్ర మంత్రి బండి సంజయ్ ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. కేసు పెట్టడం చేతకాని ప్రభుత్వం తెలంగాణలో ఉందని కవిత విమర్శించారు. తెలంగాణ ఉద్యమకారులను కాంగ్రెస్ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక పలువురు నేతలు తెలంగాణ భావజాలంపై దాడి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యమానికి అండగా నిలిచిన కరీంనగర్ లో తెలంగాణ తల్లి విగ్రహం లేకపోవడం ప్రజల త్యాగాలను అవమానించడమేనని ఆమె వ్యాఖ్యానించారు. సిరిసిల్లలో పర్యటించిన కవిత మాజీ మంత్రి కేటీఆర్ తీరుపై విమర్శల వర్షం కురిపించారు. రైతుల నడ్డి విరుస్తున్న కాంగ్రెస్ సర్కార్ పై ఆయన ఎందుకు నోరెత్తడం లేదని ప్రశ్నించారు. సిరిసిల్లలో సెస్ ఆగమాగం అవుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. రైతు డిస్కంపై ఇప్పటి వరకు ఆయన ఎందుకు మాట్లాడలేదో సమాధానం చెప్పాలన్నారు. రైతు డిస్కం కావాలా, వద్దా అనే విషయాన్ని కేటీఆర్ స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. నేరెళ్లలో అక్రమ ఇసుక సంపాదన కోసం దళితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని కవిత ధ్వజమెత్తారు. ఆ బాధితులకు ఇప్పటి వరకు ఎలాంటి న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నేరెళ్ల ఇసుక బాధితుల పక్షాన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఎందుకు పోరాడటం లేదో చెప్పాలని ప్రశ్నించారు. కార్పొరేటర్ స్థాయి నుంచి ఆ బాధితుల ఓట్లతోనే గెలిచి బండి సంజయ్ కేంద్ర మంత్రి స్థాయికి ఎదిగారని ఆమె గుర్తు చేశారు.

# డ్రగ్స్‌కు చెక్!

**నేడు ఎల్బీ స్టేడియంలో ప్రత్యేక కార్యక్రమం**

**హైదరాబాద్:** పాఠశాలలు, కళాశాలల్లో మాదకద్రవ్యాల నిర్మూలనతో పాటు విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్యా వాతావరణం కల్పనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో విద్యార్థులతో భారీస్థాయిలో సామూహిక ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గవర్నర్ శివప్రతాప్ శుక్లా హాజరుకానున్నారు. సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రెసిడెన్షియల్ విద్యాసంస్థల విద్యార్థులకు 'విద్యార్థి హక్కుల కిట్లు' పంపిణీ చేయనున్నారు. వసతి సదుపాయాల కల్పనలో భాగంగా 20 రకాల వస్తువులతో కూడిన ఈ కిట్లను అందజేస్తారు. ఈ కార్యక్రమంలో దాదాపు 15 వేల మంది విద్యార్థులు పాల్గొంటారు. దీనిని విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టింది. వివిధ సంక్షేమ, విద్యా శాఖల అధికారులకు బాధ్యతలు కేటాయించారు.



# విద్యారంగంలో మార్పులు కావాలి!

తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభం ఒక గొప్ప ముందడుగనే చెప్పాలి. అందరికీ విద్య అన్నది ప్రభుత్వ పరంగా చేపట్టడం ఆహ్వానించదగ్గ విషయం. విద్య,వైద్యం విషయంలో కఠిన నిర్ణయాలు తీసుకుంటే ఓ ఐదేళ్లలో గణనీయమైన మార్పులు తీసుకుని రావచ్చు. గ్రామస్థాయి వరకు ప్రాథమిక విద్య, ప్రాథమిక వైద్యం అందితే ప్రజలకు అంతకు మించి కావాల్సింది లేదు. కులాలు, మతాల వారీగా హాస్టళ్లు, స్కూళ్ల వల్ల సమాజంలో అసమానతలు పెరిగాయి. ఇదే విషయాన్ని పదేపదే ప్రస్తావిస్తున్న సిఎం రేవంత్ ఓ మంచి అడుగు వేశారనే చెప్పాలి. అయితే ఇదొక్కటే సరిపోదు. రేవంత్ రెడ్డి పదవీ కాలంలో రెండున్నరేళ్లు పూర్తయ్యాయి. ఇంకా రెండేళ్ల పదవీకాలం మాత్రమే ఉంది. కనీసం ఉన్న స్కూళ్లనయినా బాగుచేసి, హాస్టళ్లను స్కూళ్లకు అనుసంధానం చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టాలి. కెసిఆర్ హయాంలో కెజి టూ పిజి అని ప్రగల్భాలు పలికారు. కానీ దానిని ఏనాడు పట్టాలకు ఎక్కించలేక పోయారు. ఆనాడే చేసివుంటే పదేళ్లలతో తెలంగాణ విద్యావ్యవస్థ రూపురేఖలు మారి ఉండేవి. ఇప్పటికైనా కామన్ విద్యావిధానం తీసుకుని రావాలి. అందరికీ ఒకేచోట విద్యను తీసుకుని వస్తే ప్రైవేట్ స్కూళ్ల దోపిడీ కూడా తగ్గుంది. గ్రామాల్లో కూడా సామాన్య జనం నేటికీ అప్పులు చేసి పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపుతున్నారు. దీనిని తక్షణం నిరోధించాలి. ఈ దోపిడీని అరికట్టాలి. స్కూళ్లను అభివృద్ధి చేయడం వల్ల సమాజాంలో కులాల మధ్య అంతరాన్ని తొలగించడంతో పాటు, కుటుంబాల ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దవచ్చు. ప్రైవేట్ దోపిడీని అరికట్టవచ్చు. అలాగే ఏకీకృత విద్యకు కృషి చేయాలి. విద్యా వివక్షను రూపుమాపాలంటే కామన్ స్కూల్ విధానం వెంటనే అమలు చేయాల్సి ఉంది. తెలంగాణ పబ్లిక్ స్కూల్ కాన్సెప్ట్‌ను సిఎం తప్పనిసరిగా అమలు చేయగలిగితే అతిపెద్ద విజయం సాధించినట్లుగా చెప్పవచ్చు. అలా కాకుండా తెలంగాణ పబ్లిక్ స్కూల్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల పేరుతో ప్రభుత్వం ఎన్ని సంస్కరణలు ప్రవేశపెట్టినా లాభం ఉండదు. ఎంతగా డబ్బులు ఖర్చు చేసినా అత్యధిక విద్యార్థులున్న ప్రైవేటు విద్యా సంస్థలను నియంత్రించకుండా, ప్రభుత్వ బడులను సంస్కరించకుండా ముందుకు సాగితే సత్ఫలితాలు సాధించలేం. ప్రభుత్వ బడికి గతంలో ఉన్న ఇమేజ్ తీసుకుని రావాలంటే ప్రైవేటుకు దీటుగా ఉన్నాయన్న భరోసా కల్పించాలి. అందుకు గట్టి కృషి చేయాలి. నాణ్యమైన ఉచిత విద్య ప్రభుత్వ బడిలో దొరుకుతుందనే గట్టి నమ్మకం మాత్రమే ప్రభుత్వ విద్యా సంస్థలలో నమోదు పెంచుతుంది. కాబట్టి పాలకులకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే గ్రామాల వారీగా ఏకీకృత కామన్ పాఠశాల వ్యవస్థకు రూపకల్పన చేయాలి. అంతేగాక ఇబ్బడి ముబ్బడిగా కనీస వసతులు లేకుండా నడుస్తున్న ప్రైవేటు విద్యా సంస్థలను నిషేధించాలి. లేదా నియంత్రణ చర్యలు చేపట్టాలి. ఇలా చేయగలిగితే సిఎం రేవంత్ ర ఎడ్డి ఆశించిన ఫలితాలు వస్తాయి. అంతరాలు లేని శాస్త్రీయ విద్య అందరికీ అందుబాటులోకి వస్తుంది. కామన్ స్కూల్ విధానం మాత్రమే ప్రజలకు ఏకైక విద్యా ప్రత్యామ్నాయంగా గుర్తించి ముందుకు సాగేందుకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ విధానం దోహదపడుతుంది. గ్రామాల్లో నర్సరీ నుంచి ఇంటర్ వరకు తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఒకే స్కూల్ ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలి. తెలుగు మీడియం అయినా ఆంగ్లబోధనను కూడా తప్పనిసరి చేయాలి. స్పోకెన్ ఇంగ్లీష్‌తో దీన్ని అధిగమించవచ్చు. ఇప్పుడు విద్యారంగానికి ఖర్చు చేస్తున్న నిధులతోనే ఏకీకృత విద్యను అందుబాటులోకి తీసుకుని రావచ్చు. గ్రామస్థాయి నుంచి పట్టణస్థాయి వరకు అందరి పిల్లలు ఒకే పాఠశాలలో చదువుకునే ఏకీకృత విధానం అమలు కావాలి. అక్కడే విద్యార్థులు బ్రేక్ ఫాస్ట్ మొదలు, మధ్యాహ్న భోజనం అందించాలి. ఇంటి నుంచి పిల్లలు స్కూలుకు వచ్చేలా అవసరమైతే ట్రాన్స్‌పోర్టు కూడా ఏర్పాటు చేయాలి. ఇది కుల, మత వైషమ్యాలు లేని విద్యా వ్యవస్థకు పునాది వేయగలదు. ఒక మండల కేంద్రంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ లాంటి స్కూల్ ఉంటే ఆ చుట్టుపక్కల విద్యార్థులంతా స్కూల్ బస్సుల్లో వచ్చి పోయేలా సౌకర్యాలు కల్పించాలి. దీనివల్ల పిల్లలు తల్లిదండ్రుల సమక్షంలోనే పెరగగలరు. హాస్టళ్లలో పడి బాల్యం కోల్పోకుండా చూడగలం. తల్లిదండ్రుల అజమాయిషీలో వారికి ఖర్చు లేకుండా అంతా ప్రభుత్వ కనుసన్నల్లో విద్యను నేర్చుకోగలరు. ఇలా కిలోమీటరు నుంచి ఐదు కిలోమీటలర్ పరిధి వరకు పిల్లలకు స్కూలును అందుబాటులోకి తీసుకుని రావడం ద్వారా సంక్షేమ హాస్టళ్ల బాధ తప్పుతుంది. ఇకపోతే ప్రత్యేక అవసరాలు గల మూగ, బధిర, అంధ బాలలకు మాత్రం ప్రత్యేకంగా పాఠశాలలను ఏర్పాటు చేసి, దానికి అనుబంధంగా మాత్రం హాస్టళ్లను కొనసాగించాలి. మానసిక ఎదుగుదల లేని పిల్లలు ప్రత్యేక అవసరాలు గల పిల్లలుగా గుర్తించినా, వారిని తల్లిదండ్రుల ప్రత్యేక పర్యవేక్షణ కిందనే ఉంచి, పాఠశాలల వసతులను కల్పించాలి. అభివృద్ధి చెందిన అమెరికా, బ్రిటన్ లాంటి దేశాల్లో సైతం ఏకీకృత పాఠశాల వ్యవస్థ ప్రభుత్వ రంగంలోనే విస్తృతంగా అభివృద్ధి చెందింది. మన దేశంలో నియంత్రణ, నియమాలు లేకుండా విచ్చలవిడిగా ప్రైవేటు పాఠశాల వ్యవస్థను అనుమతించడం వల్ల విద్యావ్యవస్థ వెర్రితలలు వేసింది. అవసరాలకు మించి ప్రైవేటు పాఠశాలల ఏర్పాటుతో ప్రభుత్వ పాఠశాల వ్యవస్థ దెబ్బ తింటోంది. తెలంగాణలో ఇప్పటికే నాలుగు వేల పాఠశాలలు మూతపడ్డాయని అంటున్నారు. 19లక్షల విద్యార్థులు ప్రభుత్వ విద్యాలయాల్లో చదువుతుంటే, 36లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు విద్యా సంస్థలలో చదువుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. మనకు ఇంగ్లీష్ లేనిదే ముద్ద దిగదు. సామాన్యులు కూడా తమ పిల్లలు ఇంగ్లీషులో మాట్లాడాలని అనుకుంటారు. అందుకు ప్రభుత్వ స్కూళ్లలో స్పోకెన్ ఇంగ్లీష్ తప్పనిసరి చేయాలి. ఎల్‌కెజి నుంచే అది మొదలు కావాలి. మీడియం తెలుగు అయినా స్పోకెన్ ఇంగ్లీష్ ఉంటే పిల్లలు కూడా పెద్దయ్యాక బెరకు లేకుండా దూసుకు పోగలరు. ఇవన్నీ గమనించి విద్యారంగాన్ని పటిష్టం చేసే చర్యలకు అడుగులు వేస్తే విద్యారంగంలో విప్లవం సాధించగలం.

# ఆధార్‌ను ఐడెంటిటీకే పరిమితం చేయాలి

**పౌరసత్వం, నివాస ధ్రువీకరణ తదితరాలకు వాడొద్దు**

**పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ**




**న్యూఢిల్లీ, జూన్ 18:** ఆధార్ కార్డు వినియోగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది ఆధార్ కార్డులను పౌరసత్వం, నివాసం, అడ్రస్ ధ్రువీకరణకు ప్రూఫ్‌గా వాడుతున్నారని, ఇది కేవలం ఐడెంటిటీ వెరిఫికేషన్‌కు మాత్రమే పరిమితం చేయాలని దాఖలైన పిటిషన్‌ను విచారణకు చేపట్టిన సుప్రీంకోర్టు.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటను స్పందించాలని సుప్రీంకోర్టు కోరింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసం, న్యాయవాది అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ్ పిటిషన్ ను విచారించింది. ఈ పిటిషన్ పై కేంద్ర ప్రభుత్వం, అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ చేసింది. ఆధార్‌ను ఐడెంటిటీ ప్రూఫ్ గా మాత్రమే వాడాలని పౌరసత్వం, నివాసం, అడ్రస్, పుట్టిన తేదీకి సంబంధించిన రుజువుగా వినియోగించకుండా కేంద్ర, రాష్ట్ర, ఎన్నికల సంఘాలకు ఆదేశాలు జారీ చేయాలని పిటిషన్‌లో కోరారు పిటిషనర్ అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ్. ఓటరు నమోదుకు బర్త్ డేట్, రెసిడెంట్ ప్రూఫ్ లకు ఆధార్ కార్డును వినియోగిస్తున్నారని, ఇది ఆధార చట్టానికి విరుద్ధమని పిటిషనర్ వాదించారు. ఆధార్ చట్టం, 2016లోని సెక్షన్ 9 'ఆధార్ పౌరసత్వానికి లేదా రెసిడెంట్ కు ప్రూఫ్ కాదని స్పష్టంగా తెలిపింది ఉడాయ్. అయినప్పటికీ, ఆధార్‌ను స్కూల్ అడ్మిషన్లు,ప్రాపర్టీ కొనుగోలు, బర్త్ ప్రూఫ్ రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ పొందడం కోసం వయస్సు, పౌరసత్వం, నివాస ధృవీకరణ పత్రంగా ఉపయోగించడమే కాకుండా, కొత్త ఓటరు నమోదుకు, పుట్టిన తేదీకి, నివాస ధృవీకరణ పత్రంగా కూడా వాడుతున్నారు. ఈ విధంగా, చొరబాటుదారులు, అక్రమ వలసదారులు ఆధార్‌ను ఉపయోగించి వివిధ డాక్యుమెంట్లను పొందుతున్నారని పిటిషన్‌లో కోర్టుకు తెలిపారు. ఎన్నికల పక్రియలలో ధృవీకరణ వ్యవస్థను సమగ్రంగా ప్రక్షాళన చేయాలని, సంస్కరణలను పర్యవేక్షించేందుకు విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తితో పాటు సైబర్ సెక్యూరిటీ, ఫోరెన్సిక్ నిపుణులతో కూడిన ఉన్నత స్థాయి పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేయాలని పిటిషన్‌లో కోరారు.

# 'డార్క్ వెబ్'గా టెలిగ్రామ్




- కేంద్రం సంచలన ఆరోపణలు
- సైబర్ నేరాలు, పేపర్ లీకులు, ఉగ్ర ప్రచారానికి వేదికగా మారిందని ఆరోపణ
- ఢిల్లీ హైకోర్టులో కేంద్రం అఫిడవిట్

**న్యూఢిల్లీ, జూన్ 18:** ప్రముఖ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ టెలిగ్రామ్ చట్టవిరుద్ధ కార్యకలాపాలు, సైబర్ నేరాలకు ప్రధాన వేదికగా మారిందని కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ హైకోర్టుకు తెలిపింది. ప్రస్తుత పరిస్థితుల్లో టెలిగ్రామ్ ఒక కొత్త 'డార్క్ వెబ్'లా రూపాంతరం చెందిందని, నేరస్థులు, సైబర్ మోసగాళ్లు, ఉగ్రవాద సంస్థలు దీనిని విస్తృతంగా వినియోగిస్తున్నాయని అఫిడవిట్‌లో పేర్కొంది. నీట్ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీ, వాటి పంపిణీకి టెలిగ్రామ్ ఛానళ్లు వేదికగా మారాయని కేంద్రం ఆరోపించింది. దీంతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని తెలిపింది. టెలిగ్రామ్ ద్వారా జరుగుతున్న సైబర్ మోసాలపై ఫిర్యాదులు భారీగా పెరిగాయని, హ్యాకర్లు దొంగిలించిన డేటా విక్రయాలు, మనీ లాండరింగ్ కార్యకలాపాలకు కూడా ఈ వేదికను వినియోగిస్తున్నారని పేర్కొంది. చిన్నారులపై లైంగిక వేధింపులకు సంబంధించిన కంటెంట్ వ్యాప్తి చెందడం భద్రతా సంస్థలకు తీవ్ర సవాలుగా మారిందని వెల్లడించింది. ఉగ్రవాద సంస్థలు తమ భావజాల ప్రచారం, తప్పుడు సమాచార వ్యాప్తికి టెలిగ్రామ్ గ్రూపులను ఉపయోగిస్తున్నాయని కేంద్రం తెలిపింది. అలాగే మాల్వేర్ పంపిణీ, సైబర్ దాడుల నిర్వహణకు కమాండ్ అండ్ కంట్రోల్ ప్లాట్‌ఫామ్‌గా కూడా టెలిగ్రామ్‌ను వినియోగిస్తున్నట్లు పేర్కొంది. పౌరుల మొబైల్ నంబర్లు, గుర్తింపు పత్రాల వివరాలు వంటి వ్యక్తిగత సమాచారాన్ని యాక్సెస్ చేసే బోట్లు కూడా టెలిగ్రామ్‌లో పనిచేస్తున్నాయని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. కొత్త సినిమాలు, వెబ్‌సిరీస్‌లు తదితర కాపీరైట్ కంటెంట్‌ను అక్రమంగా పంపిణీ చేయడం వల్ల సృష్టికర్తలకు భారీ నష్టం జరుగుతోందని కేంద్రం వివరించింది. టెలిగ్రామ్‌లోని అధిక ప్రైవసీ, అనామక ఫీచర్లు నేరగాళ్లకు రక్షణ కవచాలుగా మారాయని కేంద్రం పేర్కొంది. వినియోగదారులు తమ ఫోన్ నంబర్లు, ఐడీలను దాచుకునే అవకాశం ఉండటంతో నేరాల వెనుక ఉన్న అసలు వ్యక్తులను గుర్తించడం దర్యాప్తు సంస్థలకు క్లిష్టంగా మారుతోందని హైకోర్టుకు వివరించింది.




# హర్మ్యూజ్ తెరుచుకున్నా ఇంధన ధరలు తగ్గవు

**ఇప్పట్లో తగ్గించే ఉద్దేశం లేదన్న కేంద్రం**

**న్యూఢిల్లీ, జూన్ 18:** అమెరికా– ఇరాన్ మధ్య కుదిరిన ఒప్పందంతో పశ్చిమాసియా సంక్షోభానికి తెరపడింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు దిగిరానున్నాయి. అయితే, ముడి చమురు ధరలు తగ్గినా.. భారత్‌లో వెంటనే ఇంధన ధరలను మాత్రం తగ్గించలేమని కేంద్రం తాజాగా స్పష్టం చేసింది. పెట్రోలియం, సహజ వాయువు, పర్యాటక శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ ఇటీవల ఇంధన ధరలు పెంచడంపై గురువారం మాట్లాడారు. లీటరుకు దాదాపు రూ.3.94 మాత్రమే పెంచామన్నారు. అయితే, అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గినంత మాత్రాన.. ఆ పెంపును వెంటనే తగ్గించలేమన్నారు. హర్మ్యూజ్ జలసంధి తెరుచుకున్నప్పటికీ.. ప్రస్తుతం అక్కడ నౌకల రాకపోకల రద్దీ ఎక్కువగా ఉంటుందన్నారు. దీంతో తక్కువ ధరకు లభించే ముడి చమురు భారత్‌కు వచ్చేందుకు ఇంకా సమయం పడుతుందని తెలిపారు. ఇలా పలు అంశాల వల్ల ఇంధన ధరలను వెంటనే తగ్గించలేమని స్పష్టంచేశారు. ఇక, పశ్చిమాసియా యుద్ధం మొదలైనప్పటి నుంచి దేశంలోని చమురు కంపెనీలు తీవ్రంగా ప్రభావితమయ్యాయన్నారు. ఆ సమయంలో ఇంధన ధరలపై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించేందుకు ఏ రాష్ట్రం ముందుకు రాలేదన్నారు. దీంతో ఆ భారమంతా కేంద్రంపై పడిందన్నారు. దీని కారణంగా కేంద్రం రూ.12వేల కోట్ల మేర ఆదాయం కోల్పోయిందన్నారు.

# టీఎంసీకి ఎదురుదెబ్బ

**రితబ్రత బెనర్జీ నియామకంపై స్టేకు నిరాకరణ**

**కోల్‌కతా, జూన్ 18:** తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)కు కోల్‌కతా హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా రితబ్రత బెనర్జీ నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి హైకోర్టు నిరాకరించింది. జస్టిస్ కృష్ణారావు నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించి, తదుపరి విచారణ పూర్తయ్యే వరకు అసెంబ్లీ స్పీకర్ తీసుకున్న నిర్ణయం అమలులో కొనసాగుతుందని స్పష్టం చేసింది. దీంతో కేసు తుది తీర్పు వెలువడే వరకు రితబ్రత బెనర్జీ గుర్తింపు పొందిన ప్రతిపక్ష నాయకుడిగానే కొనసాగనున్నారు. ఈ కేసులో అఫిడవిట్ల మార్పిడిని త్వరగా పూర్తి చేయాలని ఇరు పక్షాలకు న్యాయస్థానం ఆదేశించింది. ప్రతివాదులు 3 వారాల్లోగా తమ వ్యతిరేక అఫిడవిట్‌ను దాఖలు చేయాలని, దానిపై పిటిషనర్లు రెండు వారాల్లో స్పందించాలని సూచించింది. తదుపరి విచారణను జులై 28కు వాయిదా వేసింది. కాగా, టీఎంసీ నుంచి బహిష్కరణకు గురైన రితబ్రత బెనర్జీ ఇటీవల పార్టీకి వ్యతిరేకంగా తిరుగుబాటు ఎమ్మెల్యేలకు నాయకత్వం వహిస్తున్నారు. తమకు 58 మంది టీఎంసీ ఎమ్మెల్యేల మద్దతు ఉందని ప్రకటిస్తూ, అభిషేక్ బెనర్జీ నాయకత్వానికి వ్యతిరేకంగా ప్రత్యేక వర్గాన్ని ఏర్పాటు చేశారు. తిరుగుబాటు వర్గం వాదనను పరిగణనలోకి తీసుకున్న అసెంబ్లీ స్పీకర్ రతీంద్ర బోస్ రితబ్రత బెనర్జీని ప్రతిపక్ష నాయకుడిగా గుర్తించారు. అయితే, అధికారిక రాజకీయ పార్టీని పక్కనబెట్టి స్పీకర్ ఈ నిర్ణయం తీసుకున్నారని, ఇది రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధమని ఆరోపిస్తూ టీఎంసీ వర్గం హైకోర్టును ఆశ్రయించింది.

# ఇసుక వివాదం రక్తపాతం

**బీజేపీ నేత సహా ముగ్గురు సజీవ దహనం ● ఛత్తీస్‌గఢ్‌లో సంచలనం.. నలుగురు అరెస్ట్**





రాయ్‌పూర్, జూన్ 18: ఛత్తీస్‌గఢ్‌లోని కోరియా జిల్లాలో ఇసుక మైనింగ్ వివాదం ఘోర హత్యాకాండకు దారితీసింది. బీజేపీ నేత, మాజీ జనపద్ పంచాయతీ అధ్యక్షుడు భరత్ సింగ్ (లల్లా సింగ్) సహా ముగ్గురు సజీవ దహనమైన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటన సోన్‌హత్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నౌగైన్ గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం, ఇసుక క్వారీ నిర్వహణకు సంబంధించిన వివాదాన్ని పరిష్కరించేందుకు చర్చల పేరుతో భరత్ సింగ్‌ను ప్రత్యర్థులు పిలిచారు. అక్కడికి చేరుకున్న అనంతరం ఆయన ప్రయాణిస్తున్న ఫార్చ్యూనర్ కారును ట్రక్కులతో చుట్టుముట్టి కదలకుండా అడ్డుకున్నారు. అనంతరం కారుపై పెట్రోల్ పోసి నిప్పంటించడంతో భరత్ సింగ్ కారులోనే సజీవ దహనమయ్యారు. ఈ ఘటనలో భరత్ సింగ్ బంధువులు వీరేంద్ర సింగ్, నాగేంద్ర సింగ్‌లు కూడా తీవ్రంగా గాయపడ్డారు. వారిలో వీరేంద్ర సింగ్ చికిత్స పొందుతూ మృతి చెందగా, మరో బంధువు మయాంక్ సింగ్ బిలాస్‌పూర్‌లోని ఆసుపత్రిలో విషమ పరిస్థితిలో చికిత్స పొందుతున్నాడు. స్థానికంగా ఇసుక మైనింగ్ వ్యాపారంలో ప్రభావం కలిగిన భరత్ సింగ్ కుటుంబానికి ఆ ప్రాంత ఇసుక క్వారీ కాంట్రాక్టు దక్కింది. అనంతరం ఇసుక తవ్వకాలు, రవాణా, వసూళ్ల విషయంలో భరత్ సింగ్ వర్గానికి, మనోజ్ త్రిపాఠి కుటుంబానికి మధ్య నెలలుగా ఆధిపత్య పోరు కొనసాగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ విభేదాలే చివరకు హింసాత్మక ఘటనకు దారితీసినట్లు భావిస్తున్నారు. ఈ దాడి ముందస్తు ప్రణాళికతో జరిగిన హత్యేనని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ, కేసును సీబీఐతో విచారించాలని డిమాండ్ చేశారు. ఘటన అనంతరం కోరియా జిల్లాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో భారీగా పోలీసు బలగాలను మోహరించారు. ఈ కేసులో అక్షత్ త్రిపాఠి, విశాల్ త్రిపాఠి, సత్యప్రకాశ్ త్రిపాఠి, మన్ను త్రిపాఠి అనే నలుగురు ప్రధాన నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. మొత్తం తొమ్మిది మందిపై హత్య, హత్యాయత్నం తదితర తీవ్రమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం గాలింపు చేపట్టారు. ఘటనపై సమగ్ర విచారణ కొనసాగుతోందని అదనపు ఎస్పీ సురేషా చౌబే తెలిపారు.

## మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీని మర్యాదపూర్వకంగా కలిసిన వేములమహేందర్ గౌడ్

**ఉమ్మడి వరంగల్ బ్యూరో, జూన్ 18,**




ఓరుగల్లు జిల్లా టైగర్..ఆపదొస్తే అండగా ఉండే ఆపద్బాంధవుడు..పేద ప్రజల ఆశాజ్యోతి కిరణం..నిస్వార్థ ప్రజా సేవకుడు మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీని హన్మకొండలోని రాంనగర్ లో గల ఆయన నివాసంలో బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు, కొండా దంపతుల వీరాభిమాని వేముల మహేందర్ గౌడ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా కొండా మురళీ మహేందర్ గౌడ్ తో ఆప్యాయంగా మాట్లాడారు. అనంతరం మహేందర్ గౌడ్ కుటుంబ స్థితిగతులను, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం..పేద ప్రజల బాగు కోసం నిరంతరం మహేందర్ గౌడ్ పోరాటం చేస్తాడని కొనియాడారు. కొండా దంపతుల వీరాభిమానిగా మంచి పనులు చేస్తూ..పేరు ప్రఖ్యాతులు పొందుతున్న మహేందర్ గౌడ్ ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

## జూన్ 20న జాతీయ లోక్ అదాలత్

**ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి**

**సీపీ సాధన రష్మీ పెరుమాళ్**

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, జూన్ 18 :**



జూన్ 20న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. చిన్న చిన్న కేసులతో కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృథా చేసుకోవద్దని ఆమె పేర్కొన్నారు. రాజీకి అవకాశం ఉన్న కంపౌండబుల్ కేసులు, సివిల్ వివాదాలు, ఆస్తి విభజన కేసులు, కుటుంబ సంబంధిత వివాదాలు, రోడ్డు ప్రమాదాల కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్, టౌన్ న్యూసెన్స్, చెక్ బౌన్స్ తదితర కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. సంబంధిత కేసుల్లోని ఫిర్యాదుదారులు, నిందితులు తమ పోలీస్ స్టేషన్ లేదా న్యాయస్థానాన్ని నేరుగా సంప్రదించి రాజీ ప్రక్రియలో పాల్గొనవచ్చన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో రాజీకి అనువైన కేసులను గుర్తించి, ఇరువర్గాలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు.లోక్ అదాలత్ ద్వారా బాధితులకు త్వరితగతిన న్యాయం లభిస్తుందని, జుడీషియల్ శాఖ కల్పించిన ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ పిలుపునిచ్చారు.

## మేదరమట్లలో షార్ట్ సర్క్యూట్ తో పాలిచ్చే మేక మృతి

**రూ. 25, 000 వేలు నష్టం**

**నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధితురాలి వేడుకోలు**

**ఉమ్మడి వరంగల్ బ్యూరో, జూన్ 18,**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని మేదరమెట్ల గ్రామంలో ఉడుత రజితకు చెందిన పాలిచ్చే మేక షార్ట్ సర్క్యూట్ తో గురువారం మృతి చెందింది. గ్రామస్తుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన కొడారి కుమారస్వామి వ్యవసాయ భూమి సమీపంలో గొర్ల మందను ఏర్పాటు చేశారు. కాగా ఉడుత రజితకు చెందిన రూ.25,000 వేల విలువచేసే పాలిచ్చే మేక మేత మేసుకుంటూ కొడారి కుమారస్వామి వ్యవసాయ భాయి వద్దకు వెళ్ళగానే..బావికి సంబంధించిన మోటర్ వైర్లను కొండీలతో విద్యుత్ వైర్లకు తగిలించారు. నేరుగా విద్యుత్ సరఫరా అవుతున్న వైర్లకు పాలిచ్చే మేక తాకి షార్ట్ సర్క్యూట్ తో మృతి చెందింది. దీంతో తీవ్రంగా నష్టపోయిన బాధితురాలు బోరున విలపించుకుంటూ.. నష్టపరిహారాన్ని అందించాలని ప్రభుత్వాన్ని వేడుకొన్నారు.

## వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటిన జిల్లా కలెక్టర్

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, జూన్ 18, :**



వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా గురువారం రంగారెడ్డి జిల్లా గుర్రంగూడ గ్రామంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది 16 కోట్ల మొక్కలను నాటే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వాములై వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని సిద్దిపేట జిల్లా కొండపాక మండలం మర్పడగ తేజోవనం అర్బన్ పార్క్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి, విద్యార్థులు, పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్, జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి పద్మజారాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం తదితర అధికారులతో కలిసి డిజిటల్ తెరపై వీక్షించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మొక్కల పెంపకం పర్యావరణ పరిరక్షణకు ఎంతో దోహదపడుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా జిల్లాలో 20 లక్షల మొక్కలను నాటేందుకు అటవీ శాఖతో పాటు ఇతర శాఖల సమన్వయంతో నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేసినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా మొక్కలు నాటి వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడు తున్నామని చెప్పారు. జిల్లా ప్రజలందరూ ఈ బృహత్తర కార్యక్రమంలో భాగస్వాములై మొక్కలు నాటి, వాటిని సంరక్షించి వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# దొర గారి మెప్పు కోసమే కొప్పుల, ఆర్ఎస్పీ ఆరాటం

- కేసీఆర్ అవమానించినప్పుడు దళితుడిగా కొప్పులకు అండగా నిలిచిన..
- దోచుకోవడం బీఆర్ఎస్ పార్టీకి పెటెంట్ హక్కు..
- కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు జీవన్ రెడ్డి వాట ఎంతో చెప్పాలి..
- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..



**ఉమ్మడికరీంనగర్‌బ్యూరో,జూన్18, :**

హరీష్ రావు దొర గారి మెప్పు పొందడానికి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ పార్టీ కార్యదర్శిగా ఉన్న ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ తనపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో దొరలు అవమానిం చినప్పుడు కొప్పుల ఈశ్వర్ కు సాటి దళితుడిగా అండగా నిలిచానని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. దోచుకోవడం దాచుకోవడం బీఆర్ఎస్ పార్టీకి పెటెంట్ హక్కు అని, కాంగ్రెస్ పార్టీలో ఉన్న సమయంలో జీవన్ రెడ్డికి వచ్చిన వడ్ల కమీషన్ ఎంతో చెప్పాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గురువారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి అడ్లూరి మాట్లాడుతూ ఏడాది క్రితం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రిగా తాను బాధ్యతలు తీసుకున్నానని మంత్రి అడ్లూరి అన్నారు. గత ప్రభుత్వంలో సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పని చేశారని, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గురుకుల పాఠశాల కార్యదర్శిగా పని చేశారని ఏడాది కాలంగా ఎందుకు ఆయా శాఖలపై మాట్లాడలేదని మంత్రి అడ్లూరి ప్రశ్నిం చారు. సంక్షేమ శాఖలో రూ. 2వేల కోట్ల అవినీతి జరిగిందని హరీష్ రావు ఆరోపిస్తే ఆశాఖ మంత్రిగా జవాబు చెప్పాల్సిన బాధ్యత తనపై ఉందని మంత్రి అడ్లూరి అన్నారు. సంక్షేమ శాఖకు సంబంధించి విద్యార్థులకు కావాల్సిన వస్తువుల కొనుగోలుకు రూ. 683 కోట్లతో టెండర్లు పిలిచామని, రూ. 500 కోట్లతో ప్రభుత్వరంగ సంస్థలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం టెండర్ల ఖరారు చేశామని మంత్రి అడ్లూరి తెలిపారు. మొత్తం రూ. 1183 కోట్లకు టెండర్లు పిలిస్తే మాజీ మంత్రి హరీష్ రావు రూ. 2వేల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపిస్తే ఆశాఖ మంత్రిగా జవాబు చెప్పానని మంత్రి అడ్లూరి అన్నారు. తాను జవాబు చెప్పితే దొరగారి మెప్పు కోసం కొప్పుల ఈశ్వర్ ఖబ్దార్ అని మాట్లాడుతున్నారని మంత్రి అడ్లూరి అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కొప్పుల ఈశ్వర్ కు అవమానం జరిగితే తాను సాటి దళితుడిగా ఆరోజు ప్రతిపక్షంలో ఉండి అండగా నిలిచానని మంత్రి అడ్లూరి అన్నారు. 2018 ఎన్నికల్లో కొప్పుల ఈశ్వర్ ఎలా గెలిచాడో తెలంగాణ ప్రజలందరికి తెలుసని అన్నారు. కొప్పుల మంత్రిగా ఉన్న సమయంలో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూం తాళం పోతే ఎక్కడ పోయిందని అడిగితే మంత్రిగా ఉన్న కొప్పుల ఈశ్వర్ సమాధానం చెప్పాలేదని మంత్రి అడ్లూరి అన్నారు. కొప్పులపై తాను 2009లో పోటీ చేస్తే కేవలం1165ఓట్ల తేడాతో ఓడిపో యానని, 2014లో 16వేల మెజార్టీతో ఓడిపోయానని, తెలంగాణ కోసం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు పోటీ చేసిన సమయంలో రాష్ట్రంలో ఎవ్వరికి డిపాజిట్ రాలేదని తనకు మాత్రమే డిపాజిట్ వచ్చిందని మంత్రి అడ్లూరి గుర్తు చేశారు. ధర్మపురి ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేసిన కొప్పుల ఈశ్వర్ నియోజకవర్గానికి ఏమీ చేయలేదని మంత్రి అడ్లూరి అన్నారు. ధర్మపురికి డిగ్రీ కళాశాల, రెవెన్యూ డివిజన్, ఆర్టీసీ బస్సు డిపో ఏమీ తీసుకురాకపోవడంతోనే 2023 ఎన్నికల్లో ఈశ్వర్ కు ప్రజలు బుద్ధి చెప్పారని మంత్రి అడ్లూరి అన్నారు. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో సైతం ధర్మపురి నియోజకవర్గ ఓటర్లు కొప్పులకు ఓట్లే వేయలేదని మంత్రి అడ్లూరి తెలిపారు. దోచుకోవడం దాచుకోవడం బీఆర్ఎస్ పార్టీకి పెటెంట్ హక్కు అని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గతంలో సంక్షేమ శాఖ మంత్రిగాఉన్న కొప్పుల, గురుకుల కార్యదర్శిగా ఉన్న ప్రవీణ్ కుమార్ కలిసి దోచుకున్నారు కనుక ఇప్పుడు ఇలా మాట్లాడుతున్నారని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పారదర్శకంగా పని చేస్తుందని మంత్రి పేర్కొన్నారు.జీవన్ రెడ్డి వాటాఎంతో చెప్పాలి కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు, మాజీ మంత్రి జీవన్ రెడ్డి వడ్ల కొనుగోలులో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్నారని, జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉన్న సమయంలో రాష్ట్ర ప్రభుత్వం నాలుగు సీజన్లలో వడ్లు కొనుగోలు చేసిందని, మరి అప్పుడు జీవన్ రెడ్డికి ఎంత కమీషన్ వచ్చిందో చెప్పాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలి

- బీ.ఎల్.ఓలు విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలి..
- జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 18, :**

ఎస్.ఐ.ఆర్. ప్రక్రియ బీ.ఎల్.ఓ.లకు శిక్షణ కార్యక్రమం మల్లాపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక సమగ్ర పునర్విమర్శ (ఎస్ఐఆర్) కార్యక్రమానికి సంబంధించిన బూత్ స్థాయి అధికారుల (బీఎల్ఓలు) శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ గురువారం పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూఎన్నికల ప్రక్రియలో బీఎల్ఓల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర పునర్విమర్శ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించాలని సూచించారు. ఇంటింటి సర్వే సందర్భంగా ప్రతి ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఓటర్ల నుంచి వచ్చే దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిశీలించి, నిబంధనల మేరకు పరిష్కరించాలని, ఓటరు జాబితాల నాణ్యతను మెరుగుపరచడంలో బీఎల్ఓలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావు లేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన ప్రతి అంశంపై పూర్తి అవగాహన కలిగి



ఉండాలని, ప్రజలకు అవసరమైన సమాచారం అందిస్తూ ఎన్నికల ప్రక్రియపై విశ్వాసాన్ని పెంపొందించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీఓ జీవాకర్ రెడ్డి, తహసీల్దార్, ఎంపిడివో, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంద్రమ్మ ఇళ్లను ప్రారంభించిన మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి

- పేదల సొంతింటి కల సాకారం

**గజ్వేల్ టౌన్, జూన్ 18:**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం అహ్మదిపూర్ గ్రామంలో మంద శేఖర్ గురువారం ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం పూర్తి కావడంతో గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ కాన్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్లు చేపట్టిన పథకం ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తికావడం లబ్ధిదారు లు నూతన గృహప్రవేశం చేయడం ఎంతో



సంతోషంగా ఉన్నదన్నారు. నేడు ఇల్లు పూర్తి నిర్మాణం చేసుకొని ప్రారంభించడం జరిగిందన్నారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి నిర్మాణానికి సహకరించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డికి, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ఆంక్ష రెడ్డికి నియోజకవర్గ ప్రజలందరి తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు మహేశ్వరి మల్లికార్జున్ , కాంగ్రెస్ నాయకులు సుఖేందర్ రెడ్డి, సమీర్, రమేష్ గౌడ్, కర్ణాకర్ రెడ్డి, అజ్గర్, బాల్ గౌడ్, ఎల్లగౌడ్, రామచంద్ర రెడ్డి, మంద నరసింహులు బాల్ రాజు గౌడ్, అంజా గౌడ్, బోయిన్ రామచంద్రం, పాల రాములు గౌడ్, ఆర్మల రామచంద్రం, ఆకుల ప్రభాకర్ , మల్లేశం, బిక్షపతి, బుచ్చిరెడ్డి, శేశక్, తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే డబ్లింగ్ పనులకు ఎలాంటి అవాంతరాలు రావద్దు

**తూప్రాన్, జూన్ 18 :**

మేడ్చల్ అక్కన్నపేట ముద్దేడు రైల్వే డబ్లింగ్ పనులు జరుగుతున్నందున రైల్వే డబ్లింగ్ పనులు సజావుగా కొనసా గేందుకు పరస్పరం సమన్వయంతో ముందుకు సాగాలని తూప్రాన్ డిఎస్పి నరేంద్ర గౌడ్ తెలిపారు. మానోహ రాబాద్ మండల పరిధిలో కొనసాగు తున్న మెద్చల్–అక్కన్నపేట–ముద్దేడ్ రైల్వే డబ్లింగ్ పనుల నేపథ్యంలో, ప్రతిపాదిత మానోహరాబాద్ రైల్వే ఓవర్ బ్రిడ్జ్, లింగారెడ్డిపేట రైల్వే ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణ ప్రాంతాలను అధికారులు గురువారం సంయుక్తంగా పరిశీలిం చారు. ఈ సందర్భంగా బ్రిడ్జ్ నిర్మాణ పనుల కారణంగా వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ట్రాఫిక్ మళ్లింపు మార్గాలను గుర్తించి, వాటిపై సంబంధిత అధికారులతో చర్చించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ నవ్యశ్రీ, మానోహరాబాద్ ఎస్ఐ సుభాష్ గౌడ్, రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టుకు సంబంధించిన అధికారులు, సిబ్బంది, కేఎంసి నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. రైల్వే డబ్లింగ్ పనులు సజావుగా కొనసాగేందుకు పరస్పర సమన్వయంతో ముందుకు సాగాలని సమావేశంలో నిర్ణయించారు.



## బదిలీపై వెళ్లిన ఎంపీడీవోకు ఘన సన్మానం



**కుకునూరుపల్లి, జూన్ 18 :**

కుకునూరుపల్లి మండల ఇంచార్జ్ ఎంపీడీవోగా పనిచేసి పదోన్నతిపై బదిలీ అవుతున్న రాంప్రసాద్‌కు మండల కేంద్రంలో గురువారం సహచర అధికారులు, ప్రజాప్రతినిధులు, మండల సిబ్బంది ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాంప్రసాద్ మండల అభివృద్ధికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేర్చడానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. అనంతరం ఎంపీడీవో రాంప్రసాద్ మాట్లాడుతూ తన పదవీ కాలంలో విధుల నిర్వహణకు సహకరించిన ప్రజాప్రతినిధులకు, అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచ్ లు కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రియల్ లైఫ్ లో 'రియల్ హీరో'

- గౌడ జాతికే వన్నెతెచ్చిన ఆణిముత్యం
- సమాజ సేవకై నిరంతరం పరితపించే కోహినూర్ వజ్రం
- ప్రజా హృదయాలలో చెరగని ముద్ర
- డాక్టర్ భీమగాని యాదగిరి గౌడ్ చేసిన అరుదైన సేవలకు రాష్ట్ర సేవా పురస్కార్ ప్రధానం




**ఉమ్మడి వరంగల్ బ్యూరో, జూన్ 18,**
సినిమా తెరపై రంగుల ప్రపంచంలో ప్రజాసేవ చేస్తున్నట్లు ఫోజులిచ్చే రీల్ హీరోలను చూసి ఈలలు వేస్తాం..చప్పట్లు కొడతాం. కానీ..నిజ జీవితంలో అంకితభావంతో ప్రజలకు సేవ చేసి శభాష్ అనిపించుకునే రియల్ హీరోలు కొందరే ఉంటారు. అలాంటి వారిలో ప్రజాసేవకై నిరంతరం పరితపించే వారిలో ఒకరిగా భీమగాని యాదగిరి గౌడ్ నిలిచారు. ఈ క్రమంలో జూన్ 15, 2026న తెలంగాణ సరస్వతీ పరిషత్ హాల్ లో జరిగిన ఆసియా వేదిక్ ఇంటర్నేషనల్ కల్చరల్ అండ్ రీసెర్చ్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డుకు భీమగాని యాదగిరి గౌడ్ ఎంపికైనారు. ఓరుగల్లు నగరానికి చెందిన డాక్టర్ భీమగాని యాదగిరి గౌడ్ చేసిన ప్రజా సేవలను గుర్తించిన స్ఫూర్తి అకాడమీ వారు రాష్ట్ర సేవా పురస్కారం అవార్డును అందించారు. డాక్టర్ భీమగాని యాదగిరి గౌడ్ గత 40 సంవత్సరాల క్రితం నుండే తన తల్లి గారైన భీమగాని లక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి అనేక సేవా కార్యక్రమాలను చేపట్టినారు. ప్రతి సంవత్సరం 10వ తరగతి ఉత్తీర్ణత చెందిన విద్యార్థులను గుర్తించి వారికి నగదు పారితోషకంతో పాటు జ్ఞాపికలను అందించి విద్యార్థులను ప్రోత్సహించేవారు. అంతేకాకుండా అనాథ ఆశ్రమాలలో అన్నదానాలు చేయడం, రైల్వే స్టేషన్, బస్టాండ్లలో ఉండేటువంటి అనాథలను గుర్తించి వారికి దుప్పట్లు, అన్నం ప్యాకెట్లు మరియు వాటర్ బాటిల్ లను అందించేవారు. చలికాలంలో వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేసేవారు. తన ముందు ఎలాంటి అన్యాయం జరిగిన సహించకుండా..వెంటనే అన్యాయాలను ఖండించి, ఇరు వర్గాలకు న్యాయం చేసేవారు, నిరుపేదలకు మెడికల్ క్యాంపులు నిర్వహించి పేదలకు ఉచితంగా మెడిసిన్ సప్లై చేసేవారు. ఎదుటివారికి ఎలాంటి కష్టం వచ్చిన..తన కష్టంగా భావించి ఆర్థిక సహాయాలను అందించేవారు. ఇలాంటి ప్రజాసేవ కార్యక్రమాలను ఎన్నో చేసిన డాక్టర్ భీమగాని యాదగిరి గౌడ్ ఉత్తమ సేవలకు ఈ అరుదైన గౌరవం దక్కింది. ఈ సందర్భంగా భీమగాని యాదగిరి గౌడ్ మాట్లాడారు. తాను తీసుకున్న ఈ సేవ పురస్కారం అవార్డు తన యొక్క బాధ్యతను మరింత పెంచిందన్నారు. తనను ఈ అవార్డుకు ఎంపిక చేసిన స్ఫూర్తి అకాడమీ వ్యవస్థాపకులు ఆకుల రమేష్ కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గౌడ జాతిలో పుట్టిన ఈ ఆణిముత్యం..సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వారసత్వాన్ని పునికి పుచ్చుకొని..బీసీల రాజ్యాధికారమే లక్ష్యంగా పనిచేస్తున్న కోహినూర్ వజ్రం..బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ భీమగాని యాదగిరి గౌడ్ మరెన్నో సేవలు చేసి..ఆయన జీవితంలో ఇంకా ఎన్నో పురస్కారాలు అందుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్ ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

# దమ్మపేట చిరు వ్యాపారులకు అభయహస్తం

- పంచాయతీ స్థలంలో షాపుల నిర్మాణానికి ముగ్గు పోసిన పాలకవర్గం



**దమ్మపేట, జూన్ 18 :**
దమ్మపేట మండల కేంద్రంలో గ్రామ పంచాయతీకి చెందిన స్థలంలో షాపుల నిర్మాణానికి ఇప్పటికే గ్రామ పంచాయతీ పాలకవర్గం తీర్మానం చేసి ఉంది. గురువారం భూమి పూజ నిర్వహించి షాపులు నిర్మాణం చేయుటకు ఇంజనీర్ చే ముగ్గు పోశారు. 9 సం.ల క్రితం వరకు ఇట్టి స్థలంలో సంత నిర్వహించబడేది. ప్రస్తుతం సంత కొట్టులు రాజీవ్ గాంధీ సెంటర్ వైపు మళ్ళడం తో ఖాళీగా ఉన్న ఇట్టి పంచాయతీ ప్రదేశంలో కొత్తగా ఏర్పడిన పంచాయతీ పాలకవర్గం దృష్టి సారించి శుభ్రం చేయించి, షాపులు నిర్మాణం కొరకు గురువారం గ్రామ పెద్దల సమక్షంలో మొత్తం 19 షాపులకు ముగ్గు పోశారు. ఈ సందర్భంగా కార్యదర్శి బండి అనంత్ కుమార్ మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా దమ్మపేట ప్రధాన రహదారి ఇరువైపుల గల డ్రైనేజీలపై ఆక్రమణ చేసిన వ్యాపారులకు నోటీసులు పంపించి ఖాళీ చేయాలని చెప్పడంతో పూర్తిగా డ్రైనేజీ షాప్ లు నిర్వహిస్తున్న వ్యాపారులు తమకు ప్రత్యామ్నాయ స్థలం కావాలి అని సర్పంచ్ ని కోరినందున 19 షాపులకు లాటరీ ద్వారా లీజు కేటాయింపు మరియు అధికారిక నిబంధనలు తప్పనిసరి తో లీజు వ్యవధి, నెలవారీ అద్దె చెల్లింపులు, మరియు నిర్వహణ నియమాల పై త్వరలో ఎవరైతే పూర్తిగా డ్రైన్ల పై వ్యాపారం చేస్తున్న వారికి ముందుగా అవకాశం అని తెలియజేశారు. జూన్ 20 వ తేదీన దమ్మపేట ప్రధాన రహదారికి ఇరువైపుల డ్రైన్ల ఆక్రమణలను జే. సి.బి తో తొలగిస్తామని చెప్పారు. ఇప్పటికే పలు మార్లు ప్రతీ షాప్ యజమానికి నోటీస్లు ఇచ్చామని, మైక్ పెట్టి ప్రచారం చేశాం అని, ఇక అవకాశం ఇవ్వలేము అని డ్రైన్ పై నుండి రోడ్డు మధ్యలో షాప్ బోర్డు లు కూడా తొలగించాలి అని తెలియజేశాం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, గ్రామస్తులు పగడాల రాంబాబు, చిన్నశెట్టి యుగంధర్, చిట్టిబాబు, గోపి, ముక్తేశ్వరరావు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, దారా రాము, రూపా రాంబాబు, బత్తుల సాయి, దాసరోజు రామారావు, రామబ్రహ్మం, పండూరి వీరబాబు, పెరుమాళ్ళ కృష్ణమూర్తి, గట్ల సర్వేశ్వరరావు, శ్రీను, నాగరాజు, నల్లగట్ల సత్యంబాబు, వనమాల సూరిబాబు, ఏలూరి సత్తిబాబు, దేవయ్య, తిరువీధుల శ్రీను, పగడాల గోపి, భాస్కర్, పంచాయతీ సిబ్బంది మహాదేవ సాయి, కాకాని గణేష్, భీమా శ్రీనివాసరావు, కొప్పర్తి సింగ్ తదితరులు ఉన్నారు.

# వైద్య విద్య ప్రవేశ అర్హత పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి**

**సిద్దిపేట కలెక్టరేట్, జూన్ 18, :**
జిల్లాలో వైద్య విద్య ప్రవేశ అర్హత పరీక్షను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ పరీక్ష అత్యంత ప్రతిష్ఠాత్మకమైనదని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 723 మంది, అజంపుర ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 216 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. మొత్తం 939 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు చెప్పారు. ఈ నెల 21వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల 15 నిమిషాల వరకు పరీక్ష నిర్వహించబడుతుందని తెలిపారు. అభ్యర్థులను ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట 30 నిమిషాల వరకు మాత్రమే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారని చెప్పారు. అభ్యర్థులు ప్రవేశ పత్రం, పాస్‌పోర్టు పరిమాణ ఫొటో, అసలు గుర్తింపు కార్డు, పారదర్శక నీటి సీసా మాత్రమే తీసుకురావాలని సూచించారు. ఎలాంటి విద్యుత్ పరికరాలను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. ప్రతి పరీక్ష కేంద్రంలో ప్రధాన పర్యవేక్షకుడితో పాటు ఒక కార్యనిర్వాహక న్యాయాధికారిని నియమించినట్లు తెలిపారు. అన్ని పరీక్ష గదుల్లో నిఘా చిత్రీకరణ పరికరాలు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన పోలీసు బందోబస్తు కల్పించినట్లు చెప్పారు. పరీక్ష రాసే విద్యార్థులకు తాగునీరు, విద్యుత్ సరఫరా, మరుగుదొడ్లు, కూర్చునే ఏర్పాట్లు తదితర సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లతో పరీక్షలను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ, కలెక్టరేట్ పరిపాలన అధికారి రాజ్‌కుమార్, పరీక్ష సమన్వయకర్త తదితరులు పాల్గొన్నారు.



# మంచినీటి, డ్రైనేజీ సమస్యల పరిష్కరించాలి



- మాజీ కార్పొరేటర్ బి విజయ శేఖర్ గౌడ్ వినతి:

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూన్ 18, :**
ఉమ్మడి రంగారెడ్డి నగర్ డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో మంచినీటి మరియు భూగర్భ డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని మాజీ కార్పొరేటర్ బి. విజయ శేఖర్ గౌడ్ అభ్యర్థించారు. ఐడిపిఎల్ సమీపంలోని టిజిహెచ్‌బి కాలనీలోని జలమండలి ప్రధాన కార్యాలయంలో జలమండలి మేనేజర్ పూజితకు గురువారం వినతి పత్రం అందించారు. మంచినీటి సరఫరా, పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ పనులు, డ్రైనేజీ నిర్వహణ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిం చాలని కోరారు. ప్రజలకు సరిపడా మంచినీటిని సమయానికి అందించాలని, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బిఆర్ఎస్ మాజీ అధ్యక్షులు ఏర్వ శంకరయ్య, బిఆర్ఎస్ నాయకులు, నాయకురాళ్లు, కాలనీల, బస్తీల ప్రజలు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న ఈసెట్-2026 కౌన్సెలింగ్

**నంగునూరు, జూన్ 18, :**
రాష్ట్రవ్యాప్తంగా జరిగే ఈసెట్-2026 ప్రవేశాల కౌన్సెలింగ్ స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ లో కొనసాగుతోంది. పాలిటెక్నిక్ డిప్లొమా చదివిన విద్యార్థులకు ఇంజనీరింగ్ విద్యను అభ్యసించడానికి వీలుగా, ఈసెట్-2026 ప్రవేశ పరీక్షను ఈ సంవత్సరం మే నెల 15వ తేదినాడు నిర్వహించారు. ఈసెట్-2026 లో ఉత్తీర్ణులయిన విద్యార్థులు నేరుగా ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో ప్రవేశం పొందేందుకు నిర్వహించే ఈ కౌన్సెలింగ్ బుధవారం ప్రారంభమైందని గురువారం కూడా కొనసాగిందని ప్రధానాచార్యుడు అలుగోజు గోవర్ధన్ తెలిపారు. ఈ కౌన్సిలింగ్ ప్రక్రియ ఈ నెల 19వ తేదీ వరకు నిర్వహిస్తామని తెలియజేశారు. స్లాట్ విధానంలో నిర్వహించే ఈ కౌన్సెలింగ్ లో ప్రతి రోజూ 16 స్లాట్స్ ఉంటాయని చెప్పారు. ప్రతి స్లాట్లో 15 మంది విద్యార్థులకు చెందిన వివిధ రకాల పత్రాల పరిశీలన చేస్తారని తెలిపారు. వెబ్ ఆప్షన్స్ కు సంబంధించిన సూచనలూ ఇస్తారని కళాశాల ప్రధానాచార్యుడు తెలియజేశారు. పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తిచేసి ఈసెట్ - 2026లో ఉత్తీర్ణులయిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ విద్యాసంవత్సరం నుండి రాజగోపాల్ పేట ప్రభుత్వ పాలిటెక్నిక్ తో పాటు, హుస్నాబాద్ లోని శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసెట్ కౌన్సిలింగ్ జరుగుతోందని తెలియజేశారు. ఇప్పటి వరకు కౌన్సెలింగ్ కోసం 353 మంది స్లాట్ బుక్ చేసుకోగా 344 మంది విద్యార్థులు తమ ధ్రువపత్రాలను పరిశీలన చేయించుకున్నారని సహాయకేంద్రం సమన్వయకర్త, ప్రధానాచార్యుడు అలుగోజు గోవర్ధన్ తెలిపారు. కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి శ్రీ అభినవ్ ఆధ్వర్యంలో జరిగిన ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియలో సయ్యద్ షహబాజ్, రాజు, రామకృష్ణ, పాతూరి శ్రీనివాస రెడ్డి, మధుబాబు, రాజమౌళి, విజయకుమార్, సంతోష్, నవీన్ కుమార్ పాల్గొన్నారు.



# వర్షం కోసం గ్రామ దేవతలకి ప్రత్యేక పూజలు

- గ్రామ దేవతల ఆశీర్వాదంతో గ్రామ సుభిక్షంగా ఉండాలి
- బల్ధ మల్లేశం సర్పంచ్ ఖానాపూర్



**నంగునూరు, జూన్ 18, :**
సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం ఖానాపూర్ గ్రామంలో గురువారం వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షిస్తూ గ్రామస్థులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రకృతి కరుణించాలని పంటలు బాగా పండాలని కోరుకుంటూ గ్రామ ప్రజలు ఐక్యంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు నీటితో నిండిన బిందలను ఉంచి పాటలు పాడుతూ బతుకమ్మ ఆడారు అనంతరం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బల్ధ మల్లేశం మాట్లాడుతూ వర్షాల కోసం గ్రామస్థులు అంతా ఒక్కటై భక్తి శ్రద్ధలతో గ్రామ దేవతలను ప్రార్థించడం ఆనందంగా ఉందన్నారు. ఎండల తీవ్రత తగ్గి, సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులందరికీ మంచి పంటలు రావాలని దేవుళ్ళను కోరినట్టు తెలిపారు. గ్రామంలో పంటలు బాగా పండితేనే గ్రామ అభివృద్ధి సాధ్యమవుతుందని, అందుకే ప్రతి ఒక్కరూ ప్రకృతి పట్ల గౌరవంతో ఉండాలని తెలిపారు. గ్రామ ప్రజలు ఐక్యంగా కలిసి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం సంతోషం అని, భవిష్యత్తులో కూడా గ్రామ అభివృద్ధి కోసం అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువత, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీసీ రోడ్ల నిర్మాణానికి పూజ చేసి ప్రారంభించిన సర్పంచ్ హరీష్ గౌడ్




**తూప్రాన్, జూన్ 18, :**
ఎన్ఆర్ఈజీఎస్ ఐదు లక్షల నిధులతో తూప్రాన్ మండలం వెంకటాయపల్లి గ్రామంలో నూతన సీసీ రోడ్ల నిర్మాణానికి గురువారం గ్రామ సర్పంచ్ హరీష్ గౌడ్ ప్రత్యేకంగా పూజలు నిర్వహించి పనులను ప్రారంభించారు. గ్రామంలో కొన్ని వీధులలో సీసీ రోడ్లు లేకపోవడంతో ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్ జరిగింది ఇందుకు. ఎన్ఆర్ఈజీఎస్ ఐదు లక్షల నిధులు విడుదల చేయడంతో సీసీ రోడ్లు ప్రారంభించడం జరిగిందని సర్పంచ్ హరీష్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ కళ్యాణి, ఉపసర్పంచ్ చంద్రకళ రాములు, పాలకవర్గం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ ను యోగా దినోత్సవానికి ఆహ్వానించిన కాంగ్రెస్ నాయకులు ఆలేటి శ్రీనివాసరావు



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూన్ 18, :**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 276 డివిజన్ ప్రగతినగర్‌లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆలేటి శ్రీనివాస్ రావు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి సూచన మేరకు, గురువారం కుత్బుల్లాపూర్ జోనల్ కమీషనర్ పార్మర్ పింకేష్ కుమార్ లలిత కుమార్ ఐఏఎస్‌ను కలిశారు. వాసవి సొసైటీలో సీనియర్ సిటిజన్ మరియు కాలనీవాసుల కోసం ఏర్పాటు చేయబోయే యోగా సెంటర్ మరియు గతంలో కొమురంభీమ్ పార్క్ పక్కన వర్షాలకు వాటర్ డంప్ అవుతున్నందున హార్వెస్టింగ్ పిట్ ఏర్పాటు, పలు పెండింగ్ పనులను జోనల్ కమీషనర్‌కు మరోసారి రిమైండ్ చేస్తూ, ఆన్ 21/06/2026న జరగబోయే 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రగతినగర్‌లో జరగబోతున్న సందర్భంగా ఆయనకు ఆహ్వాన పత్రిక అందించడం జరిగింది. జోనల్ కమీషనర్ సానుకూలంగా స్పందించి వెంటనే అంచనాలు రూపొందించాలని నిజాంపేట్ కమీషనర్‌కు ఆదేశించారు.

# లంచం తీసుకుంటూ ఏసీబీ వలలో చిక్కిన విద్యుత్ శాఖ ఏఈ



**పటాన్చెరు, జూన్ 18, :**
సంగారెడ్డి జిల్లా ఐడీఏ బొల్లారంలోని విద్యుత్ శాఖలో అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ)గా పనిచేస్తున్న రామకృష్ణారెడ్డి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారుల వలలో చిక్కారు.ఐడీఏ బొల్లారంకు చెందిన మహమ్మద్ ఇఫ్రాజ్ అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు, కరెంట్ పోల్ పునర్నిర్మాణానికి సంబంధించి రూ.25 వేల లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఫిర్యాదుదారుడి నుంచి రూ.25 వేల లంచం స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.ఈ ఘటనపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. పూర్తి వివరాలు అధికారిక ప్రకటన అనంతరం వెల్లడికానున్నాయి.

# విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానం పెంచుకోవాలి

- **కస్తూరిపల్లి రమేశ్ బాబు, సిద్ధిపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు**

**నంగునూరు, జూన్ 18, :**

మారుతున్న కాలానికి అనుగుణంగా కంప్యూటర్, కృత్రిమ మేధ వంటి వాటిపై అవగాహన పెంచుకోవాలని సిద్దిపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కస్తూరి పల్లి రమేష్ బాబు విద్యార్థులకు సూచించారు. రమేశ్ బాబు స్వగ్రామమైన గట్ల మల్యాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గ్రామ మాజీ సర్పంచి కర్ణకంటి రవీంద్రాచారి చొరవతో సిద్దిపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కస్తూరిపల్లి రమేశ్ బాబు రూ.60 వేలు వెచ్చించి కొనుగోలు చేసిన కంప్యూటర్ గురువారం అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాదాసి రమేశ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో రమేశ్ బాబు మాట్లాడుతూ ప్రస్తుతం కంప్యూటర్ల అవసరం ఎంతో ఉందని చెప్పారు. దీనిని సక్రమంగా వినియోగించుకుని కంప్యూటర్ పరిజ్ఞానం పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. కంప్యూటర్ బహూకరించిన రమేశ్ బాబుకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మదాసి రమేశ్ బాబు ధన్యవాదాలు తెలిపారు. ఈ కంప్యూటర్ ను వినియోగించుకుని విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం పెంచుతామని తెలియజేశారు. గ్రామ సర్పంచ్ ఇంగ నరేశ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు సాయం అందించే దాతలను స్ఫూర్తిగా తీసుకొని మరికొందరు పాఠశాల అభివృద్ధి, గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి కర్ణకంటి రవీంద్రాచారి, ఉపాధ్యాయులు అశోక్, విజయ్ కుమార్, నోముల లింగం, పంతం నరేశ్, దర్శనాల రాజ్ కుమార్, బాబు పాల్గొన్నారు.




# విద్యార్థులు శ్రద్ధతో బడికి వచ్చి బాగా చదువుకోవాలి

## లింగాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్ల పంపిణీ

- **విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలి**
- **ఉపాధ్యాయులు విద్యార్థుల సంఖ్యను పెంచుకోవాలి**
- **విద్యార్థులకు ఉపాధ్యాయులకు సూచించిన దోనర్లు**

**తొగుట, జూన్ 18, :**

విద్యార్థులు ప్రతిరోజు శ్రద్ధతో బడికి వచ్చి బాగా చదువుకోవాలని, విద్యార్థులు అందరూ క్రమశిక్షణ పాటించి ఉపాధ్యా యులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా వినాలని లింగాపూర్ గ్రామానికి చెందిన నలుగురు యువకుల మిత్రబృందం సభ్యులు కొంగరి యాదగిరి, చేపూరి సిద్ధార్థ గౌడ్, కొత్తపల్లి పృథ్వీరాజ్, గంగి నవీన్ లు పిలుపునిచ్చారు. తొగుట మండలంలోని లింగాపూర్ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న 40 మంది విద్యార్థులకు గురువారం నోటు




పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను మిత్ర బృందం సొంత డబ్బులను వెచ్చించి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు విద్యార్థులకు నోటు పుస్తకాలను, పెన్నులను, పెన్సిళ్లను పంపిణీ చేసి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మిత్ర బృందం నలుగురు సభ్యులు మాట్లాడుతూ విద్యార్థి దశ జీవితంలో అత్యంత కీలకమైనదని, ఈ దశలో ఏర్పడే క్రమశిక్షణ, పట్టుదల, లక్ష్యసాధనే భవిష్యత్ విజయాలకు పునాదులు అవుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెదులుతూ ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా వినాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు మరింత దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించి ఉన్నత విద్యను అభ్యసించాలని సూచించారు. తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావడంతో పాటు గ్రామానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులను జీవితంలో మర్చిపోవద్దని తెలిపారు. నేటి కాలంలో సెల్ఫోన్లు, టెలివిజన్ వంటి వినోద సాధనాలు విద్యార్థుల విలువైన సమయాన్ని వృథా చేస్తున్నాయని, వాటికి దూరంగా ఉంటూ చదువుపై పూర్తి దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. ప్రతి విద్యార్థి తన జీవిత లక్ష్యాన్ని స్పష్టంగా నిర్దేశించుకుని దానిని సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని చెప్పారు. గ్రామానికి చెందిన విద్యార్థులు భవిష్యత్తులో డాక్టర్లు, ఇంజనీర్లు, న్యాయవాదులు, ఉపాధ్యాయులు, పోలీసు అధికారులు, శాస్త్రవేత్తలు, పరిపాలనా అధికారులు వంటి ఉన్నత స్థానాలను అధిరోహించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. జ్ఞానం, ధైర్యం, త్యాగం అనే మూడు గొప్ప విలువలను జీవితంలో అలవర్చుకుని ముందుకు సాగితే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని పేర్కొన్నారు. అలాగే తల్లిదండ్రులు కూడా పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించి వారి విద్యాభివృద్ధిని ఎప్పటికప్పుడు సమీక్షిం చాలని, విద్యార్థులకు అనుకూ లమైన వాతావరణాన్ని కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సురేష్, ఉపాధ్యాయురాలు నిఖిత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సౌకర్యం లేని ప్రాంతానికి విద్యుత్ స్తంభాల ఏర్పాటు

**దమ్మపేట, జూన్ 18, :**

దమ్మపేట గ్రామపంచాయతీ పరిధిలో గల మల్లారం శివారులో సుమారు 80 కుటుంబాలు పైగా ఆరు సంవత్సరాలుగా కరెంట్ సదుపాయం లేకుండా నివాసం ఉంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇట్టి విషయాన్ని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ దృష్టికి దమ్మపేట కాంగ్రెస్ పార్టీ నాయకులు చిన్నశెట్టి యుగంధర్, చిట్టిబాబు పగడాల రాంబాబు, కక్కిరాల రమేష్ తదితర నాయకులు తెలియజేసి గత పది రోజుల క్రితం విద్యుత్ శాఖ ఏఈ సమక్షంలో అక్కడ నివాసం ఉంటున్న వాసులకు ప్రభుత్వం ఒక కిలోమీటర్ పరిధిలో గల నివాసల కు ఎలాంటి చార్జీలు లేకుండా కరెంట్ లైన్ సదుపాయం చేసే అవకాశం కల్పించిందని తెలియజేశారు. ఇచ్చిన హామీ మేరకు గురువారం 20కి పైగా కరెంటు స్తంభాలను ఆ నివాసల మధ్య పాతించారు. ఈ సందర్భంగా నాయకులు చిన్నశెట్టి యుగంధర్, పగడాల రాంబాబు మాట్లాడుతూ కరెంట్ లేని ప్రాంతాలకు విద్యుత్ సౌకర్యం కల్పించడానికి తమ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షించే విషయం అని, ఇప్పటికే తమ ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు ఇస్తున్న తరుణంలో, విద్యుత్ సౌకర్యం లేని దూర ప్రాంతాలకు కూడా కరెంటు లైన్లు చార్జీలు లేకుండా చేస్తున్న తీరు దేశంలో ఎక్కడ లేదు అన్నారు. చార్జీలు లేకుండా కిలోమీటర్ పరిధిలో గల ప్రాంతాలకు కరెంట్ లైన్ లాగి విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి క్యాబినెట్ కు



కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రూపా రాంబాబు, చిన్నశెట్టి గోపి, అప్పారావు, మళ్ళ చిన్నా, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మీయులతో బొగ్గుల సురేష్ ముదిరాజ్ జన్మదిన వేడుకలు



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి. జూన్ 18, :**

శ్రీ తిరుమల ఎంటర్ప్రైజెస్ మేనేజింగ్ పార్ట్నర్, జగద్గిరిగుట్ట డివిజన్ బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు, పద్మ డిజిటల్ స్టూడియో అధినేత బొగ్గుల సురేష్ ముదిరాజ్ జన్మదిన వేడుకలు ఆయన కుటుంబ సభ్యులు, తోటి పార్ట్నర్లు, సన్నిహితుల మధ్య తిరుమల ఎంటర్ప్రైజెస్ కార్యాలయంలో ఘనంగా జరుపుకు న్నారు. ఆయన సన్నిహితులు పుచ్చపండు కట్ చేయించి శాలువాతో సన్మానిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బొగ్గుల సురేష్ ముదిరాజ్ మాట్లాడుతూ తన జన్మదిన వేడుకలు ఇంతటి పండుగ వాతావరణం మధ్య జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ పార్ట్నర్లు డాక్టర్ బండారు శ్రీనివాస్, చెంచారపు భాస్కర్ రెడ్డి, కూరపాటి కరుణాకర్ రాజు, తేరాల శ్రీనివాస్ గుప్తా, రేగూరి ప్రవీణ్ గుప్తా, కూరపాటి శ్రీ రామరాజు, పబ్బోజు వీరాచారి, పాండాల శ్రీనివాస్ గౌడ్, అవుర్తి వీరేశప్ప, బింగి శ్రీనివాస్ గౌడ్, పోలేపల్లి శేషారెడ్డి, సరస్వతి నరేందర్ రాజు, జనుముల జగన్మోహన్ ముదిరాజ్, దొడ్ల ప్రసాద్ గౌడ్, హరిదాసు సంతోష్ రాజు లు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

# సమిష్టి కృషితోనే మాదకద్రవ్యాల నిర్మూలన సాధ్యం

- **జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**
- **ఐఎంఏ జగిత్యాల ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ 3కే రన్..**

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 18, :**

మాదకద్రవ్యాల వ్యసనం యువత భవిష్యత్తును, సమాజ శ్రేయస్సును తీవ్రంగా దెబ్బతీస్తున్న నేపథ్యంలో వాటి నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) జగిత్యాల శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 26న నిర్వహించనున్న "యాంటీ డ్రగ్స్ 3కే రన్" పోస్టర్ను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ యువతను మాదకద్రవ్యాల బారిన



పడకుండా కాపాడటం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన అనేది ఒక్క శాఖ లేదా సంస్థ బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని అన్ని వర్గాల సమిష్టి కృషితోనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని అన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన జాతీయ ప్రాధాన్యత కలిగిన అంశమని, ఈ దిశగా ఐఎంఏ జగిత్యాల చేపడుతున్న అవగాహన కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు, ముఖ్యంగా యువత పెద్ద సంఖ్యలో యాంటీ డ్రగ్స్ 3కే రన్లో పాల్గొని మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి తమ వంతు సహకారం అందించాలని కోరారు."లైవ్ స్ట్రాంగ్ – స్టే ఫ్రీ – సే నో టూ డ్రగ్స్ " అనే నినాదంతో నిర్వహించనున్న ఈ యాంటీ డ్రగ్స్ 3కే రన్ యువతలో ఆరోగ్యకర జీవనశైలిపై చైతన్యం కల్పించడంతో పాటు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై విస్తృత అవగాహన పెంపొందించనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ జగిత్యాల అధ్యక్షులు డా. గుడూరి హేమంత్, కార్యదర్శి డా. ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి డా. కోటగిరి సుధీర్ కుమార్, డా. గడ్డం వేణుగోపాల్ రెడ్డి, చింతా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# యూరియా యాప్‌ను రద్దు చేయాలి

**కుకునూరుపల్లి, జూన్ 18, :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూరియా యాప్' వల్ల చదువురాని సామాన్య రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆ యాప్‌ను వెంటనే రద్దు చేయాలని రైతుబంధు సమితి రాష్ట్ర మాజీ కోఆర్డినేటర్ దేవి రవీందర్ డిమాండ్ చేశారు. గురువారం కుకునూరుపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసినా విలేకరుల సమావేశంలో ఆయన మా ట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన నాటి నుంచి పంటల కొనుగోలు, రైతుబంధు జమ, కరెంట్, సాగునీటి సరఫరాలో విఫలమై రైతులను నష్టాల్లోకి నెట్టిందని విమర్శించారు. దుకాణాల్లో యూరియా ఉన్నప్పటికీ వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు అమ్ముతూ రైతులను దోచుకుంటున్నారని మండిపడ్డారు. గత చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ప్రస్తుత వానాకాలం సీజన్‌కు సరిపడా యూరియాను ముందే స్టాక్ ఉంచాలని పాస్‌బుక్ ఉన్న ప్రతి రైతుకూ ఇబ్బంది లేకుండా ఎరువులు అందించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. వారి వెంట సర్పంచ్ లు బురుగు మధు మోహన్, దబ్బేట భాస్కర్, బిఆర్ఎస్ నాయకుడు చిక్కుడు నర్సింలులు ఉన్నారు.



# కరీంనగర్ టీటీడీ ఆలయ నిర్మాణంపై టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుతో వెలిచాల రాజేందర్‌రావు సమావేశం

- **ఈ ఆలయం ఉత్తర తెలంగాణ భక్తులకు ఎంతో అనుకూలంగా ఉంటుంది..**
- **అత్యంత దేదీప్యమానంగా ఆలయాన్ని నిర్మించండి.**
- **ఇందుకు ప్రత్యేక చొరవ చూపండి..**
- **కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జ్ వెలిచాల రాజేందర్ రావు విజ్ఞప్తి..**

**ఉమ్మడి కరీంనగర్ బ్యూరో, జూన్ 18, :**

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఛైర్మన్ బీఆర్ నాయుడును కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్



వెలిచాల రాజేందర్‌రావు బుధవారం సాయంత్రం హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కరీంనగర్ టీటీడీ ఆలయ నిర్మాణం, అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. కరీంనగర్ నగరంలోని టీటీడీ ఆలయాన్ని భక్తులకు సౌకర్యవంతంగా నిర్మించేందుకు అవసరమైన అభివృద్ధి పనులు, మౌలిక వసతుల విస్తరణ, భక్తుల అవసరాలకు అనుగుణంగా నిర్మాణం, అదనపు సదుపాయాల కల్పన అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ఆలయ ప్రాంగణం అభివృద్ధి, పార్కింగ్ సదుపాయాల విస్తరణ, పరిశుభ్రత నిర్వహణ, తాగునీటి వసతి, భక్తులకు మెరుగైన దర్శన ఏర్పాట్లు చేపట్టాలని కోరారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ, ఆలయ పరిసరాల సుందరీకరణ వంటి అంశాలపై సానుకూలంగా చర్చ జరిగింది. కరీంనగర్ టీటీడీ ఆలయాన్ని ఉత్తర తెలంగాణ ప్రాంత భక్తులకు మరింత చేరువ చేసే విధంగా నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేయగా, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు సానుకూలంగా స్పందించినట్లు వెలిచాల రాజేందర్‌రావు తెలిపారు. ఆలయ నిర్మాణానికి టీటీడీ తరఫున ప్రత్యేక కృషి చొరవ చూపుతామని పేర్కొన్నారని చెప్పారు. భక్తులకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో టీటీడీ యాజమాన్యం, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. కరీంనగర్ టీటీడీ ఆలయం ఆధ్యాత్మికతకు ప్రధాన పాత్ర పోషిస్తుందనీ, భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిర్మాణం చేపట్టేలా నిరంతరం తమ వంతు కృషి చేస్తామని వెలిచాల రాజేందర్‌రావు స్పష్టం చేశారు. కరీంనగర్లో టీటీడీ ఆలయ నిర్మాణానికి.. అభివృద్ధికి సానుకూలంగా స్పందించిన బి.ఆర్ నాయుడుకి వెలిచాల రాజేంద్రరావు కృతజ్ఞతలు తెలిపారు.

# రాష్ట్ర కాంగ్రెస్ నాయకుల సమావేశంలో పాల్గొన్న మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూన్ 18, :**

కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు, కరీంనగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్ కూన శ్రీశైలం గౌడ్ హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణ హోటల్‌లో బుధవారం జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ నాయకుల సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరియు కరీంనగర్ జిల్లా మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో కార్యక్రమం గురించి మరియు ముందుకు వెళ్లాల్సిన అంశాల గురించి చర్చించారు. సమావేశం తర్వాత, కరీంనగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్ మరియు మాజీ శాసనసభ్యుడు కూన శ్రీశైలం గౌడ్ జన్మదినం సందర్భంగా, మంత్రులు మరియు స్థానిక ఎమ్మెల్యేలు శ్రీశైలం గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి కేక్ కటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, మేడిపల్లి సత్యం, విజయ రమణారావు, కవ్వంపల్లి సత్యనారాయణ, మక్కాన్సింగ్ రాజ్ ఠాగూర్, నియోజకవర్గ



ఇన్‌చార్జ్‌లు, ప్రణవ్, కే.కే.మహేందర్, జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగు లక్ష్యాలు తప్పనిసరిగా పూర్తి చేయాలి

• సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి




**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, జూన్ 18, :** జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తరణకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీఓసీ సమావేశ మందిరంలో ఉద్యానవన, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆయిల్ పామ్ ప్లాంటేషన్ ప్రోగ్రెస్-2026-27 సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. మెటీరియల్ కాంపోనెంట్‌కు సంబంధించిన ప్రక్రియలను త్వరగా పూర్తి చేసి క్షేత్రస్థాయిలో పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. ప్రతి వారం పురోగతిని సమీక్షిస్తూ నెలాఖరులోగా మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ భూముల క్లీనింగ్, పిట్ మార్కింగ్, పిట్టింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. ఆయిల్ పామ్‌తో పాటు పండ్లు, పూలు, కూరగాయల మొక్కల సాగుపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని సూచించారు. ఆర్గానిక్, సీజనల్ పండ్లు, ఆకు కూరల సాగు ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందే అవకాశాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. సహజ ఆహార ఉత్పత్తులను పెంచేందుకు అవసరమైన మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించాలని సూచించారు. ఆయిల్ పామ్‌తో పాటు ఇతర పంటలు సాగు చేస్తున్న ప్రతి రైతును ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు రైతులకు పూర్తిస్థాయిలో అందేలా సీఎస్‌ఈల సహకారంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. ఫార్మర్ రిజిస్ట్రీలో నిర్లక్ష్యం వల్ల రైతులు నష్టపోయినా లేదా అర్హతలేని వారికి లబ్ధి అందినా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రతి వ్యవసాయ క్షేత్రంలో ఫామ్ పాండ్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సీడ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న విత్తనాల నిల్వల వివరాలను ప్రజాప్రతినిధులకు కూడా అందుబాటులో ఉంచాలని సూచించారు. ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేసిన దూల్మిట్ట, ఆకారం, బక్రీచెప్యాల, నంగునూరు, చిట్టాపూర్ గ్రామాల అధికారులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, టీజీ ఆయిల్‌ఫెడ్ ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా సీనియర్ కాంగ్రెస్ నాయకులు దమ్మని శ్రవణ్ కుమార్ ముదిరాజ్ జన్మదిన వేడుకలు

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూన్ 18, :** కుత్బుల్లాపూర్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా డీసీసీ మాజీ ఉపాధ్యక్షులు దమ్మని శ్రవణ్ కుమార్ ముదిరాజ్ జన్మదిన వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి మరియు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొని దమ్మని శ్రవణ్ కుమార్ ముదిరాజ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నే రాజు, డీసీసీ ఉపాధ్యక్షులు బుయ్యని శివ కుమార్, డీసీసీ మహిళా అధ్యక్షురాలు ఆర్. లక్ష్మి , అవిజే జేమ్స్, సిద్దనోళ్ళ సంజీవరెడ్డి, లక్ష్మా రెడ్డి, రషీద్, మైసిగారి శ్రీనివాస్, ఆలేటి శ్రీనివాస్, సంతోష్ ముదిరాజ్, లాయక్, అజయ్, ప్రవీణ్ ముదిరాజ్, రంగన్న, మధుసూదన్ రెడ్డి మరియు ఇతర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఈ వేడుకల్లో పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు..



# లంచాలు అడిగే రెవెన్యూ అధికారులకు ఎంపీ మాస్ వార్నింగ్

**మిరుదొడ్డి, జూన్ 18, :** అధికారుల తీరుపై మెదక్ ఎంపీ రఘునందన్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు సేవలు అందించాల్సిన అధికారులు లంచాలు అడగడం సిగ్గుచేటు అన్నారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం మల్లుపల్లి గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ఎంపీ రఘునందన్ రావు శంకుస్థాపనలు చేశారు. గ్రామానికి చెందిన కొందరు తహసిల్దార్ కార్యాలయంలో అవినీతి రాజ్యమేలుతుందని వాపోయారు. వెంటనే రఘునందన్ రావు సిద్దిపేట ఆర్డీఓకి ఫోన్ చేసి అధికారుల లంచాల బాగోతాన్ని వివరించి చురకలంటించారు. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ల జాప్యం, పౌతీ చేయడానికి 50 వేల లంచం అడగటం ఏంటని ప్రశ్నించారు. అలాంటి అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లేదంటే తానే డబ్బులు అప్పజెప్పి ఏసీబీ అధికారులకు పట్టిస్తానని హెచ్చరించారు. గ్రామాల్లో నూతన సర్పంచులు గ్రామాభివృద్ధి కోసం సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేయడానికి ముందుకు వస్తే పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఇబ్బందులకు గురి చేయడం సరైంది కాదన్నారు. శిలాఫలకాలు మేము ఏర్పాటు చేస్తే ఎమ్మెల్యేకు ఉలికిపాటు ఎందుకన్నారు. గతంలో తాను దుబ్బాక ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తనకు ఇచ్చిన గౌరవమే, వారికి ఇప్పుడు తిరిగి ఇస్తున్నానని చురకలు అంటించారు. బీజేపీ సర్పంచులను ఇబ్బందులకు గురిచేయాలని చూస్తే సహించేది లేదని పంచాయతీరాజ్ శాఖ డిఈకి సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కనకరాజు, బీజేపీ నాయకులు బిక్షపతి, యాదగిరి, శ్రీనివాస్ గౌడ్, వెంకట్ గౌడ్ పలువురు పాల్గొన్నారు.



# కేటీఆర్ మీ అబద్ధాల మాటలు మా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో చెల్లవు

ఎర్రగొర్ల రాధాకృష్ణ



**దమ్మపేట, జూన్ 18, :** బడుగు బలహీన వర్గాల ప్రజల ఆశాజ్యోతి, అభివృద్ధి ప్రదాత, పేదల పెన్నిధి, పేద ప్రజల కష్టం తన సొంత కష్టం లా భావించే మా అభిమాన నాయకుడు మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పై అసత్య ప్రచారాలు, అబద్ధపు మాటలు విషపూరితమైన మాయ మాటలు మాట్లాడడం కేటీఆర్ నీ స్థాయికి సరికాదు, మా ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు మీ మాయ మాటలు నమ్మే స్థితిలో లేరు. అభివృద్ధి కోసం గత రెండున్నర సంవత్సరములగా మా నాయకుడు రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి జీర్ణించుకోలేక మీరు మాట్లాడుతున్నారు. గత పది సంవత్సరాల మీ ప్రభుత్వంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నది. దమ్ముంటే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పొంగులేటి శీనన్న కట్టించిన ఇందిరమ్మ ఇండ్లను సందర్శించి మాట్లాడు. నీ డ్రామాలు మా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో చెల్లవు ఖబర్దార్ ఖబర్దార్ కేటీఆర్, నీవు మాట్లాడే ముందు గురివింద సామెతను గుర్తు తెచ్చుకో, కళ్ళు లేని గుడ్డివాడిగా మాట్లాడకు అభివృద్ధిని చూసి మాట్లాడు జాగ్రత్త కేటీఆర్.

# గుడిసెలు లేని గ్రామాలే సర్కారు లక్ష్యం

ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి



**మానకొండూర్ ప్రతినిధి, జూన్ 18, :** పూరి గుడిసెలు లేని గ్రామాలుగా పంచాయతీలను తీర్చిదిద్దడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బుధవారం ఎల్ఎండీ కాలనీలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం(ప్రజాభవన్)లో తిమ్మాపూర్, మానకొండూర్, గన్నేరువరం మండలాలకు చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధాదారులకు మంజూరు పత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామాల్లో పూరి గుడిసెలు, శిథిలావస్థలో ఉన్న నివాసాలు లేకుండా పంచాయతీలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.అర్హులైన ప్రతి కుటుంబానికి పారదర్శకంగా ఇళ్ల మంజూరు జరుగుతోందని, లబ్ధిదారులు ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకొని నాణ్యమైన ఇళ్లను నిర్మించుకోవాలని సూచించారు. పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి వివక్షకు తావు లేదని, అందరినీ అక్కున చేర్చుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఇల్లు అనేది ప్రతి కుటుంబానికి భద్రత, ఆత్మవిశ్వాసం, సామాజిక గౌరవాన్ని కల్పిస్తుందని పేర్కొన్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం పేదల జీవితాల్లో వెలుగులు నింపేలా అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల్లో కొందరు ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం లేదని, ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేమని తప్పుకుంటే వాటిని అర్హులైన మిగితా వారికి మంజూరు చేస్తామన్నారు. ఈ మూడు మండలాల్లో మొదటి విడుతలో మంజూరై ఇళ్ల నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులను తొలగిస్తూ మిగితా అర్హులకు ఇప్పుడు ఇస్తున్నామని ఎమ్మెల్యే వివరించారు. త్వరలోనే రెండో విడుత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితా వెల్లడవుతుందని ఆయన చెప్పారు. ఇళ్లు రాలేదని ఎవరూ చింతించవద్దని, అర్హులైన వారందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని డాక్టర్ కవ్వంపల్లి చెప్పారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్, గన్నేరువరం, మానకొండూర్ ఎంపీడీవోలు మల్హోత్రా, శ్రీనివాస్ రెడ్డి, వీవీ వరలక్ష్మి , తిమ్మాపూర్ తహసీల్దార్ కర్ర శ్రీనివాస్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు బండారి రమేశ్, బొడ్డు సునిల్, మానకొండూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మ్రి ఓదెలు యాదవ్, పార్టీ నాయకులు మోరపల్లి రమణారెడ్డి, ముస్కు ఉపేందర్ రెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాసరావు, చింతల లక్ష్మారెడ్డి, గొట్టెముక్కుల సంపత్ రెడ్డి, ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, అల్లూరి శ్రీనాథ్ రెడ్డి, కొమ్మెర రవీందర్ రెడ్డి,మాతంగి అనిల్, బుర్ర తిరుపతి గౌడ్, పొన్నాల సంపత్, కె.ఎల్లారెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, పార్టీ గ్రామశాఖల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# సొంతింటి కళ నెరవేరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం





• దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి

**దుబ్బాక ప్రతినిధి, జూన్ 18, :** స్వంత ఇల్లు లేని కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం సొంత కళను నెరవేరుస్తుందని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గం ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. దుబ్బాక పట్టణ కేంద్రంలోని ధర్మాజీపేట 7,8,9, వార్డులలో గురువారం మూడు ఇందిరమ్మ ఇండ్లను ఆయన ప్రారంభించారు. దుబ్బాక పట్టణ కేంద్ర పరిధిలోని ధర్మాజీపేట 7వ వార్డు అనంతుల సుజాత స్వామి, 8 వ వార్డు దుబ్బాక పద్మ నారా గౌడ్, 9 వ వార్డు జనగామ కళావతి లక్ష్మణ్ ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశంలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ పూజ కార్యక్రమంలో చెరుకు శ్రీనివాస్ రెడ్డి పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. తమ సొంతింటి కళను నెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డికి, చెరుకు శ్రీనివాస్ రెడ్డికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో దుబ్బాక మున్సిపాలిటీ అధ్యక్షులు నర్మెట్ట యేసురెడ్డి, దుబ్బాక మార్కెట్ కమిటీ చైర్మన్ కొంగరి రవి, డైరెక్టర్లు, కౌన్సిలర్లు, దుబ్బాక నియోజకవర్గం ఆత్మ కమిటీ డైరెక్టర్ కర్ణంపల్లి రమేష్ గౌడ్, 9వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జనగామ విజయ్ కుమార్, తుపాకి స్వామి, శివరాజం గౌడ్, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు ముత్తి శశి కుమార్, నస్కంటి నర్సింలు, చిందకి స్వామి, బాబు, బాలరాజు, కర్ణంపల్లి స్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు..



# ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలి

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, జూన్ 18, :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వాటిపై ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నేతలపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పాల సాయిరాం, మోహన్ లాల్, ఎడ్ల సోమిరెడ్డి విమర్శించారు. సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలుపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. పదో తరగతి ఉత్తీర్ణులకు రూ.10 వేల, ఇంటర్ ఉత్తీర్ణులకు రూ.15 వేల, డిగ్రీ ఉత్తీర్ణులకు రూ.25 వేల ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఆ హామీలను అమలు చేయలేదని ఆరోపించారు. పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా సక్రమంగా అందడం లేదన్నారు.మాజీ మంత్రి హరీష్‌రావుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయ మర్యాదలకు విరుద్ధమని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం వ్యక్తిగత విమర్శలకు దిగడం బాధాకరమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ నేతలు అవినీతి ఆరోపణలు చేస్తుంటే, విద్యాశాఖలో జరిగినట్లు చెబుతున్న అవకతవకలపై ప్రశ్నలు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడిందన్నారు.



ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించాలని, రాజకీయ ప్రత్యర్థులపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మోహిజ్, నాగరాజు, సాయి ప్రేమ్, మహిపాల్ గౌడ్, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 18, :** ధర్మపురి మండలం తుమ్మెనాల గ్రామంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. వన మహోత్సవం ద్వారా పచ్చదనం పెంపొందించి, భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. అనంతరం నాటిన మొక్కలను పరిశీలించి, వాటి సంరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌ఓ రవి ప్రసాద్, డీఆర్‌డీఓ రఘువరన్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ దినేష్, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





## జగమెరిగిన మిమిక్రీ కళాకారుడు

# వేణుమాధవ్

### నేడు నేరెళ్ల వేణుమాధవ్ వర్ధంతి



భారత దేశంలో మిమిక్రీ కళకు ఆయన ఆద్యుడు. ఎంతో మంది ప్రముఖుల వందలాదిగా గొంతులను సునాయాసంగా, యథాతథంగా అనుకరించేవారు. భారత్‌లో అనుకరించి, నవ్వించే కళగా మాత్రమే ఉన్న మిమిక్రీని ఐక్య రాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో ప్రదర్శించే స్థాయికి తీసుకెళ్లిన గొప్ప కళాకారుడు. రాష్ట్రపతులు, ప్రధానుల నుండి సామాన్యుల వరకూ దేశంలో ఆయన అపూర్వ, అపురూప కళను అభినందించని వారుండ రంటే అతిశ-యోక్తి కాదు. ఇప్పుడు గుర్తు పట్టారనుకుంటా. ఆయనే వందలాది గొంతుకల వేణు మాధవుడు. ధ్వన్యనుకరణ సామ్రాట్ అనే బిరుదును పొందిన, తెలంగాణ గర్వించ దగ్గ ప్రపంచ ప్రఖ్యాత మిమిక్రీ కళాకారుడు నేరెళ్ళ వేణుమాధవ్ ( డిసెంబరు 28, 1932 – జూన్ 19, 2018 ) చిన్నప్పుడు ఉర్దూ మాధ్యమంలో చదువుకున్నారు. అయినా ఆయన అమెరికా, బ్రిటన్ ఇంగ్లిష్ ఉచ్చారణలతో కూడా గొప్ప ప్రదర్శనలు ఇచ్చారు. ఆయన సొంతంగా ఈ కళను సాధన చేశారు. స్వీయ పరిశీలన, స్వయం అధ్యయనంతో తనను తాను మెరుగు పరచు కుంటూ అత్యున్నత స్థాయిని అందుకున్న ప్రతిభాశాలి. చిన్నతనంలో  చిలకమర్తి లక్ష్మీ నరసింహం రాసిన ప్రహసనాల్లో నటించి తన ప్రతిభను చాటుకున్నా అప్పటి ప్రముఖ నటులు చిత్తూరు నాగయ్య, వేమూరు గగ్గయ్య, మాధవపెద్ది వెంకట్రామయ్య తదితరుల సినిమాల ప్రభావంతో మిమిక్రీ కళపై మొగ్గు చూపారు. 1947 నుంచి ఈయన మిమిక్రీ ప్రదర్శనలు ఇవ్వడం ప్రారంభించారు. తెలుగు లోనే కాక ఇతర భాషల్లో కూడా ప్రదర్శనలు ఇచ్చారు. ఐక్యరాజ్య సమితిలో కూడా ప్రదర్శన ఇచ్చారు. 1953 లో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించారు. కేంద్ర ప్రభుత్వం ఆయనకు పద్మశ్రీ పు-రస్కారాన్నిచ్చి గౌరవించింది..కవిసామ్రాట్ విశ్వనాథ సత్య నారాయణ, జ్ఞాన పీఠ అవార్డు గ్రహీత సినారె మొదలైన ప్రముఖులు తమ రచనలను ఆయనకు అంకిత మివ్వడం ఆయన గొప్ప తనాన్ని స్పష్టం చేస్తుంది. ఆంధ్ర విశ్వ విద్యాలయం నుంచి కళా ప్రపూర్ణ, జె. ఎన్. టి. యు, కాకతీయ విశ్వ విద్యాలయాల నుంచి గౌరవ డాక్టరేట్లు అందుకున్నారు. తిరుపతిలో ఆయనకు గజారోహణం, పౌర సన్మానం జరిగాయి. ఆయన స్వయంగా నేరెళ్ళ వేణుమాధవ్ సాంస్కృతిక సంస్థను స్థాపించి ప్రతి యేటా ఒక కళాకారుడిని సన్మానించారు. హనుమ కొండలో ఆయన పేరు మీదుగా డా. నేరెళ్ళ వేణుమాధవ్ కళా ప్రాంగణం నిర్మించారు.

నేరెళ్ళ వేణుమాధవ్ వరంగల్ పట్టణం లోని మట్టెవాడలో శ్రీహరి, శ్రీలక్ష్మి దంపతులకు 1932 డిసెంబరు 28న జన్మించారు. పండితుడైన తండ్రి,  వరంగల్ పట్టణానికి వచ్చే ప్రముఖులందరికీ తన ఇంట్లోనే ఆతిథ్యం ఇస్తుండగా,  అలా వచ్చిన వారిలో చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి, వావిలికొలను సుబ్బారావు, వడ్డాది సుబ్బా రాయుడు, రాయప్రోలు సుబ్బారావు, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి, కాశీ కృష్ణాచార్యులు, యర్రమిల్లి జగ్గన్న శాస్త్రి వంటి గొప్పవారి సాహితీ గోష్ఠుల ప్రభావం వేణుమాధవ్ మీద పడింది. సినిమాలంటే ఎంతో ఇష్టం. చిత్తూరు నాగయ్య నటించిన గృహలక్ష్మి, వందేమాతరం, దేవత, స్వర్గసీమ, పోతన, వేమన సినిమాలు చూసి, నాగయ్య కూడా ధ్వన్యనుకరణ చేయగలవారు కావడంతో ఆయన పై అభిమానంతో కేవలం స్వయం పరిశీలనతోనే ఆ రంగంలో ప్రవేశించారు. అలాగే వేమూరి గగ్గయ్య, మాధవపెద్ది వెంకట్రామయ్య నటించిన సినిమాలు చూసి, ఇంటికి రాగానే ఆ సినిమాల్లోని పాటలను, పద్యాలను యథాతథంగా  అనుకరించి చూపేవారు. అలా మొదలయ్యింది అయన మిమిక్రీ ప్రస్థానం.


1950 లో మెట్రిక్యులేషన్, 1952 లో వరంగల్ ఆర్ట్స్ అండ్ సైన్సు కాలేజీలో చేరారు. నాటి ప్రిన్సిపాల్ బారు వెంకట రామనర్సు, ఇతర  లెక్చరర్లు వారించినా వినకుండా, గుడ్ కాండక్టు కింద వేణుమాధవ్ కు ఆ రోజుల్లో అరవై రూపాయల స్కాలర్ షిప్ ( బర్సరీ ) మంజూరు చేశారు. ఆ డబ్బుతో పలు ఇంగ్లీషు సినిమాల్ని చూసి వాటిల్లోని ఆర్టిస్టుల గొంతులు, ముఖ్యమైన సన్నివేశాలు బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ నోట్స్ తో సహా వినిపిస్తే, రామనర్సు  పరమానంద భరితులై "యూ విల్ బికం ఎ గ్రేట్ ఆర్టిస్ట్ ఇన్ ద వరల్డ్" అని, అయితే నీవు నా రెండవ కుమారుడవు అని మనసారా ఆశీర్వదించారు. ఆ దీవెనలే ఆయనను 'విశ్వ విఖ్యాత ధ్వన్యనుకరణ సామ్రాట్' గా ఎదిగేలా చేసాయి. 1953 లో ప్రభుత్వ పాఠశాల (జి సి ఎస్ స్కూలు హనుమకొండ) లో ఉపాధ్యాయులుగా ప్రవేశించి, ధర్మ సాగరం, హనుమకొండ లోని ప్రాక్టీసింగ్ స్కూలు, మట్వాడ ఉన్నత పాఠశాల, జనగామ, శంభునిపేట పాఠశాలల్లో పని చేశారు. అనంతర కాలంలో ప్రైవేటుగా బీ.ఏ. బీ. కాం పాసయ్యారు. తొలి ప్రదర్శన 1947 లో ఇచ్చారు. మలి ప్రదర్శన 1953 లో రాజమండ్రిలో జరిగిన థియేటర్స్ ఫెడరేషన్ కాన్ఫరెన్స్ లో బలరాజ సహానీ అధ్యక్షతన, గరికపాటి రాజారావు, దాడి గోవింద రాజులు, స్థానం నరసింహారావు, చాగంటి సన్యాసి రాజు తదితర ప్రముఖుల సమక్షంలో ఇచ్చారు.  ఆయన ప్రదర్శనలు చూసిన పలువురు రాజకీయ ప్రముఖుల్లో దివంగత రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్, దివంగత ప్రధానులు ఇందిరా గాంధీ, పీవీ నరసింహారావు లాంటి ఎంతోమంది ఉన్నారు.

ధ్వన్యనుకరణ సామ్రాట్, మిమిక్రీ సామ్రాట్, చుపే రుస్తుం ధ్వన్యను కరణ చక్రవర్తి, కళా సరస్వతి, స్వర్ కే రాజా, ధ్వన్యను కరణ ప్రవీణ, ధ్వన్యను కరణ కళానిధి, మిమిక్రీ రత్న, విశ్వ విఖ్యాత ధ్వన్యను కరణ సార్వభౌమ, మున్నగు బిరుదులు వరించాయి. 1977 ఆంధ్రా విశ్వ విద్యాలయం నుండి కళా ప్రపూర్ణ  బిరుదు, 1982 రాజాలక్ష్మి ఫౌండేషన్ అవార్డు, 1987 జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజీ విశ్వ విద్యాలయం, 1992 కాకతీయ విశ్వ విద్యాలయం నుండి గౌరవ డాక్టరేటు...1997 కనకాభిషేకం, 1998 ఎన్టీఆర్ ఆత్మ గౌరవ పురస్కారం, 2001 పద్మశ్రీ, 2005 తెలుగు విశ్వ విద్యాలయం నుండి సాంస్కృతిక రంగంలో విశిష్ట పురస్కారం, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ పురస్కారాలు – 2018లో భాగంగా జూన్ 2న తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా పురస్కారం అందజేయ బడింది. తిరుపతి పట్టణంలో గజారోహణం, పౌర సన్మానం జరిగాయి. పద్మశ్రీ నేరెళ్ల వేణుమాధవ్ 2018, జూన్ 19వ తేదీ తమ 85వ యేట కన్నుమూశారు. హనుమకొండ పట్టణంలో నిర్మింపబడ్డ 'డా.నేరెళ్ళ వేణుమాధవ్ గారి కళాప్రాంగణం ' సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలకు చక్కని వేదికగా ఉపయోగ పడుతున్నది. నేరెళ్ళ వేణుమాధవ్ కల్చరల్ ట్రస్ట్' ను స్థాపించి ప్రతియేటా తన పుట్టిన రోజైన డిసెంబర్ 28న ప్రముఖ కళాకారులను పదివేల రూపాయల పురస్కారంతో సత్కరిస్తున్నారు.  2017లో నేరెళ్ల వేణుమాధవ్ పేరుతో పోస్టల్ శాఖ ప్రత్యేక కవర్‌ను విడుదల చేసింది. ఆయన పుట్టిన రోజైన డిసెంబర్ 28వ తేదీని తెలుగు రాష్ట్రాల్లో 'మిమిక్రీ డే'గా జరుపు కుంటారు

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

## భాషాశాస్త్ర విజ్ఞానానికి దిక్సూచి..

# భద్రిరాజు కృష్ణమూర్తి



### నేడు భద్రిరాజు కృష్ణమూర్తి జయంతి

భద్రిరాజు కృష్ణమూర్తి – తెలుగు భాషాశాస్త్ర రంగంలో వెలుగొందిన ప్రఖ్యాత పండితుడు. ద్రావిడ భాషల తులనాత్మక అధ్యయనం, శబ్ద నిర్మాణ విశ్లేషణ, వ్యాకరణ రూప పరిణామం వంటి విభాగాలలో ఆయన సాధించిన శాస్త్రీయ పరిశోధనలు భారత భాషాశాస్త్ర పరిణామాన్ని విశ్వవేదికలపై ప్రతిష్ఠాపించాయి. భాషలను కేవలం వాడుకకే పరిమితం కాక, వాటి మూలాలకు, నిర్మాణాలకు అర్థం తెలిపేలా చేసిన పరిశోధనల్లో ఆయన పాత్ర అపూర్వమైనది. ఆంధ్రప్రదేశ్ తూర్పుగోదావరి జిల్లాలోని వెలుగుబంద గ్రామంలో 1928 జూన్ 19న జన్మించిన భద్రిరాజు చిన్ననాటి నుంచే బుద్ధిమంతుడిగా గుర్తింపునందుకున్నారు. పిఠాపురం వయోజన విద్యాసంస్థల ద్వారా ప్రాథమిక విద్యనభ్యసించిన ఆయన, అనంతరం బెనారస్ హిందూ విశ్వ విద్యాలయంలో సంస్కృతంలో ఎం.ఎ. పూర్తి చేశారు. ఆ తర్వాత అమెరికాలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం, బర్కిలీ నుండి భాషాశ-ాస్త్రంలో పి.హెచ్.డి. పొందారు. అక్కడ ఆయన చార్లెస్ హాకెట్, ముర్రే ఎమెన్యూ వంటి భాషా శాస్త్రవేత్తల శిక్షణలో శాస్త్రీయ దృక్పథాన్ని సంపాదించారు. ఆయన విద్యా, పరిశోధనా ప్రస్థానం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు, ద్రావిడ భాషాశాస్త్ర విభాగానికి ప్రొఫెసర్‌గా కొనసాగింది. 1962 నుండి 1988 వరకు ఆయన ఆచార్య పదవిలో ఉన్నారు. ఈ కాలంలో తెలుగు భాషాశాస్త్ర అధ్యయనానికి కొత్త వెలుగు చూపించి, పరిశోధనలకు మార్గనిర్దేశం చేశారు. భాషను శాస్త్రీయంగా అధ్యయనం చేయాలన్న దృక్పథాన్ని ఆయన విద్యార్థులకు నాటించారు. ఆయన శిష్యులలో ఎందరో నేటికీ వివిధ విశ్వవిద్యాలయాలలో ప్రఖ్యాతులుగా ఉన్నారు. 1961లో ప్రచురితమైన "ఎవశ్రీబస్త్రబ ఎవతీఘ్రశ్రీ ధీుంవం" అనే గ్రంథం ఆయనకు అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చిపెట్టింది. తెలుగు క్రియారూపాల తులనాత్మక అధ్యయనం, ద్రావిడ మూలాల అన్వేషణ ఈ గ్రంథంలో శాస్త్రీయంగా విశ్లేషించబడింది. తరువాత కాలంలో వచ్చిన "Comparative Dravidian Linguistics: Current Perspectives□□, »»The Dravidian Languages□□, »»A Grammar of Modern Telugu" వంటి గ్రంథాలు ద్రావిడ భాషాశాస్త్ర విభాగంలో ప్రామాణిక గ్రంథాలుగా నిలిచాయి. భద్రిరాజు కృష్ణమూర్తి పరిశోధనలు భాష శాస్త్రపు వివిధ విభాగాలకు వ్యాపించాయి – వ్యాకరణ శాస్త్రం, శబ్ద నిర్మాణం, భాషా పరిణామ క్రమం, మాండలిక అధ్యయనం, శాసనాల్లోని భాషాపరమైన అంశాల విశ్లేషణ మొదలైన అంశాలలో ఆయన సుదీర్ఘంగా కృషి చేశారు. భాషను కేవలం వ్యాకరణ పరిమితుల్లో కాక, సంస్కృతి, చరిత్ర, సమాజంతో ముడిపెట్టి అధ్యయనం చేసిన ఆయన దృక్పథం ఎంతో విశాలమైనది.

కేంద్ర భాషా సంస్థకు తొలి డైరెక్టర్‌గా పనిచేసిన ఆయన, భారత భాషల అధ్యయనానికి సాంకేతిక, శాస్త్రీయ దిశల్ని సూచించారు. భారత ప్రభుత్వ భాషా కమిషన్, సాహిత్య అకాడమీ, యునెస్కో భాషా ప్రాజెక్టుల్లో సలహాదారుడిగా కీలకంగా పని చేశారు. అంతర్జాతీయ విశ్వ విద్యాలయాల్లో అతిథి అధ్యాపకుడిగా సేవలందించారు. ఆయనకు లభించిన పురస్కారాలు ఆయన గొప్పతనానికి నిదర్శనంగా నిలిచాయి. కేంద్ర సాహిత్య అకాడమీ పు-రస్కారం (1993), పద్మభూషణ్ (2000), భాషా గౌరవ పురస్కారాలతో పాటు అనేక విశ్వ విద్యాలయాల నుండి గౌరవ డాక్టరేట్లు పొందారు. 2012 ఫిబ్రవరి 1న భద్రిరాజు కృష్ణమూర్తి గారు మృతి చెందినా, ఆయన చేసిన కృషి శాశ్వతంగా భాషా ప్రపంచంలో నిలిచిపోతుంది. ఆయన జీవితం భాషాపరంగా పరిశోధన చేయాలనుకునే ప్రతిభావంతుల కోసం మార్గదర్శక దీపంలా నిలుస్తుంది. భద్రిరాజు కృష్ణమూర్తి గారి పేరే భారత భాషాశాస్త్ర వికాసానికి ప్రతీకగా నిలిచి ఉంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# మారుతున్న వాతావరణం - మారాల్సిన వ్యవసాయం

## రుతుపవనాల జూదం

### ఎల్‌నినో నీడలో దేశీయ వ్యవసాయం



భారతదేశ ఆర్థిక వ్యవస్థకు, కోట్ల మంది ప్రజల జీవనాధారానికి వ్యవసాయ రంగమే వెన్నెముక అనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే, దేశీయ వ్యవసాయం ఇప్పటికీ ప్రధానంగా రుతుపవనాల జూదంగానే సాగుతోంది. దేశం మొత్తం మీద ఏడాది పొడవునా కురిసే వార్షిక వర్షపాతంలో దాదాపు 75 శాతం వర్షపాతం జూన్ నుండి సెప్టెంబర్ వరకు విస్తరించే నైరుతి రుతుపవనాల ద్వారానే లభిస్తుంది. అందువల్లనే, భారతీయ రైతాంగానికి అత్యంత కీలకమైన ఖరీఫ్ పంటల విజయాపజయాలు పూర్తిగా ఈ వర్షాల పంపిణీపైనే ఆధారపడి ఉంటాయి. ఇటీవలి కాలంలో ప్రపంచవ్యాప్తంగా సంభవిస్తున్న వాతావరణ మార్పులు, భూతాపం ప్రభావాలు మరియు పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడే 'ఎల్‌నినో' వంటి తీవ్ర సముద్ర వాతావరణ పరిస్థితులు రుతుపవనాల గమనాన్ని తీవ్రంగా గందరగోళానికి గురిచేస్తున్నాయి. దీని ఫలితంగా ఒకే ఏడాదిలో కొన్ని ప్రాంతాల్లో అతివృష్టి, మరికొన్ని ప్రాంతాల్లో అనావృష్టి ఏర్పడి వర్షపాత పంపిణీలో తీవ్రమైన ప్రాంతీయ అసమతుల్యత చోటు చేసుకుంటోంది. ఈ విపత్కర పరిస్థితుల్లో కాలం చెల్లిన సంప్రదాయ సాగు విధానాలను పక్కనబెట్టి, మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపికలోనూ, సాగు నిర్వహణలోనూ విప్లవాత్మక మార్పులు తీసుకురావలసిన చారిత్రక అవసరం నేడు రైతాంగంపై ఉంది.

### ఏమిటీ ఎల్‌నినో దృగ్విషయం?

శాస్త్రీయ కోణంలో పరిశీలిస్తే, ఎల్‌నినో అనేది దక్షిణ పసిఫిక్ మహాసముద్రంలోని భూమధ్యరేఖ ప్రాంతంలో సముద్ర ఉపరితల జలాలు అసాధారణంగా వేడెక్కడాన్ని సూచించే ఒక సంక్లిష్ట వాతావరణ ప్రక్రియ. స్పానిష్ భాషలో 'చిన్న బాలుడు' లేదా 'ఏసుక్రీస్తు శిశువు' అని పిలవబడే ఈ దృగ్విషయం, ప్రపంచవ్యాప్త వాతావరణ నమూనాలను తలకిందులు చేసే శక్తిని కలిగి ఉంది. పసిఫిక్ సముద్రంలో పెరిగే ఈ ఉష్ణోగ్రతల ప్రభావం వల్ల వాతావరణ పీడన వ్యవస్థల్లో మార్పులు వచ్చి, భారతదేశానికి వర్షాలను మోసుకొచ్చే రుతుపవన గాలులు బలహీనపడతాయి. భారత వాతావరణ శాఖ గత వందేళ్ల చారిత్రక గణాంకాలను పరిశీలిస్తే, దేశంలో నమోదైన భయంకరమైన కరవు సంవత్సరాలలో అత్యధిక భాగం ఎల్‌నినో ప్రభావంతో కూడుకున్నవేనని స్పష్టమవుతోంది. ఉదాహరణకు, 2002వ సంవత్సరంలో ఎల్‌నినో కారణంగా దేశంలో 19 శాతం వర్షపాత లోటు ఏర్పడి అపార పంట నష్టం సంభవించింది. అలాగే 2009లో గత నాలుగు దశాబ్దాలలోనే అత్యంత తీవ్రమైన కరవు నమోదైంది. ఆ తర్వాత 2015 మరియు ఇటీవలి 2023 సంవత్సరాలలో సైతం ఎల్‌నినో దేశవ్యాప్త వర్ష-పాతంలో భారీ లోటును మిగిల్చింది, తద్వారా జలాశయాలలో నీటి ఎద్దడి పడిపోయి, భూగర్భ జలాధారాలు అడుగంటి వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది.

### తొందరపడి విత్తొద్దు..

సాధారణంగా ఖరీఫ్ సీజన్ జూన్ మొదటి వారంలోనే ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ, ఎల్‌నినో సంవత్సరాల్లో వర్షాలు వారాల తరబడి ఆలస్యమవడం లేదా ప్రారంభంలో కురిసి ఆ తర్వాత సుదీర్ఘ పొడి వాతావరణం ఏర్పడటం సర్వసాధారణం. జూన్, జూలై నెలల్లో కురిసే తొలి వర్షాలను నమ్మి రైతులు తొందరపడి విత్తనాలు చల్లితే, ఆ తర్వాత వర్షాలు ముఖం చాటేయడంతో నేలలోనే విత్తనాలు మాడిపోయి మొలకెత్తని పరిస్థితి ఏర్పడుతుంది. ఇది రైతులకు పెట్టుబడి నష్టాన్ని మిగల్చడమే కాకుండా, మళ్లీ విత్తవలసిన దుస్థితికి దారితీస్తుంది. ఇటువంటి అనిశ్చిత సమయాల్లో వ్యవసాయ శాస్త్రవేత్తల ప్రాథమిక సూచన ఏమిటంటే, రైతులు తొందరపాటు పడకుండా తమ ప్రాంతంలో కనీసం 75 నుండి 100 మిల్లీమీటర్ల వరకు స్థిరమైన మరియు తగినంత వర్షపాతం నమోదై, భూమి లోపలి పొరల వరకు తేమ చేరినట్లు నిర్ధారించుకున్న తర్వాతే ప్రధాన పంటల విత్తన ప్రక్రియను ప్రారంభించాలి. ఒకవేళ కాలం గడుస్తున్నా వర్షాలు పడకపోతే, సుదీర్ఘ కాల పరిమితి గల పంటల లికి వెళ్లకుండా, తక్కువ రోజుల్లోనే చేతికి వచ్చే స్వల్పకాలిక రకాలను ఎంచుకోవడమే బుద్ధిమంతం. ఇందుకోసం ఆయా రాష్ట్రాల వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ శాఖలు రూపొందించే 'ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలను' నిరంతరం గమనిస్తూ అమలు చేయాలి.

### ఆలస్యమైతే వ్యూహం మార్చాలి..

సాధారణ వాతావరణ పరిస్థితుల్లో జూన్ మాసంలో పత్తి, మొక్కజొన్న, సోయాబీన్, వేరుశెనగ, వరి వంటి సాంప్రదాయ ఖరీఫ్ పంటల సాగు జోరందుకుంటుంది. అయితే వర్షాలు జూలై మొదటి వారం వరకు ఆలస్యమైతే, రైతులు తమ వ్యూహాన్ని మార్చుకోవాలి. ఎక్కువ నీరు, ఎక్కువ కాలం తీసుకునే రకాలకు బదులుగా స్వల్పకాలిక మొక్కజొన్న రకాలు, పెసర, మినుము, కంది వంటి పప్పుధాన్యాలు లేదా నువ్వులు వంటి నూనెగింజల పంటల వైపు మళ్లడం ఎంతో శ్రేయస్కరం. ఒకవేళ వర్షాభావం మరింత తీవ్రమై జూలై రెండో పక్షం లేదా ఆగస్టు వరకు కూడా తగినంత వర్షపాతం లేకపోతే, అసలు సంప్రదాయ పంటల ఆలోచనే పక్కనబెట్టి జొన్నలు, సజ్జలు, రాగులు, కొర్రలు వంటి చిరుధాన్యాల (మిల్లెట్స్) సాగుకు శ్రీకారం చుట్టాలి. ఈ తృణధాన్యాలు అత్యంత తక్కువ నీటి లభ్యతతో, కరవు పరిస్థితులను సైతం తట్టుకుని అద్భుతంగా పెరుగుతాయి. పైగా ప్రస్తుత కాలంలో ప్రజల్లో ఆరోగ్య స్పృహ పెరగడం వల్ల మార్కెట్‌లో ఈ చిరుధాన్యాలకు మరియు పప్పుధాన్యాలకు అత్యధిక డిమాండ్, మద్దతు ధర లభిస్తుండటం రైతులకు అదనపు ఆర్థిక రక్షణ కల్పిస్తుంది.

### తెలుగు రాష్ట్రాల్లో పత్తి, వరి సాగుపై ప్రభావం..

తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఖరీఫ్ సీజన్ అనగానే అత్యధిక విస్తీర్ణంలో పత్తి సాగు చేయడం కనిపిస్తుంది. పత్తి లాభదాయక పంట అయినప్పటికీ, దానికి ప్రారంభ దశలోనూ, పూత, కాత దశల్లోనూ సమతుల్యమైన తేమ అవసరం. ఎల్‌నినో సృష్టించే వర్షాభావ పరిస్థితుల్లో పత్తి మొక్కల పెరుగుదల క్షీణించి, దిగుబడులు దారుణంగా పడిపోతాయి. కాబట్టి, వాతావరణం అనుకూలించనప్పుడు పత్తి సాగు విస్తీర్ణాన్ని ఐచ్ఛికంగా తగ్గించుకుని, దానికి ప్రత్యామ్నాయంగా అంతర పంటల పద్ధతిలో కంది, పెసర, మినుము వంటి లెగ్యుమినేస్ (నత్రజనిని స్థిరపరిచే) పంటలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా భూసారాన్ని కాపాడుకోవడమే కాకుండా, ఒక పంట దెబ్బతిన్నా మరో పంట ద్వారా పెట్టుబడిని రాబట్టుకునే వీలుంటుంది.

### సాంకేతికతను జోడించాలి..

ఆధునిక యుగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయానికి జోడించడం అత్యంత ఆవశ్యకమైన అంశం. భారత వాతావరణ శాఖ, రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, కృషి విజ్ఞాన కేంద్రాలు ఉపగ్రహ సమాచారం ఆధారంగా నిరంతరం అందిస్తున్న జిల్లా మరియు మండల స్థాయి స్వల్పకాలిక, మధ్యకాలిక వాతావరణ సూచనలను రైతులు గమనిస్తూ ఉండాలి. మొబైల్ యాప్‌ల ద్వారా అందుతున్న ఐదు రోజుల ముందస్తు వాతావరణ అంచనాల ఆధారంగా విత్తడం, ఎరువులు వేయడం, పురుగుమందుల పిచికారీ వంటి సాగు పనులను ప్రణాళిక చేసుకోవడం ద్వారా అనవసరపు ఖర్చులను, వాతావరణ నష్టాలను అధిగమించవచ్చు.

ఇన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ ప్రకృతి వైపరీత్యాల తీవ్రత వల్ల పంట నష్టం సంభవిస్తే రైతులు ఆర్థికంగా చితికిపోకుండా ఉండేందుకు 'వ్యవసాయ బీమా పథకాలు' ఒక అద్భుతమైన రక్షణ కవచంలా పనిచేస్తాయి. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన వంటి ప్రభుత్వ పంట బీమా పథకాలలో అర్హులైన రైతులందరూ గడువులోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలి. వ్యక్తిగత సాగు వ్యయాలను తగ్గించుకోవడానికి, చిన్న మరియు సన్నకారు రైతులు గ్రూపులుగా ఏర్పడి 'రైతు ఉత్పత్తిదారుల సంఘాలు' లేదా సహకార సంఘాల ద్వారా ఉమ్మడిగా విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయడం మరియు యంత్రాలను అద్దెకు తీసుకోవడం ద్వారా పెట్టుబడి ఖర్చులను తగ్గించుకోవచ్చు. అలాగే దళారీల వ్యవస్థను దాటి ఉమ్మడి మార్కెటింగ్ సదుపాయాల ద్వారా తమ ఉత్పత్తులకు లాభదాయకమైన ధరలను సాధించుకోవచ్చు.

ఎల్‌నినో సృష్టిస్తున్న వాతావరణ మార్పులు కేవలం తాత్కాలిక సమస్య కాదు, ఇది గ్లోబల్ వార్మింగ్ సృష్టిస్తున్న దీర్ఘకాలిక సవాలు. భవిష్యత్తులో ఈ అనిశ్చితి మరింత తీవ్రరూపం దాల్చుతుందని అంతర్జాతీయ పర్యావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. కాబట్టి, రైతాంగం పాతకాలపు మూస పద్ధతులకే పరిమితం కాకుండా, ఆధునిక శాస్త్రీయ సాగు విధానాలను, జల సంరక్షణ సూత్రాలను, వాతావరణ ఆధారిత వ్యవసాయ ప్రణాళికలను మరియు పంటల వైవిధ్యీకరణను తమ జీవితంలో భాగం చేసుకోవాలి. విపత్తును సైతం ఒక అవకాశంగా మలచుకుని, సరైన సమయంలో సరైన నిర్ణయ తీసుకునే చాకచక్యం ప్రదర్శించినప్పుడే స్థిరమైన ప్రగతి సాధ్యమవుతుంది. దేశ రక్షణలో సైనికుడు ఎంత కీలకమో, దేశ ఆహార భద్రతలో అన్నదాత పాత్ర అంతకంటే మిన్న. కాబట్టి, రైతుల అప్రమత్తత, శాస్త్రీయ అవగాహనలతో పాటు ప్రభుత్వాల సకాల సాయం, రాయితీలు, మౌలిక వసతుల కల్పన తోడైతే, ఎల్‌నినో వంటి ఎన్ని ఎల్‌నినోలు ఎదురైనా ఖరీఫ్ సీజన్‌లో రైతాంగం విజయకేతనం ఎగురవేసి, దేశాన్ని సుభిక్షంగా ఉంచగలదనడంలో ఎటువంటి సందేహం లేదు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



# స్థిరంగా బంగారం

**హైదరాబాద్, జూన్ 18 :** దేశీయ బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో పెద్దగా హెచ్చుతగ్గులు లేకపోవడంతో దేశవ్యాప్తంగా పసిడి ధరల్లో గణనీయమైన మార్పులు కనిపించలేదు. జూన్ 18 ఉదయం నాటికి హైదరాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,51,100గా నమోదైంది. 22 క్యారెట్ల పది గ్రాముల పసిడి ధర రూ.1,38,500 వద్ద కొనసాగుతుండగా, 18 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,13,320గా ఉంది. తెలంగాణలోని వరంగల్, నిజామాబాద్, ఖమ్మం నగరాల్లో కూడా హైదరాబాద్‌కు సమానంగానే ధరలు నమోదయ్యాయి. 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,51,100, 22 క్యారెట్ల ధర రూ.1,38,500, 18 క్యారెట్ల ధర రూ.1,13,320గా కొనసాగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, కాకినాడ, తిరుపతి నగరాల్లో కూడా ఇదే ధరలు కొనసాగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పసిడి ధరల్లో ఎలాంటి మార్పు లేకపోవడం కొనుగోలుదారులకు కొంత ఊరటనిస్తోంది. దేశంలోని ప్రధాన నగరాల్లో పరిశీలిస్తే చెన్నైలో బంగారం ధరలు ఇతర నగరాలతో పోలిస్తే కొంత ఎక్కువగా నమోదయ్యాయి. అక్కడ 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,53,380 కాగా, 22 క్యారెట్ల ధర రూ.1,40,600గా ఉంది. ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,51,250, 22 క్యారెట్ల ధర రూ.1,38,650గా నమోదైంది. ముంబై, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,51,100గా ఉండగా, 22 క్యారెట్ల ధర రూ.1,38,500గా కొనసాగుతోంది. జైపూర్‌లో 24 క్యారెట్ల ధర రూ.1,51,250 కాగా, పట్నా, వడోదరా నగరాల్లో రూ.1,51,150గా నమోదైంది. మరోవైపు వెండి ధరల్లో కూడా పెద్దగా మార్పులు కనిపించలేదని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల దిశ, అమెరికా వడ్డీ రేట్ల నిర్ణయాలు, డాలర్ మారకం విలువ ఆధారంగా రాబోయే రోజుల్లో బంగారం ధరల్లో హెచ్చుతగ్గులు చోటుచేసుకునే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ ముగియడంతో కొనుగోళ్లు కొంత మందగించినప్పటికీ, పెట్టుబడి కోసం బంగారం కొనుగోలు చేసే వారి ఆసక్తి కొనసాగుతోంది.

# ఐఫోన్ ధరల పెంపుపై సంకేతాలు

**హైదరాబాద్, జూన్ 18 :** ప్రపంచ ప్రముఖ స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థ యాపిల్ వినియోగదారులకు త్వరలో ధరల షాక్ ఇవ్వనున్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి. సంస్థ ప్రధాన కార్యనిర్వాహక అధికారి టిమ్ కుక్ ఐఫోన్ ధరలను పెంచాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చని వ్యాఖ్యానించినట్లు సమాచారం. రాబోయే నెలల్లో కొత్త తరం ఐఫోన్ విడుదలకు సన్నాహాలు జరుగుతున్న వేళ ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇప్పటివరకు విడిభాగాల ధరలు పెరిగినా ఆ భారం వినియోగదారులపై మోపకుండా సంస్థే భరించిందని ఆయన పేర్కొన్నట్లు తెలుస్తోంది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో అదే విధానాన్ని కొనసాగించడం కష్టమవుతోందని అభిప్రాయపడినట్లు సమాచారం. సాంకేతిక రంగంలో కృత్రిమ మేధ సాంకేతికత విస్తరణతో మెమరీ చిప్‌లకు డిమాండ్ భారీగా పెరిగింది. ముఖ్యంగా కృత్రిమ మేధ ఆధారిత సేవలను అభివృద్ధి చేస్తున్న సంస్థలు పెద్ద ఎత్తున చిప్‌లను వినియోగిస్తున్నాయి. దీంతో ప్రపంచవ్యాప్తంగా సరఫరాపై ఒత్తిడి పెరిగి ధరలు ఎగబాకుతున్నాయి. స్మార్ట్‌ఫోన్‌ల తయారీలో అత్యధికంగా మెమరీ చిప్‌లను వినియోగించే సంస్థల్లో యాపిల్ అగ్రస్థానంలో ఉంది. చిప్‌ల ధరల పెరుగుదల కారణంగా ప్రతి కొత్త ఫోన్‌పై అదనపు వ్యయం గణనీయంగా పెరిగినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఈ అదనపు ఖర్చును సంస్థ భరించడం క్రమంగా భారంగా మారుతోందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. మరోవైపు కృత్రిమ మేధ రంగం వేగంగా విస్తరిస్తుండటంతో భవిష్యత్తులో మెమరీ చిప్‌ల కోసం పోటీ మరింత పెరిగే అవకాశముంది. దీనివల్ల స్మార్ట్‌ఫోన్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ వ్యయాలు కూడా పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. కొత్త ఐఫోన్ శ్రేణి విడుదల సమయంలో ధరలపై సంస్థ అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉంది. అయితే ప్రస్తుతం వెలువడుతున్న సంకేతాల ప్రకారం ప్రీమియం స్మార్ట్‌ఫోన్‌ల ధరల్లో పెరుగుదల కనిపించే అవకాశముందని టెక్నాలజీ రంగ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# ఈపీఎఫ్ ఖాతాదారులకు ఊరట

## ఈ నెలలోనే వడ్డీ జమ




**న్యూఢిల్లీ, జూన్ 18:** ఉద్యోగుల భవిష్య నిధి ఖాతాదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఉద్యోగుల భవిష్య నిధి ఖాతాలపై 8.25 శాతం వార్షిక వడ్డీ చెల్లింపునకు కేంద్ర ఆర్థిక శాఖ ఆమోదం తెలిపింది. దీంతో దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఖాతాదారుల పీఎఫ్ ఖాతాల్లో ఈ నెలాఖరులోగా వడ్డీ మొత్తాలు జమయ్యే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ ట్రస్టీల కేంద్ర బోర్డు గతంలో 8.25 శాతం వడ్డీ రేటును ప్రతిపాదించగా, తాజాగా కేంద్ర ప్రభుత్వం దానికి అధికారిక ఆమోదం తెలిపింది. గత ఆర్థిక సంవత్సరంలో అమలైన వడ్డీ రేటునే ఈ ఏడాది కూడా కొనసాగించడం ఉద్యోగులకు ఊరటనిచ్చే అంశంగా మారింది. ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, మార్కెట్ ఒడిదుడుకులు, పెట్టుబడులపై రాబడుల్లో హెచ్చుతగ్గులు ఉన్నప్పటికీ వడ్డీ రేటును తగ్గించకుండా యథాతథంగా కొనసాగించడం విశేషమని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా పదవీ విరమణ తర్వాత ఆర్థిక భద్రత కోసం పీఎఫ్‌పై ఆధారపడే ఉద్యోగులకు ఇది ప్రయోజనకరంగా మారనుంది. ఉద్యోగుల భవిష్య నిధి ఖాతాల్లో వడ్డీ లెక్కింపు ప్రతి నెలా జరుగుతుంది. ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి చివరి వరకు ఖాతాలో ఉన్న నిల్వల ఆధారంగా నెలవారీగా వడ్డీని గణిస్తారు. అయితే మొత్తం వడ్డీని ఒకేసారి ఆర్థిక సంవత్సరం ముగిసిన తర్వాతే ఖాతాలో జమ చేస్తారు. మధ్యలో నిధుల ఉపసంహరణ చేసిన ఖాతాదారులకు విత్‌డ్రా చేసిన మొత్తంపై వడ్డీ వర్తించదు. అలాగే చాలా కాలంగా వినియోగంలో లేని లేదా నిష్క్రియ ఖాతాలకు నిబంధనల ప్రకారం వడ్డీ జమ చేయబడదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇటీవల ఈపీఎఫ్ఓ డిజిటల్ వ్యవస్థలను మరింత ఆధునీకరించిన నేపథ్యంలో వడ్డీ జమ ప్రక్రియ వేగవంతమయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. గతంలో కేంద్ర ఆమోదం వచ్చిన తర్వాత ఖాతాల్లో వడ్డీ జమ కావడానికి నెలల సమయం పట్టేది. అయితే ప్రస్తుతం సాంకేతిక వ్యవస్థల్లో మార్పుల కారణంగా ఈ ప్రక్రియ త్వరగా పూర్తయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఉద్యోగులు తమ పీఎఫ్ ఖాతాల్లో వడ్డీ జమ కోసం ఎదురుచూస్తుండగా, ఈ నెలాఖరులోపు ఖాతాల్లో వడ్డీ ప్రతిబింబించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి.

# జూలై నుంచి టాటా వాహనాలు ఖరీదు




**ముంబై, జూన్ 18 :** దేశంలోని ప్రముఖ వాణిజ్య వాహనాల తయారీ సంస్థ టాటా మోటార్స్ తమ వినియోగదారులకు ధరల షాక్ ఇచ్చింది. వచ్చే జులై 1వ తేదీ నుంచి తమ వాణిజ్య వాహనాల ధరలను పెంచుతున్నట్లు సంస్థ అధికారికంగా ప్రకటించింది. పెరుగుతున్న తయారీ వ్యయాలు, ముడి పదార్థాల ధరలు, ఇతర ఉత్పత్తి ఖర్చుల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ వెల్లడించింది. టాటా మోటార్స్ విడుదల చేసిన ప్రకటన ప్రకారం వాణిజ్య వాహనాల ధరలు గరిష్టంగా 2.5 శాతం వరకు పెరగనున్నాయి. అయితే ఈ పెంపు అన్ని వాహనాలపై ఒకే విధంగా ఉండదని, వాహనం మోడల్, వేరియంట్, సామర్థ్యాన్ని బట్టి మారుతుందని సంస్థ స్పష్టం చేసింది. దీంతో లారీలు, ట్రక్కులు, టిప్పర్లు, టెంపోలు, సరుకు రవాణా వాహనాలు కొనుగోలు చేయాలనుకునే వారికి అదనపు భారం పడనుంది. ఇటీవలే టాటా మోటార్స్ తమ ప్రయాణికుల వాహనాలు, విద్యుత్ కార్ల ధరలను కూడా పెంచిన విషయం తెలిసిందే. ఆ సమయంలో సుమారు 1.5 శాతం వరకు ధరలను సవరించింది. ఇప్పుడు వాణిజ్య వాహనాల ధరలను కూడా పెంచడంతో రవాణా రంగంపై ప్రభావం పడే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. దేశంలో ముడి పదార్థాల ధరలు, ఉక్కు, రబ్బరు, ఎలక్ట్రానిక్ భాగాల వ్యయాలు పెరుగుతుండటంతో వాహన తయారీ సంస్థలు ఉత్పత్తి ఖర్చుల ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఈ పరిస్థితుల్లో వ్యాపార పరంగా సమతుల్యతను కాపాడుకోవడానికి ధరల సవరణ అనివార్యమైందని టాటా మోటార్స్ పేర్కొంది. జులై నెల నుంచి అమల్లోకి రానున్న ఈ ధరల పెంపు కారణంగా కొత్త వాణిజ్య వాహనాల కొనుగోలును పరిశీలిస్తున్న వ్యాపారులు, రవాణా సంస్థలు ముందుగానే బుకింగ్‌లు చేసుకునే అవకాశాలు ఉన్నాయని ఆటోమొబైల్ రంగ నిపుణులు చెబుతున్నారు. దేశీయ వాణిజ్య వాహనాల మార్కెట్‌లో టాటా మోటార్స్ కీలక స్థానంలో ఉండటంతో ఈ నిర్ణయం రంగవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

# జేబీఎల్ నుంచి కొత్త హెడ్‌ఫోన్లు




**న్యూఢిల్లీ, జూన్ 18 :** ప్రముఖ ఆడియో పరికరాల తయారీ సంస్థ జేబీఎల్ భారత మార్కెట్లో రెండు కొత్త వైర్‌లెస్ హెడ్‌ఫోన్లను ఆవిష్కరించింది. ప్రీమియం విభాగాన్ని లక్ష్యంగా చేసుకుని తీసుకొచ్చిన ఈ కొత్త మోడళ్లు అత్యాధునిక శబ్ద నియంత్రణ సాంకేతికత, అధిక బ్యాటరీ సామర్థ్యం, నాణ్యమైన ధ్వని అనుభూతితో వినియోగదారులను ఆకట్టుకునేందుకు సిద్ధమయ్యాయి. జేబీఎల్ లైవ్ 780ఎన్‌సీ, జేబీఎల్ లైవ్ 680ఎన్‌సీ పేర్లతో విడుదలైన ఈ హెడ్‌ఫోన్లలో మెరుగైన అడాప్టివ్ నాయిస్ క్యాన్సిలేషన్ 2.0 సాంకేతికతను అందించారు. పరిసరాల్లోని శబ్దాలను స్వయంచాలకంగా గుర్తించి వాటిని తగ్గించడం ద్వారా వినియోగదారులకు స్పష్టమైన ధ్వని అనుభూతిని అందిస్తుంది. కాల్స్ సమయంలో కృత్రిమ మేధ ఆధారిత శబ్ద నియంత్రణ వ్యవస్థ సాయంతో స్వర నాణ్యత మరింత మెరుగుపడుతుంది. లైవ్ 780ఎన్‌సీ మోడల్‌లో ఆరు మైక్రోఫోన్లు, లైవ్ 680ఎన్‌సీ మోడల్‌లో నాలుగు మైక్రోఫోన్లు ఏర్పాటు చేశారు. దీని వల్ల కాల్స్ సమయంలో స్పష్టమైన సంభాషణ సాధ్యమవుతుందని సంస్థ పేర్కొంది. ఈ హెడ్‌ఫోన్లలో బ్యాటరీ సామర్థ్యం కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. నాయిస్ క్యాన్సిలేషన్ సదుపాయాన్ని నిలిపివేసినప్పుడు గరిష్ఠంగా 80 గంటల వరకు, వినియోగించినప్పుడు 50 గంటల వరకు పనిచేస్తాయి. కేవలం ఐదు నిమిషాల వేగవంతమైన ఛార్జింగ్‌తో అదనంగా నాలుగు గంటల వినియోగ సమయం లభిస్తుందని జేబీఎల్ వెల్లడించింది. అంతేకాకుండా విశాల ధ్వని అనుభూతి, వ్యక్తిగత అభిరుచులకు అనుగుణంగా ధ్వని సర్దుబాటు, అత్యుత్తమ నాణ్యత గల వైర్‌లెస్ ఆడియో, సరికొత్త బ్లూటూత్ 6.0 సాంకేతికత, ఒకేసారి రెండు పరికరాలతో అనుసంధానం వంటి ఆధునిక సదుపాయాలను కూడా ఇందులో పొందుపరిచారు. ఈ హెడ్‌ఫోన్లు నలుపు, నీలం, తెలుపు, షాంపేన్, ఆకుపచ్చ, నారింజ, ఊదా రంగుల్లో అందుబాటులో ఉన్నాయి. ధరల విషయానికి వస్తే జేబీఎల్ లైవ్ 780ఎన్‌సీ ధర రూ.15,999గా, జేబీఎల్ లైవ్ 680ఎన్‌సీ ధర రూ.11,999గా నిర్ణయించారు. ప్రస్తుతం లైవ్ 780ఎన్‌సీ ముందస్తు బుకింగ్‌కు అందుబాటులో ఉండగా, లైవ్ 680ఎన్‌సీ విక్రయాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి.

# పెట్రోల్ ధరలు ఎప్పుడు తగ్గుతాయి?

**న్యూఢిల్లీ, జూన్ 18:** అంతర్జాతీయ స్థాయిలో ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టినా దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు యథాతథంగా కొనసాగుతున్నాయి. అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదరడంతో ప్రపంచ మార్కెట్‌లో ముడి చమురు సరఫరాపై ఉన్న అనిశ్చితి తొలగిపోయింది. దీంతో చమురు ధరలు గణనీయంగా తగ్గాయి. అయితే ఈ ప్రభావం భారత వినియోగదారులకు ఇప్పటివరకు కనిపించకపోవడంతో ప్రజల్లో ఆసక్తి నెలకొంది. గత నెలలో అంతర్జాతీయ ఉద్రిక్తతలు, యుద్ధ పరిస్థితుల కారణంగా దేశంలో ఇంధన ధరలు పలుమార్లు పెరిగాయి. ఆ సమయంలో ముడి చమురు ధరలు పెరగడంతో ఆయిల్ మార్కెటింగ్ సంస్థలు భారీ వ్యయభారం ఎదుర్కొన్నాయి. ప్రస్తుతం అంతర్జాతీయ ధరలు తగ్గుతున్నప్పటికీ గతంలో వచ్చిన నష్టాలను పూడ్చుకునే ప్రక్రియలో సంస్థలు ఉన్నాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. అందువల్ల వెంటనే ధరలు తగ్గించే అవకాశం కనిపించడం లేదని అభిప్రాయపడుతున్నాయి. మరోవైపు ముడి చమురు ధరలు తగ్గినా రవాణా వ్యయాలు, నిల్వ ఖర్చులు, మార్కెటింగ్ వ్యయాలు గణనీయంగా తగ్గకపోవడం కూడా ప్రభావం చూపుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరల మార్పు నేరుగా దేశీయ ఇంధన ధరలపై ప్రతిఫలించకపోవడానికి ఇదీ ఒక ప్రధాన కారణంగా పేర్కొంటున్నారు. అందుకే ప్రస్తుతం ఆయిల్ కంపెనీలు ధరల విషయంలో జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాయి. ఇంధన ధరలు తగ్గకపోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పన్నులు కూడా కీలక కారణంగా విశ్లేషకులు చెబుతున్నారు. పెట్రోల్, డీజిల్‌పై కేంద్ర ప్రభుత్వం విధించే ఎక్సైజ్ సుంకంతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలు విధించే విలువ ఆధారిత పన్నులు వినియోగదారులపై అదనపు భారం మోపుతున్నాయి. ముడి చమురు ధరలు తగ్గినా ఈ పన్నులు యథాతథంగా కొనసాగితే వినియోగదారులకు పెద్దగా ప్రయోజనం ఉండదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇంధన ధరల్లో స్పష్టమైన తగ్గుదల రావాలంటే అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు మరింత కాలం తక్కువ స్థాయిలో కొనసాగాల్సి ఉంటుందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పన్నుల విషయంలో కొంత ఉపశమనం కల్పిస్తేనే ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా లక్షలాది వాహనదారులు పెట్రోల్, డీజిల్ ధరల తగ్గింపుపై ఆశగా ఎదురుచూస్తున్నారు.






# ఇషాన్ విధ్వంసం.. స్వాన్ ప్రశంసల జల్లు

**లక్నో, జూన్ 18 :** ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన రెండో వన్డేలో శతకంతో చెలరేగిన భారత యువ బ్యాటర్ ఇషాన్ కిషన్‌పై ఇంగ్లండ్ మాజీ స్పిన్నర్ గ్రేమ్ స్వాన్ ప్రశంసల వర్షం కురిపించాడు. జట్టులోకి తిరిగి వచ్చిన తర్వాత ఎలాంటి ఒత్తిడి లేకుండా ఆడిన తీరు తనను ఎంతగానో ఆకట్టుకుందని పేర్కొన్నాడు. లక్నో వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ కేవలం 79 బంతుల్లోనే 125 పరుగులు చేసి భారత జట్టు భారీ స్కోరు సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. అతడి ఇన్నింగ్స్‌లో 14 ఫోర్లు, 7 భారీ సిక్సర్లు ఉన్నాయి. కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో కలిసి మూడో వికెట్‌కు 224 పరుగుల అద్భుత భాగస్వామ్యం నెలకొల్పి ఆఫ్ఘన్ బౌలర్లపై పూర్తిస్థాయి ఆధిపత్యం చెలాయించాడు. మ్యాచ్ అనంతరం మాట్లాడిన గ్రేమ్ స్వాన్.. జట్టులో ఏ పాత్ర ఇచ్చినా ఇషాన్ సమర్థంగా నిర్వర్తిస్తాడని కొనియాడాడు. "ఇషాన్‌కు ఎలాంటి బాధ్యత అప్పగించినా వెనుకాడడు. జట్టులోకి తిరిగి వచ్చి ఇంత ప్రభావవంతమైన ఇన్నింగ్స్ ఆడటం గొప్ప విషయం. అతడు పరిస్థితులకు తగ్గట్టుగా తన ఆటను మార్చుకోగలడు" అని ప్రశంసించాడు. ఇషాన్ సెంచరీ సాధించిన విధానం తనను మరింత ఆకట్టుకుందని స్వాన్ వెల్లడించాడు. తొలి అర్ధశతకాన్ని ఓపికగా నిర్మించిన ఇషాన్, ఆ తర్వాత దూకుడు పెంచి కేవలం 19 బంతుల్లోనే మరో 50 పరుగులు సాధించడం ప్రత్యేకమని పేర్కొన్నాడు. అయితే అవి అజాగ్రత్తగా ఆడిన షాట్లు కాదని, సరైన బంతులను మాత్రమే ఎంచుకుని బౌండరీలకు తరలించాడని వివరించాడు. ఇషాన్ తన ఆటలో ఉన్న లోపాలను సరిదిద్దుకునేందుకు తీవ్రంగా శ్రమించాడని, గతంలో బలహీనతగా భావించిన అంశాలనే ఇప్పుడు తన బలంగా మార్చుకున్నాడని స్వాన్ అభిప్రాయపడ్డాడు. అదే అతడిని ప్రత్యేక ఆటగాడిగా నిలబెడుతోందని వ్యాఖ్యానించాడు. ఇషాన్, గిల్ జోడీ చెలరేగడంతో భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 402 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. అనంతరం భారత బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి ఆఫ్ఘనిస్థాన్‌ను 232 పరుగులకే పరిమితం చేశారు. ఫలితంగా భారత్ 170 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. ఈ విజయంతో మూడు వన్డేల సిరీస్‌ను భారత్ మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0తో కైవసం చేసుకుని ఆధిపత్యాన్ని చాటుకుంది. ఇషాన్ కిషన్ అద్భుత ఫామ్, శుభ్‌మన్ గిల్ నిలకడైన ఆటతీరు జట్టుకు మరింత బలాన్నిస్తున్నాయని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.





# రొనాల్డోపై విమర్శలు

## కోహ్లీ పాత వ్యాఖ్యలు మళ్లీ వైరల్

**లిస్బన్, జూన్ 18 :** ఫిఫా ప్రపంచకప్--2026లో భారీ అంచనాలతో బరిలోకి దిగిన పోర్చుగల్ జట్టు తొలి మ్యాచ్‌లోనే నిరాశపరిచింది. డీఆర్ కాంగోతో జరిగిన పోరులో డ్రాతో సరిపెట్టుకోవడంతో జట్టుతో పాటు స్టార్ ఫుట్‌బాలర్ క్రిస్టియానో రొనాల్డోపై కూడా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తన కెరీర్‌లో చివరి ప్రపంచకప్ ఆడుతున్న రొనాల్డో నుంచి అభిమానులు భారీ ప్రదర్శన ఆశించినప్పటికీ, అతడు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో 143 గోల్స్ సాధించి చరిత్ర సృష్టించిన 41 ఏళ్ల రొనాల్డో ప్రస్తుత టోర్నీలో తన అనుభవాన్ని చూపించలేకపోయాడనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాంగోతో జరిగిన మ్యాచ్‌లో అతడికి వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోలేకపోవడంతో విమర్శకులు మరింతగా విరుచుకుపడుతున్నారు. కొందరు అతడిని జట్టులోకి ఎంపిక చేయడంపైనా ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ఈ నేపథ్యంలో భారత క్రికెట్ దిగ్గజం విరాట్ కోహ్లీ గతంలో రొనాల్డోకు మద్దతుగా చేసిన వ్యాఖ్యలు మళ్లీ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. 2022 ఖతార్ ప్రపంచకప్‌లో పోర్చుగల్ నిష్క్రమించిన తర్వాత తీవ్ర నిరాశకు గురైన రొనాల్డోకు అండగా నిలిచిన కోహ్లీ, అతడిని ఆల్‌టైమ్ గ్రేటెస్ట్ క్రీడాకారుల్లో ఒకడిగా అభివర్ణించాడు. "ఏ ట్రోఫీ అయినా, ఏ టైటిల్ అయినా మీరు ఈ క్రీడకు చేసిన సేవను తగ్గించలేవు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందిపై మీరు చూపిన ప్రభావాన్ని ఎలాంటి రికార్డులు కొలవలేవు. మీ ఆటపట్ల ఉన్న అంకితభావం, మైదానంలో చూపించే తపన ప్రతి క్రీడాకారుడికి స్ఫూర్తి. నా దృష్టిలో మీరే అత్యుత్తమ ఆటగాడు" అంటూ కోహ్లీ అప్పట్లో పేర్కొన్నాడు. రొనాల్డో ప్రస్తుత ప్రదర్శనపై స్పందిస్తున్న పలువురు క్రీడా విశ్లేషకులు కూడా అతడి సామర్థ్యం తగ్గలేదని అభిప్రాయపడుతున్నారు. వేగవంతమైన ఆధునిక ఫుట్‌బాల్‌కు అనుగుణంగా జట్టులో సమన్వయం కుదరకపోవడం, సహచర ఆటగాళ్లతో అనుసంధానం ఆశించిన స్థాయిలో లేకపోవడమే ప్రధాన కారణమని చెబుతున్నారు. తమ తమ క్రీడల్లో ఎన్నో శిఖరాలు అధిరోహించిన రొనాల్డో, కోహ్లీ ఇద్దరూ కెరీర్‌లో ఇలాంటి క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్నవారే. విమర్శలకు ఆటతోనే సమాధానం చెప్పిన చరిత్ర వారిద్దరికీ ఉంది. ఇదే నేపథ్యంలో రొనాల్డో కూడా మిగిలిన మ్యాచ్‌ల్లో తన పాత మాంత్రికతను చూపించి పోర్చుగల్ జట్టును విజయపథంలో నడిపించాలని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# కాంగో షాక్.. పోర్చుగల్‌కు డ్రా

**హియూస్టన్, జూన్ 18 :** ఫిఫా ప్రపంచకప్-2026 గ్రూప్ 'కె' తొలి మ్యాచ్‌లో బలమైన పోర్చుగల్‌కు డీఆర్ కాంగో గట్టి షాక్ ఇచ్చింది. హియూస్టన్‌లో జరిగిన ఈ మ్యాచ్ 1-1తో డ్రాగా ముగియడంతో కాంగో ప్రపంచకప్ చరిత్రలో తొలి పాయింట్‌ను ఖాతాలో వేసుకుంది. మ్యాచ్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన పోర్చుగల్ ఆరో నిమిషంలోనే ఆధిక్యం సాధించింది. పెడ్రో నెటో అందించిన అద్భుతమైన క్రాస్‌ను జోవావ్ నెవెస్ హెడర్ ద్వారా గోల్‌గా మలచడంతో పోర్చుగల్ 1-0తో ముందంజ వేసింది. అయితే తొలి అర్ధభాగం ముగిసే సమయానికి కాంగో సమాధానం ఇచ్చింది. యోవాన్ విస్సా లభించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ హెడర్‌తో గోల్ నమోదు చేశాడు. దీంతో స్కోరు 1-1తో సమమైంది. ఇదే ప్రపంచకప్ చరిత్రలో కాంగో జట్టు సాధించిన తొలి గోల్‌గా నమోదైంది. రెండో అర్ధభాగంలో ఇరు జట్లు గెలుపు కోసం ప్రయత్నించినప్పటికీ మరో గోల్ నమోదు కాలేదు. కాంగో రక్షణ శ్రేణి పోర్చుగల్ దాడులను సమర్థంగా అడ్డుకోవడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఇక తన కెరీర్‌లో ఆరో ప్రపంచకప్ ఆడుతున్న పోర్చుగల్ స్టార్ క్రిస్టియానో రోనాల్డో తీవ్రంగా నిరాశపరిచాడు. మొత్తం మ్యాచ్‌లో అతడు కేవలం 29 సార్లు మాత్రమే బంతిని తాకాడు. ప్రపంచకప్ కెరీర్‌లో అతని అత్యల్ప భాగస్వామ్య ప్రదర్శనల్లో ఇది ఒకటిగా నిలిచింది. రెండో అర్ధభాగంలో రోనాల్డోకు రెండు స్పష్టమైన గోల్ అవకాశాలు వచ్చినప్పటికీ వాటిని సద్వినియోగం చేసుకోలేకపోయాడు. కాంగో రక్షణ ఆటగాళ్లు అతడిని సమర్థంగా కట్టడి చేయడంతో పోర్చుగల్ పూర్తి పాయింట్లు సాధించే అవకాశాన్ని కోల్పోయింది. ఈ ఫలితంతో గ్రూప్ 'కె'లో పోటీ ఆసక్తికరంగా మారింది. పోర్చుగల్ తన తదుపరి మ్యాచ్‌లో ఉజ్బెకిస్తాన్‌ను ఎదుర్కోనుండగా, కాంగో మరో సంచలన ఫలితంపై కన్నేసింది.




# మన్‌ప్రీత్ సింగ్‌కు అరుదైన ఘనత

**రోటర్‌డామ్, జూన్ 18 :** భారత హాకీ జట్టు స్టార్ ఆటగాడు మన్‌ప్రీత్ సింగ్ దేశ హాకీ చరిత్రలో కొత్త అధ్యాయాన్ని లిఖించాడు. భారత జట్టు తరఫున అత్యధిక అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగా సరికొత్త రికార్డు సృష్టించాడు. నెదర్లాండ్స్‌లోని రోటర్‌డామ్ వేదికగా జర్మనీతో జరిగిన ఎఫ్ఐహెచ్ హాకీ ప్రో లీగ్ మ్యాచ్‌లో బరిలోకి దిగిన మన్‌ప్రీత్ తన 413వ అంతర్జాతీయ మ్యాచ్‌ను పూర్తి చేశాడు. దీంతో హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ టిర్కీ పేరిట ఉన్న 412 మ్యాచ్‌ల రికార్డును అధిగమించి అగ్రస్థానంలో నిలిచాడు. ఈ చారిత్రక విజయాన్ని గుర్తిస్తూ హాకీ ఇండియా మన్‌ప్రీత్ సింగ్‌కు రూ.10 లక్షల నగదు బహుమతిని ప్రకటించింది. గత పదిహేనేళ్లుగా భారత హాకీ జట్టుకు అతడు కీలక ఆటగాడిగా సేవలందిస్తున్నాడని, అతని అంకితభావం, నిలకడ అసాధారణమని ప్రశంసించింది. 2011లో కేవలం 19 ఏళ్ల వయసులో భారత జట్టులోకి ప్రవేశించిన మన్‌ప్రీత్, తన ప్రతిభతో జట్టులో కీలక స్థానాన్ని సంపాదించుకున్నాడు. టోక్యో ఒలింపిక్స్, పారిస్ ఒలింపిక్స్‌లలో కాంస్య పతకాలు గెలిచిన భారత జట్టులో సభ్యుడిగా నిలిచి దేశానికి గౌరవం తీసుకొచ్చాడు. అంతర్జాతీయ హాకీలో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాళ్ల జాబితాలో మన్‌ప్రీత్ ప్రస్తుతం ఐదో స్థానంలో ఉండటం మరో విశేషం. భారత హాకీకి ఆయన అందించిన సేవలు విశేషమైనవిగా క్రీడా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ సందర్భంగా మన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ, భారత్ తరఫున ఇన్ని మ్యాచ్‌లు ఆడటం తనకు గర్వకారణమని పేర్కొన్నాడు. ఈ ఘనతను తన సహచర ఆటగాళ్లు, కోచ్‌లు, కుటుంబ సభ్యులకు అంకితం చేస్తున్నానని తెలిపాడు. భవిష్యత్తులో భారత జట్టుకు ఒలింపిక్ స్వర్ణ పతకం, ప్రపంచకప్ టైటిల్ అందించడమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశాడు. హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ టిర్కీ మాట్లాడుతూ, మన్‌ప్రీత్ సాధించిన ఈ ఘనత అతని కృషి, క్రమశిక్షణ, అంకితభావానికి నిదర్శనమని అన్నారు. రాబోయే తరాలకు అతడు ఆదర్శంగా నిలుస్తాడని కొనియాడారు. హాకీ ఇండియా ప్రధాన కార్యదర్శి భోలా నాథ్ సింగ్ కూడా మన్‌ప్రీత్‌ను అభినందిస్తూ భారత హాకీకి ఆయన చేసిన సేవలను ప్రశంసించారు.



# వైభవ్‌పై చర్యల ప్రచారం.. బీసీసీఐ ఖండన

**ముంబయి, జూన్ 18 :** శ్రీలంక-ఏ, భారత్-ఏ జట్ల మధ్య జరిగిన ముక్కోణపు వన్డే టోర్నీలో యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ ప్రవర్తనపై క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారాన్ని భారత క్రికెట్ నియంత్రణ మండలి ఖండించింది. మైదానంలో జరిగే ఘటనల విషయంలో బీసీసీఐ నేరుగా జోక్యం చేసుకోదని సంస్థ కార్యదర్శి దేవజిత్ సైకియా స్పష్టం చేశారు. ఈ నెల 9న దంబుల్లా వేదికగా జరిగిన భారత్-ఏ, శ్రీలంక-ఏ మ్యాచ్ అనంతరం ఇరు జట్ల ఆటగాళ్ల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. శ్రీలంక ఆటగాడు విషేన్ హలంబగే భారత యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. ఆ సమయంలో హలంబగే దగ్గరకు రావడంతో వైభవ్ అతడిని తోసిన ఘటన చర్చనీయాంశమైంది. ఈ ఘటన నేపథ్యంలో వైభవ్‌పై బీసీసీఐ కఠిన చర్యలు తీసుకోనుందనే వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. దీనిపై స్పందించిన దేవజిత్ సైకియా, మైదానంలో జరిగే సంఘటనలపై నిర్ణయం తీసుకునే అధికారం మ్యాచ్ రిఫరీలు, అంపైర్లకే ఉంటుందని తెలిపారు. "మ్యాచ్ సందర్భంగా చోటుచేసుకునే ఘటనలు పూర్తిగా మ్యాచ్ రిఫరీ, అంపైర్ల పరిధిలోకి వస్తాయి. అలాంటి అంశాల్లో బీసీసీఐ జోక్యం చేసుకోదు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన వ్యవస్థ అమల్లో ఉంది. తుది నిర్ణయం వారి చేతుల్లోనే ఉంటుంది" అని ఆయన స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, మ్యాచ్ అనంతరం జరిగిన వేర్వేరు ఘటనలకు సంబంధించి శ్రీలంక ఆటగాళ్లు విషేన్ హలంబగే, నీరోషన్ డిక్వెల్లాపై మ్యాచ్ రిఫరీ ప్రదీప్ జయప్రకాశ్ చర్యలు తీసుకున్నట్లు సమాచారం. సూపర్ ఓవర్ విజయం తర్వాత భారత ఆటగాళ్లను రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించినందుకు హలంబగేపై, అతిగా అప్పీల్ చేసినందుకు డిక్వెల్లాపై ఆంక్షలు విధించినట్లు తెలుస్తోంది. అయితే వారికి విధించిన శిక్షల స్వరూపం ఏమిటన్న దానిపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో ఈ అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. మరోవైపు వైభవ్ సూర్యవంశీపై ఎలాంటి చర్యలు ఉండవన్న బీసీసీఐ వివరణతో అతడి అభిమానులు ఊరట వ్యక్తం చేస్తున్నారు. యువ ఆటగాళ్ల మధ్య మైదానంలో అప్పుడప్పుడూ ఇలాంటి ఉద్రిక్త పరిస్థితులు సహజమేనని, వాటిని నియంత్రించే బాధ్యత మ్యాచ్ అధికారులదేనని క్రీడా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.





# క్రోయేషియాపై ఇంగ్లాండ్ విజయం

**డల్లాస్, జూన్ 18 :** ఫిఫా ప్రపంచకప్--2026 గ్రూప్ ఎల్‌లో ఇంగ్లాండ్ జట్టు విజయంతో శుభారంభం చేసింది. టెక్సాస్‌లోని డల్లాస్ స్టేడియంలో జరిగిన ఉత్కంఠభరిత పోరులో క్రోయేషియాను 4-2 తేడాతో ఓడించి పూర్తి పాయింట్లు సాధించింది. కొత్త ప్రధాన శిక్షకుడు థామస్ తుచెల్ ఆధ్వర్యంలో ఇంగ్లాండ్‌కు ఇది తొలి ప్రధాన టోర్నమెంట్ విజయం కావడం విశేషం. మ్యాచ్ ప్రారంభం నుంచే దూకుడుగా ఆడిన ఇంగ్లాండ్‌కు కెప్టెన్ హ్యారీ కేన్ నాయకత్వం వహించాడు. 12వ నిమిషంలో లభించిన పెనాల్టీని గోల్‌గా మలిచి జట్టుకు తొలి ఆధిక్యం అందించాడు. అనంతరం 42వ నిమిషంలో హెడర్ ద్వారా మరో గోల్ నమోదు చేశాడు. దీంతో ప్రపంచకప్‌లలో ఇంగ్లాండ్ తరఫున అత్యధిక గోల్స్ చేసిన గ్యారీ లినెకర్ 10 గోల్స్ రికార్డును కేన్ సమం చేశాడు. అయితే క్రోయేషియా కూడా గట్టి పోరాటం చేసింది. ఇంగ్లాండ్ రక్షణ విభాగంలోని లోపాలను సద్వినియోగం చేసుకుంటూ 36వ నిమిషంలో మార్టిన్ బాతురినా గోల్ సాధించాడు. తొలి అర్ధభాగం ముగిసే వేళ పెటార్ ముసా మరో గోల్ నమోదు చేయడంతో విరామ సమయానికి స్కోరు 2-2తో సమమైంది. రెండో అర్ధభాగంలో ఇంగ్లాండ్ పూర్తిగా ఆధిపత్యం చెలాయించింది. విరామ సమయంలో శిక్షకుడు తుచెల్ ఇచ్చిన సూచనలు జట్టులో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. రెండో భాగం ప్రారంభమైన రెండు నిమిషాలకే జూడ్ బెల్లింగ్‌హామ్ అద్భుతమైన గోల్ చేసి ఇంగ్లాండ్‌ను మళ్లీ ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. మ్యాచ్ ముగింపుకు ఐదు నిమిషాలు మిగిలి ఉండగా ప్రత్యామ్నాయ ఆటగాడిగా బరిలోకి దిగిన మార్కస్ రాష్‌ఫోర్డ్ మరో గోల్ నమోదు చేశాడు. బుకాయో సాకా అందించిన చక్కటి పాస్‌ను గోల్‌గా మలిచిన రాష్‌ఫోర్డ్ ఇంగ్లాండ్ విజయాన్ని ఖాయం చేశాడు. ఈ విజయంతో గ్రూప్ ఎల్‌లో ఇంగ్లండ్ బలమైన సందేశం పంపింది. తదుపరి మ్యాచ్‌లో ఇంగ్లాండ్ ఘనాతో తలపడనుండగా, క్రోయేషియా పనామాతో పోటీ పడనుంది. ప్రపంచకప్‌లో టైటిల్ ఆశలతో బరిలోకి దిగిన ఇంగ్లాండ్ జట్టు ఈ విజయంతో అభిమానుల్లో భారీ అంచనాలు పెంచింది.



# రాయ్ లక్ష్మీ పాత వ్యాఖ్యలు మళ్లీ వైరల్

**సోషల్ మీడియాలో జోరుగా చర్చ.. వ్యక్తిగత జీవితంపై మరోసారి హాట్ టాపిక్**

దక్షిణాది సినీ పరిశ్రమలో గ్లామర్ పాత్రలు, ప్రత్యేక గీతాలతో గుర్తింపు పొందిన ప్రముఖ నటి [illegible] మరోసారి వార్తల్లో నిలిచారు. గతంలో ఆమె చేసిన కొన్ని వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో మళ్లీ వైరల్ అవుతూ చర్చనీయాంశంగా మారాయి. భారత మాజీ క్రికెట్ జట్టు కెప్టెన్ Mahendra Singh Dhoniతో తన పేరు ముడిపెట్టిన ప్రచారాలపై ఆమె గతంలో ఇచ్చిన ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు అప్పట్లో పెద్ద చర్చకు దారితీశాయి. ఆ ఇంటర్వ్యూలో రాయ్ లక్ష్మీ మాట్లాడుతూ, చాలా సంవత్సరాల క్రితం జరిగిన విషయాలను ఇప్పటికీ ప్రస్తావించడం బాధాకరమని పేర్కొన్నారు. వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అంశాలను పదేపదే చర్చకు తీసుకురావడం సరైంది కాదని అభిప్రాయపడ్డారు. ఇంటర్నెట్‌లో పాత వార్తలు ఇప్పటికీ ప్రచారంలో ఉండటం వల్ల అనవసర చర్చలు జరుగుతున్నాయని ఆమె వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఈ పాత వ్యాఖ్యలు మరోసారి వైరల్ కావడంతో నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఆమె వ్యక్తిగత గోప్యతను గౌరవించాలని సూచిస్తుండగా, మరికొందరు పాత విషయాలు మళ్లీ చర్చకు రావడం ఆశ్చర్యంగా ఉందని అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా, ఇటీవల సినిమాల ఎంపికలో ఆచితూచి అడుగులు వేస్తున్న రాయ్ లక్ష్మీ, వివిధ భాషల్లో ఎంపిక చేసిన ప్రాజెక్టుల్లో నటిస్తూ ప్రేక్షకులతో అనుబంధాన్ని కొనసాగిస్తున్నారు. సోషల్ మీడియాలో చురుకుగా ఉంటూ అభిమానులతో నిరంతరం మమేకమవుతున్నారు.

# దివి గ్లామర్‌కు నెటిజన్లు ఫిదా

**వైరల్‌గా మారిన తాజా ఫొటోలు**

బుల్లితెర రియాలిటీ షో 'బిగ్‌బాస్' ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన నటి దివి వాద్య మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా ఆమె పంచుకున్న స్టైలిష్ ఫొటోలు అభిమానులను ఆకట్టుకుంటూ నెట్టింట వైరల్‌గా మారాయి. ఆధునిక దుస్తుల్లో, ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబించే హావభావాలతో కనిపించిన దివి ఫొటోలకు అభిమానుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఆమె అందం, ఫ్యాషన్ సెన్స్, గ్లామరస్ లుక్‌పై నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. 'బిగ్‌బాస్' తర్వాత దివి కెరీర్‌లో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రారంభంలో చిన్నచిన్న పాత్రలతో సినీ ప్రయాణాన్ని కొనసాగించిన ఆమె, అనంతరం పలు చిత్రాల్లో అవకాశాలు దక్కించుకుని తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది. సినిమాలతో పాటు వెబ్‌సిరీస్‌లు, బ్రాండ్ ప్రమోషన్లు, డిజిటల్ కంటెంట్ ద్వారా కూడా దివి తన ప్రస్థానాన్ని విజయవంతంగా కొనసాగిస్తోంది. సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు ఫొటోలు, వీడియోలు, వ్యక్తిగత అప్‌డేట్లు పంచుకుంటూ అభిమానులతో సన్నిహితంగా ఉంటోంది. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా నటిగా తన ప్రతిభను నిరూపించుకోవాలనే లక్ష్యంతో విభిన్నమైన కథలను ఎంపిక చేసుకుంటోంది. ప్రస్తుతం 'హనీ', 'నెపోలియన్ రిటర్న్స్', 'ష్..' చిత్రాలతో పాటు 'ద్రౌపతి-2' ప్రాజెక్టులోనూ కీలక పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. వరుస అవకాశాలు, సోషల్ మీడియాలో పెరుగుతున్న ఆదరణతో దివి కెరీర్ మరింత వేగంగా ముందుకు సాగుతోందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. తాజాగా విడుదల చేసిన ఫొటోలు కూడా ఆమెకు ఉన్న క్రేజ్‌ను మరోసారి నిరూపించాయని అభిమానులు చెబుతున్నారు.




# 'జననాయగన్' విడుదలపై ఉత్కంఠ




తమిళ సినీ పరిశ్రమలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో ఒకటైన 'జననాయగన్' విడుదలపై కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రముఖ నటుడు విజయ్ రాజకీయాల్లో పూర్తిస్థాయిలో అడుగుపెట్టే ముందు నటించిన చివరి చిత్రంగా ప్రచారం పొందిన ఈ రాజకీయ యాక్షన్ థ్రిల్లర్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలు సృష్టించింది. అనేక వాయిదాల అనంతరం ఈ చిత్రాన్ని జూన్ 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని చిత్రబృందం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. అయితే ఈ విడుదల పూర్తిగా కేంద్ర చలనచిత్ర ధ్రువీకరణ మండలి అనుమతులపై ఆధారపడి ఉంది. చిత్రానికి సంబంధించిన ధ్రువీకరణ ప్రక్రియ త్వరలో పూర్తవుతుందనే ఆశాభావంతో నిర్మాతలు ఉన్నారు. ఎలాంటి అభ్యంతరాలు లేకుండా అనుమతులు లభిస్తే నిర్ణయించిన తేదీకే సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్ర పరిశ్రమ వర్గాల సమాచారం ప్రకారం, ధ్రువీకరణ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని తెలుస్తోంది. ఒకవేళ నిర్ణీత గడువులోపు అనుమతులు రాకపోతే విడుదల తేదీపై మళ్లీ పునరాలోచన జరిగే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో పంపిణీదారులు, ప్రదర్శకులు కూడా పరిణామాలను నిశితంగా గమనిస్తున్నారు. ప్రఖ్యాత దర్శకుడు హెచ్. వినోద్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని భారీ వ్యయంతో నిర్మించారు. ఇందులో విజయ్ సరసన పూజా హెగ్డే, మమిత బైజు కథానాయికలుగా నటించగా, ప్రతినాయక పాత్రలో బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ కనిపించనున్నారు. సంగీత దర్శకుడు అనిరుధ్ అందించిన పాటలు, నేపథ్య సంగీతం ఇప్పటికే సినీ అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. వాస్తవానికి ఈ చిత్రాన్ని గత ఏడాది సంక్రాంతి సందర్భంగా విడుదల చేయాలని భావించారు. అయితే ధ్రువీకరణ ప్రక్రియలో ఎదురైన సాంకేతిక, న్యాయపరమైన సమస్యల కారణంగా విడుదల పలుమార్లు వాయిదా పడింది. వివిధ స్థాయిల్లో వచ్చిన అభ్యంతరాలు, పునఃపరిశీలన ప్రక్రియలు, న్యాయపరమైన వివాదాలు చిత్ర విడుదలను ఆలస్యం చేశాయి. అంతేకాకుండా, కొన్ని నెలల క్రితం చిత్రానికి సంబంధించిన దృశ్యాలు ఆన్‌లైన్‌లో లీక్ కావడం కూడా నిర్మాతలకు పెద్ద ఎదురుదెబ్బగా మారింది. అయినప్పటికీ చిత్రబృందం అన్ని సమస్యలను అధిగమించి విడుదలకు సిద్ధవుతోంది. రాజకీయ నేపథ్యంతో రూపొందిన ఈ చిత్రంలో సామాజిక, రాజకీయ అంశాలను ప్రాధాన్యంగా చూపించినట్లు సమాచారం. విజయ్ అభిమానులతో పాటు సాధారణ ప్రేక్షకులు కూడా ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. జూన్ చివరి వారంలో విడుదల ఖరారైతే, ఈ చిత్రం ఈ ఏడాది అత్యంత పెద్ద చిత్రాల్లో ఒకటిగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# పంద్రాగస్ట్‌కు విడుదల కానున్న బట్వారా 1947

బాలీవుడ్ యాక్షన్ స్టార్ సన్నీ డియోల్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ హిస్టారికల్ డ్రామా 'బట్వారా 1947' నుంచి క్రేజీ అప్‌డేట్ వచ్చింది. తాజాగా ఈ సినిమా నుంచి టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. దేశ విభజన నాటి భయానక పరిస్థితులు, ద్వేషం మధ్య ఒక వ్యక్తి చూపించిన అసాధారణ ధైర్యం నేపథ్యంలో సాగే భావోద్వేగభరిత చిత్రంగా ఈ చిత్రం రాబోతున్నట్లు టీజర్‌ను చూస్తే అర్థమవుతుంది. ఇక ఈ చిత్రాన్ని స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. గతంలో 'ఘాయల్', 'దామిని', 'ఘాతక్' వంటి ఇండస్ట్రీ హిట్లను అందించిన స్టార్ డైరెక్టర్ రాజ్‌కుమార్ సంతోషి, సన్నీ డియోల్ కాంబినేషన్‌లో చాలా ఏళ్ల తర్వాత వస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను మిస్టర్ పర్ఫెక్ట్ ఆమిర్ ఖాన్ తన 'ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్' బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుండటం విశేషం. ఈ చిత్రంలో సన్నీ డియోల్ సరసన సీనియర్ స్టార్ హీరోయిన్ ప్రీతి జింతా నటిస్తుండగా, శబానా అజ్మీ, అలీ ఫజల్, కరణ్ డియోల్, కనికా కపూర్, సర్గమ్ సింగ్, ఖుషీ హజారే కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఆస్కార్ గ్రహీత ఎ.ఆర్. రెహమాన్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు.




This newspaper is Owned and Published by MOHAMMED IMRAN from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Editor MOHAMMED IMRAN by and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Gore Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial, Telangana. RNI REGD NO: TELTEL/2006/16536. Contact No.+91 9848999998, editor@churakalu.com